UNIVERSAL
LIBRARY
OU_204003
UNIVERSAL
LIBRARY

# Life of Timmarasu

(Prime Minister of Sree Kristnadevaraya)

**Chilukuri Veerabhadra Rao,**
*Author of History of Andhras,*
*Smiles Self help in Telugu,*
*Jeerna Karnata Rajya Charitram, etc.*

**EDUCATIONAL PUBLISHING BUREAU,**

INNESPET

**RAJAHMUNDRY.**

# తిమ్మరుసుమంత్రి

(కృష్ణదేవరాయల ప్రధానమంత్రి.)

గ్రంథకర్త

చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు.

ఆంధ్రులచరిత్రము, స్వయంసహాయము, జీర్ణకర్ణాటక రాజ్యచరిత్రము,

మొదలగు గ్రంథములకు కర్తలు.

రెండవకూర్పు 1000 ప్రతులు.

విద్యావిషయికగ్రంథమండలి

తెలికిచర్ల వెంకటసుబ్బారావు

రాజమహేంద్రవరము.

1918

# మొదటికూర్పు పీఠిక.

ఈ గ్రంథమును బళ్లారిలో జరిగిన మహాసభలోఁ జదువుటకై ఆంధ్రసాహిత్యపరిషత్కార్యనిర్వాహకసభ్యులగు శ్రీ జయంతి రామయ్యపంతులుగారిచేఁ బ్రేరేపితుఁడనై మొదట వ్యాసరూపమున సంగ్రహముగా వ్రాసితిని. కారణాంతరములవలన నాసభకు నేను బోవుటకుఁ గాని దీనిని సభయందుఁ గాని సాధ్యపడ లేదు. మహాపురుష చరిత్రములు మానవుల కాదర్శప్రాయములై నానావిధసద్గుణములను వికసింపఁ జేయును. దుర్గుణసాహసములను అణఁగఁద్రొక్కును. సత్కార్యముల సన్ముఖులను జేయును. మహాకార్యములఁ జేయుటకు ధైర్యమును గొలుపును. ప్రాపంచికానుభవమును పెంపొందించును. దేశభక్తిని ప్రోత్సహించును. పరమార్థమును బోధించును. ఇట్టి మహాపురుష చరిత్రములు సారస్వతమున కత్యంతావశ్యకములని చెప్పనొప్పును. సత్పురుషులైన మహాపురుష జీవచరిత్రములతో నలంకరింపఁబడని సారస్వతము సారస్వతమనిపించుకొనదు. ఆంధ్రసారస్వతమున నిట్టి జీవచరిత్రములు బహుస్వల్పసంఖ్యాకములుగా నున్నవి. ఇట్టిలోపమును నివారింపవలయునను తలంపుతో నేనీ గ్రంథరచనాభారమును వహించి పదునేనవ శతాబ్దిలో జనించిన మహాపురుషులలో నగ్రగణ్యుఁడును, మహారాజ్యతంత్రజ్ఞుఁడునై ప్రసిద్ధిగాంచిన తిమ్మరుసుమంత్రి చరిత్రమును మొదట ప్రారంభించినవాఁడను. జీవచరిత్రము వ్రాయుటకుఁ గావలసిన పరికరములు లేవు. అయినను నాకుఁ గలసాధనములనుబట్టి దేశమున జెప్పుకొనుచున్న కథలను, కవీశ్వరులు వ్రాసిన చరిత్రములను, పోర్చుగీసు ప్రణీత గ్రంథములను, శాసనములను సంశోధించి యొకమాదిరి చరిత్రమును వ్రాసి ప్రకటింపఁ గలిగితిని. అప్పాజీనిగూర్చిన కథ లనేకములు గలవు. అందలి కథ లనేకములు విశ్వాసపాత్రములు కానందునను, గ్రంథవిస్తరభీతిచేతను వానిని విడిచిపెట్టినాఁడను. ఈతిమ్మరుసు చరిత్రమును జదువువారికి కష్టదాయానికిం

గల గౌరవమునంతయుఁ దిమ్మరుసునకు ముడిపెట్టితి నని దురభిప్రాయము పడ వచ్చును. కాని నేను వ్రాసినదానిలో నతిశయోక్తు లంతగా లే వని చెప్పఁ గలను. కృష్ణదేవరాయనికిఁ గలిగినకీర్తి కంతకు మూలము తిమ్మరుసని యీ గ్రంథముఁ జదివినవారికి బోధపడఁ గలదు. తిమ్మరుసు ప్రతిభను పేర్కొనుట రాయని ప్రతిభకు భంగము కలిగించుట కాఁ జాలదు. తిమ్మరుసునకు లేని గౌరవాధిక్యమును నేను కల్పించినవాఁడను గాను. శ్రీకృష్ణదేవరాయనికి సమకాలికుఁడైన డామింగో పేయస్ను పోర్చుగీసు చరిత్రకారుఁడు తిమ్మరుసును గూర్చి యిట్లు దెలిపియున్నాఁడు.

"Salvatinica, who is the principal person that enters the building, supervises the whole, for he brought up the king and made him the king, and so the king looks on him like father. Whenever the king calls to him he addresses him as "Lord (senhor) Salvatinica" and all the captains and nobles of the realm make salam to him."

తిమ్మరుసును శిక్షించుకాలమునందు సయితము కృష్ణదేవరాయ లీ క్రింది వాక్యమును తిమ్మరుసు నుద్దేశించి పలికినట్లు సమకాలికుఁడైననూనిజను పోర్చుగీసు చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు.

"I held thee always as my great friend, and now for these forty years thou hast been governor in this kingdom, which thou gavest me."

ఈగ్రంథమునందు తిమ్మరుసునకు రాజనీతి విద్యోపదేశకుఁడు నాదెండ్ల చిట్టిగంగనామాత్యుఁ డని నేను వ్రాసినది పరంపరగా దేశములో వాడుకొనెడి కథలను బట్టిగాని మఱి యన్యము కాదు. నాదెండ్ల చిట్టిగంగనామాత్యుఁడు సామాన్యుఁడు గాఁ డనియు, మహామంత్రిశేఖరుఁ డనియు మాడయ్యగారి మల్లనకవిప్రణీత మగు రాజశేఖర చరిత్రములోని

" ఉ. సాళువనారసింహమనుజ ప్రభుకార్యకళాధురంధరుం
డైలవణాబ్ధివేష్టిత ధరాధిపదుర్మద మంత్రిమంత్రిశుం
డాలకితాన కేసరి యనంగ నసంగ సమానరూప రే

ఫాలలితాంగుఁ బెట్టి చిటి గంగన యొప్పుగుణానుషంగుఁ డై."
అనుపపత్యములవలన వేద్యము గాఁగలదు.

నాయల్పజ్ఞత్వమువలన నిం దేవేని దోషములు దొరలినవానిని దెలిపినచోఁ రెండవకూర్పున సవరించుకొందును. నేను పరస్థలమునందుండుటచేత నిందచ్చుతప్పులు కుప్పలుగఁ బడినవి. వానిని మన్నించి శుద్ధపత్రికం జూచి చదువుకొనవలయు నని చదువరుల వేఁడుకొనుచున్నాఁడను.

చెన్నపురి,
10-5-17.

చిలుకూరి వీరభద్రరావు.

# విషయసూచిక

## ప్రథమప్రకరణము.


తిమ్మరుసు వంశము

బాల్యదశ

దారిద్ర్యము

విద్యాభ్యాసనము

చిట్టిగంగ నామాత్యుడు

రాజకీయపరిస్థితులు

అస్త్రశాస్త్రపాఠనము


## ద్వితీయప్రకరణము.


తుళువవంశము

మహావిప్లవము

సమాధాకర్షణము

తుళువనరసింహుని దండయాత్ర

సాళ్వనరసింహుని పట్టాభిషేకము

తిమ్మరుసు హితబోధ


## తృతీయప్రకరణము.


ఇమ్మడి నరసింహరాయుడు

తురుష్కుల జయించుట

కోనేరునాయుని దుండగము

బహమనీరాజ్య విభాగములు

ఆదిల్ షా పరివేదనము

## చతుర్థప్రకరణము.

రాజకుటుంబరక్షణభారము
తిప్పాంబకౌటిల్యము
కృష్ణరాయని విద్యాభ్యాసము
నరసరాయనిమృతి
వీరనరసింహు పట్టాభిషేకము
వీరనరసింహుని దిగ్విజయయాత్ర
కృష్ణరాయని విజయము
వీరనరసింహరాయని తీర్థయాత్రలు
వీరనరసింహదేవరాయని పరిపాలనము
వీరనరసింహరాయని దుష్టబుద్ధి
తిమ్మరుసు పరివేదనము

## పంచమప్రకరణము.

రాజ్యపట్టాభిషేకము

## షష్ఠమప్రకరణము.

తిమ్మరుసు కారుణ్యము
తిమ్మరుసు కార్యనిపుణత్వము
తిమ్మరుసు చారపద్ధతి
కృష్ణరాయని ప్రార్థనము
తిమ్మరుసు హితబోధ
ప్రథమ సంస్కారణము
ఇతరసంస్కారణములు
విద్యాగోష్ఠి

## సప్తమప్రకరణము.

దక్షిణదిగ్విజయము
తిమ్మరుసు పూర్వదిగ్విజయ యాత్రకుఁబ్రోత్సహించుట.
నగరాధ్యక్షుని నిర్ణయించుట
సేనాధిపత్యపట్టబంధనము

## అష్టమప్రకరణము.

దండయాత్ర వెడలుట
ఉదయగిరి ముట్టడి
కొండవీడును ముట్టడించుట
శ్రీకృష్ణదేవరాయనిసాహసము
రాజమహేంద్రపురమును గైకొనుట
పాత్రసామంతుల యుద్ధము
పాత్రసామంతులమోసపుచ్చుట

## నవమప్రకరణము.

తిమ్మరుసు తురుష్కులను జయించుట
తిమ్మరుసు మేనల్లుండు
రాచూరి దండయాత్ర

## దశమప్రకరణము.

తిమ్మరుసు పరిపాలనము
అంత్యదశ

# తిమ్మరుసు మంత్రి

## ప్రథమప్రకరణము

“చ. కరచరణాదు లందఱుఁ గల్గినయంతట నే సమర్థతన్
మెఱపడి గాంచ నేర్తురొ మనీషవరుల్ ధరలోన నెవ్వరి
క్కరణిఘటింపుమం గృతయుగంబునఁ ద్రేతను ద్వాపరంబునం
బరయఁగ సాళ్వతిమ్మసచివాగ్రణికి న్సరిమంత్రి గల్గెనే?”

(కుమారధూర్జటి.)

“సీ. ఏమంత్రిమణి నిజస్వామికార్యక్రియాతత్పరమాన సోత్సాహశాలి
యేమంత్రిమణి మిత్రహితబాంధవాశ్రితప్రకరరక్షణకళాప్రౌఢబుద్ధి
యేమంత్రిమణి వచోహేలాతినైర్మల్య శీతలతాధూతశీతరోచి
యేమంత్రిమణి సుధాధామశాంభవదామ ధాళధళ్యసతుల్యధవళకీర్తి
యట్టిమంత్రిశిరోత్తంస మహితనృపతి
పటలమకుటాగ్రఘటితపత్పద్మయుగళి
సకలకర్ణాటరక్షావిచక్షణుండు
దీనసురశాఖి సాళువ తిమ్మమంత్రి.”

(మాదయగారిమల్లనకవి.)

## తిమ్మరుసు వంశము

తిమ్మరుసు పూర్వులు సాళ్వవంశీయు లైన నృపాలుర యొద్ద మంత్రిత్వాదిపదవులను వహించి సుప్రసిద్ధకీర్తిఁ గన్న వా రగుటచేత వీరివంశమునకు సాళ్వవంశ మని పేరు వచ్చె

నది. ఈవంశమువారికిఁ దొలుత కొండవీటిసీమయె స్వస్థానముగ నుండెను. ఈసాళ్వవంశమువారు కౌండిన్యసగోత్రులైన యార్వేలనియోగిబ్రాహ్మణులు. * తిమ్మరుసు సాళ్వవంశసంజాతుఁ డైన వేమరాజునకుఁ బౌత్త్రుఁడు. రాచిరాజునకుఁ

---

* దక్షిణహిందూస్థానచరిత్రమున సాళువవంశ మనియెడి యొక సుప్రసిద్ధక్షత్రియవంశము గన్పట్టు చుండుటచేతను 'సాళువ తిమ్మరుసు' అను పేరుతో సాళువశబ్దమును, అరుసుశబ్దమును గన్పట్టు చుండుటచేతను, కృష్ణరాయనిపిన్నతండ్రి తిమ్మరాజొకఁ డుండుటచేతను, కొందఱాంగ్లేయచరిత్రకారులు తిమ్మరుసు క్షత్రియుం డని వక్కాణించిరి. కాని తిమ్మరుసు మేనల్లుఁ డగునాదిండ్ల అప్పామాత్యున కంకితము గావింపఁబడిన రాజశేఖరచరిత్రములో మాదయగారి మల్లనకవిచే ద్వితీయాశ్వాసాంతమున

"సుగంధి. పారదప్రభావిభాసి భవ్యకీర్తివాహినీ
పూరదానధూతదివ్యభూజకామధేను దు
ర్వారగయాలువేలవంశవార్ధిపూర్ణచంద్రమా
సారబుద్ధిజాల నీత శత్రుభూమిభృద్రమా."

అనుపద్యములో వర్ణింపఁబడినవిధమునుబట్టియు, మంగళగిరిదేవాలయస్తంభములమీఁదిశాసనములంబట్టియు, తిమ్మరుసు నియోగిబ్రాహ్మణుఁ డగుట స్పష్టమగు చున్నది. మఱియు నితఁడు క్షత్రియుఁడు గాక బ్రాహ్మణుఁ డని తెలుపుశాసనము లనేకములు గలవు. శ్రీ సింహాచలస్వామియాలయములోని యొకశాసనములో :—

"శాకాబ్దే బహుధాన్యనామనినభో వేదాబ్ధిచంద్రాన్వితే
కార్తిక్యాం శశివాసరేశుభతిథౌ సింహాచలస్వామినే
హారంకర్ణవిభూషణే చకటకే శ్రీకృష్ణరాయాధిపా
మాత్యోరాచయ సాళ్వతిమ్మనృపతిః ప్రాదాద్విజన్మాగ్రణిః."

అని తిమ్మరుసు బ్రాహ్మణుఁ డనియె వక్కాణింపఁబడియెను.

బుత్త్రుఁడు. నాదిండ్లవారిదౌహిత్త్రుఁడు. ఇతనిపేరు తిమ్మరాజు. అరుసుశబ్దము కర్ణాటకభాషలో రాజుశబ్దమునకుఁ బర్యాయపదము గావున తిమ్మరాజు తిమ్మరుసని వ్యవహరింపఁబడుచుండెను. ఇతనితాతయుఁ దండ్రియుఁ గూడ కర్ణాటకసామ్రాజ్యసార్వభౌములగుప్రౌఢదేవరాయనికిని, మల్లికార్జునరాయనికిని సామంతనృపతులుగ నున్న సాళ్వవంశీయులైన మహారాజుల కడ మంత్రులుగ నుండి ప్రఖ్యాతిఁ జెందినవారైనను మల్లికార్జునరాయనికాలమునఁ గొండవీటిరాజ్యము నుదయగిరిరాజ్యమును గజపతులాక్రమించుకొన్నందున సాళ్వరాచిరాజు తనయైశ్వర్యమునంతయును గోల్పోయి సకుటుంబముతోఁ జంద్రగిరిరాజ్యమునకు వలస పోయెను. సాళువరాచిరాజునకు తిమ్మరాజుమాత్రమె గాక గోవిందరాజను మఱియొకపుత్త్రుఁడును, కృష్ణమాంబ యనునొకపుత్త్రియును గలరు. సాళువరాచిరాజు చంద్రగిరిరాజ్యమునకు వలస పోయినపిమ్మట నే యీసత్సంతానమును బడసెను. కావున తిమ్మరుసు జన్మస్థానము చంద్రగిరి యని చెప్పవచ్చును. తిమ్మరుసు క్రీ. శ. ౧౪౬౦-వ సంవత్సరప్రాంతమున జన్మించి యుండెను. ఇతనిబాల్యమునందే తల్లిదండ్రు లిరువురు స్వర్గస్థులైరి. రాచిరాజు తనకొమార్తెను సాళ్వనరసింహరాయనికడఁ బ్రధానమంత్రిగ నున్న కౌశికగోత్రసంజాతుఁడైననాదిండ్ల చిట్టిగంగనామాత్యుని యన్నమనుమఁడగు తిమ్మరాజున కిచ్చి వివాహము గావించెను. తల్లిదండ్రులు కాలగతిఁ జెందినందున సోదరు లిరువురును దమ

తోఁబుట్టువు నామెయు త్తవారింట దిగవిడిచి చదువును సంధ్యయు లేనివార లై కొంతకాలము స్వేచ్ఛగా నూరూరఁ దిరుగుచుండిరి.

## బాల్యదశ.

ఒకనాఁడు తిమ్మన చంద్రగిరిప్రాంతారణ్యభూమిలోఁ దిరుగాడుచు నలసి మధ్యాహ్నసమయమున నొకచెట్టునీడను బరుండి గాఢనిద్ర పోవుచుండెను. అంతట సూర్యుఁడు పశ్చిమమునకు వాలుటచే సూర్యకిరణము లాతనిమోమును సూటిగా దాకుచున్నను మెలఁకువ రాక గాఢనిద్ర పోవుచున్న యాబాలుని సమీపమునకు నొకకృష్ణసర్ప మరుదెంచి తనఫణమును విప్పి వానిమోమున నెండ సోఁక కుండ గొడుగువలె నడ్డము పెట్టెను. అప్పు డాదారిని పోవుచున్న సిద్ధుఁ డొక డాయద్భుతచర్యను గన్నులారఁ గాంచి యాబాలుఁడు మహదైశ్వర్యపదవి నొందఁగలఁ డని గ్రహించి సమీపమునకుఁ బోఁగా నాసర్పరాజము వానిని విడిచి పాఱిపోయెను. అంతట నాసిద్ధుఁడు చిన్నవానిని లేపి "నాయనా! నీ కచిరకాలములోనే మహదైశ్వర్యపదవి లభించును; మహారాజభోగంబు లనుభవింతువు; ఇట్లెన్నఁడు నొంటరిగ నరణ్యమునఁ బండుకొనకుము; శీఘ్రముగా నింటికి వెడలి పొమ్ము." అని పలికి తనదారిని బట్టుకొని తాను వెడలిపోయెను. అప్పు డాబాలుఁడు తనలోఁ దా నిట్లు వితర్కించుకొనియెను.

"నేను బాలుఁడను; తల్లిదండ్రులు లేనివాఁడను; నాకు విద్య యెట్లు లభించును? నా కెవ్వరు దిక్కు? దేశములోఁ ద్రిమ్మరి నై తిరుగుచున్న నన్నుఁ జేరఁదీయువా రెవ్వరు? నాకు మహదైశ్వర్యపదవి యబ్బు ననియు, మహారాజభోగంబు లనుభవింతు ననియు నీమహానుభావుఁ డెవ్వఁడో పలికి పోయెనే? ఇతఁ డేమిపరిహాసమునకై పలికెనా? ఇతఁడు నావంటిబాలునితోఁ పరిహాస మేల చేయును? ఇతఁడు వాక్పారిశుధ్యము గల సిద్ధునివలెఁ గానుపించుచున్నాఁడు. అవు నతఁడు సిద్ధుఁడే. అతనిపలుకు వృథాపోవదు. నేను తప్పక యైశ్వర్యపదవిఁ బడయుదు. మహారాజభోగము లనుభవింతును. అందులకు నేను మున్ముందు విద్యాధనమును సముపార్జింతును. ఎన్నికష్టముల నైనఁ బడి ముందుగా విద్యాధనమును గడించిన నైశ్వర్యము దానంతట నదియె చేకూరఁగలదు."

ఇట్లు చింతించుచు నాతఁడు చంద్రగిరికి మరలివచ్చెను. తనతమ్ముఁడు గోవిందుఁడు తోడిబాలురతో నాడుకొనుచుండ నాతనిం బిలిచి సిద్ధుఁడు తన్నుఁ జూచి పలికినపలుకులు చెప్పెను. అప్పలుకులు విని గోవిందుఁడు పక్కున నవ్వెను. బాలు రెల్లరును విని 'మనతిమ్మనికి మహదైశ్వర్యపదవి యెత్తు నఁట! మహారాజభోగంబు లనుభవించు నఁట! విన్నారా యీవింత? అని పరిహాసముగాఁ బలుకుచుఁ జప్పటులు గొట్టిరి. ఒక బాలుఁడు సమీపించి 'తిమ్మన్నా! నీవు మహారాజ వగుదువేని నాకు మంత్రిపద మీయవలెను జుమా' అని నుడివెను.

మఱియొకబాలుఁడు సమీపించి ‘‘మనతిమ్మన్నకు మహదై శ్వర్య మెత్తినప్పుడు మన కందఱకు మున్నూఁటయఱువది దినంబులు బూరెలతో భోజనము పెట్టి, మనుగుడుపు పెండ్లి కొడుకుల మనుపునట్లు మనుపు చుండును లే యని యెగతా ళిగఁ బలికెను. ఇం కొకబాలుఁడు వచ్చి ‘మఱే లే మన తిమ్మన్న కప్పుడు మనమాట జ్ఞప్తి యుండునా? అతఁ డెవ్వ రో మన మెవ్వరమో? అని నిష్ఠురోక్తులు పలికెను. ‘మిత్రు లారా! దరిద్రునికిఁ గోరికలు మెండని పెద్దలు చెప్పినవిధము గా మనతిమ్మన్నకుఁ బెద్దకోరిక లే పొడమినవి. నా రేమి వెఱ్ఱి వారలా?’ అని వే ఱొకబాలుఁడు వచించెను. ఇట్టివిధముగా బాలు రెల్లరు నెవ్వారికిఁదోఁచిన పోటుమాటలను వారు పలికి మనస్సు నొప్పించిరి. అతఁడు సూక్ష్మబుద్ధి కలవాఁడు గావున వారియెగతాళిపలుకుల కుడుకుఁజెందక వారలయెదుటఁ దమ్మ నకు సిద్ధునిపలుకులు వినిపించుట తప్పని గ్రహించి వారలతో నవ్వుచునాటల నాడుచుఁ బాటలఁ బాడుచు నాఁటిదినము సం తోషముతో గాలము పుచ్చెను. అతఁ డానాఁటిరాత్రి పండు కొనియున్నవేళ సిద్ధునిసుద్దులు మరల దలఁపునకు రాఁ గా నిద్దురపట్టక తనలోఁ దా నిట్లు తలపోసికొనియెను.

‘‘ఎవ్వఁ డీప్రపంచములో బహుజనోపకారి యైప్ర వర్తింపుచుఁ దనజన్మమును సార్థకపఱచుకొనునో వాఁ డే పురుషుఁడు; వానిదే యుత్తమజన్మము. వానికీర్తి శాశ్వత బ్రహ్మకల్పముగా భూమిపై నిలుచును. విద్యయు ధనము

నున్నఁగాని జన్మము సార్థక్యతఁ గాంచదు. బహుజనోపకారి కావలె నన్న నవశ్యము పురుషుఁడు విద్యాధనముల రెంటిని సముపార్జించవలయును కాలముయొక్క విలువను గుర్తెఱింగి వర్తించినఁ గాని యవి సంప్రాప్తములు గావు. ఇంతకుఁ బూర్వమువలె నాఁటపాటలతోఁ గాలము గడిపిన, నాజన్మము వ్యర్థము కాఁగలదు. ఇఁక నేనొక క్షణ మైనను వ్యర్థముగాఁ బోఁగొట్టుకొనఁ జాలను. చెడి బంధువులయిండ్లకుఁ జేరుటకంటె విద్యాభ్యాసముఁ జేయుసంతవఱకు మాధుకరవృత్తిచే జీవింపుచుఁ గాలముగడుపుటయె యుత్తమపద్ధతి. దాన దోషమేమియును గానుపింపదు. సిద్ధునిపలుకులు యథార్థము లనిపించుట కైనను నేను మనఃపూర్వకముగాఁ బరిశ్రమ చేసి కృతార్థుఁడ నగుదును. నాకు మహదైశ్వర్యము లభించిన నాజన్మము బహుజనోపకారకర మై శాశ్వత మైనయశస్సును బొందును'' ఇట్లు తలపోసికొను చుండ నాబాలునకు నిదురపట్టెను.

## దారిద్ర్యము

తల్లిదండ్రులు బాల్యముననే పరలోకగతు లైన చిన్నవా రగుటచేత నీబాలు రిరువురు దారిద్ర్య మను పెనుభూతము నెదుర్కొనవలసినవా రైరి. అష్టకష్టములపా ల్సేసి మనస్సు కలంచివైచునది దారిద్ర్యము. గుండెదిటవు లేనివారిని పలాయనులను గావించి దుఃఖపరంపరలఁ బొరలాడించునది దారిద్ర్యము. మృత్యువుకంటెను కష్టప్రద మైనది దారిద్ర్యము దారిద్ర్యము తలకెక్కినా పోటుబంటులు పిఱికిబంటు లగు

దురు. సత్యవంతు లసత్యవంతు లగుదురు. వివేకు లవివేకు లగుదురు. జీవితరంగమున దారిద్ర్యము నెదుర్కొని పోరాడి జయించినవాఁడె మహావీరుఁడు గాని బలాఢ్యుఁడై రణరంగమున శత్రువుతలఁ దఱిఁగినవాఁడు మహావీరుఁడు గాఁడు. మనుజునకు దీనింబోలిన శత్రువు ధాత్రిలో మఱియొకటి గానరాదు. ఆత్మగౌరవ మున్నవాఁడు, జితేంద్రియుఁడైనవాఁడు, స్వశక్తి విశ్వాసము గలవాఁడు, దైవమునెడ శ్రద్ధాభక్తులు చూపువాఁడు, నిరంతరకర్తవ్యుఁడు నైనవాఁడు మాత్రమె దారిద్ర్యభూతమును బాఱఁద్రోలఁగలఁడు. వీనితేజస్సునందు దారిద్ర్యభూతము సుస్థిరముగా నిలువఁజాలదు. ఇట్టిసుగుణసంపత్తి గల ప్రతిభాశాలికిమాత్రమె దుర్భరమైన దారిద్ర్యముతోడి పోరాటము సాధ్య మగును. సమర్థుఁడైన ప్రతిభాశాలిమాత్రమే ఈపెనుభూత మడంచినట్టివాఁడు. వీనితోఁ బోరాటము పెట్టుకొనె నేని దారిద్ర్యభూతము దినక్రమమువరుసను దనబలము నంతయుఁ గోల్పోయి తనబలమునంతయుఁ దనశత్రువు కైకొనఁగా కడపటివానిని విడిచి యదృశ్యమై పోవుట నిశ్చయము. ఆబాలు రిరువు రట్టిప్రతిభాశాలు రగుటంజేసి దారిద్ర్యభూతము నొకలెక్కగాఁ గొనక స్వప్రయత్నముచేత విజయమును సాధింప సమకట్టిరి.

### విద్యాభ్యసనము.

రామునియెడ లక్ష్మణుఁ డెట్టిభక్తివిశ్వాసములు చూపియుండెనో యట్లే గోవిందుఁడు తనయన్న యగుతిమ్మనయెడ

భక్తివిశ్వాసములు చూపుచుండుట యూతనియదృష్ట మని చెప్పఁదగి యున్నది. అన్నమాట తమ్ముఁ డెన్నఁడును జవ దాటి యెఱుఁగఁడు. అందువలన నాసోదరు లిరువురును రామ లక్ష్మణులవలె నన్యోన్యానురాగముతో ప్రవర్తింపుచు విద్యా భ్యాసమునకు దొరకొనిరి. అన్నదమ్ము లిరువురు ప్రతిదిన మును సూర్యోదయమునకు ముందుగా లేచి కాల్యకరణీయం బులు దీర్చుకొని, సువర్ణముఖికిఁ బోయి, స్నానసంధ్యాద్యనుష్ఠా నంబులు నిర్వర్తించికొని, ప్రాతఃకాలమున నుపాధ్యాయులకడ కేఁగి, కావ్యపఠన మొనరించి, సూర్యుఁడు నెత్తికి దిన్నఁగా నుంట వెలుంగువేళ సోదరులలో నొకరు మాధుకరమునకై బయలు దేఱి కొంత ప్రసాదమును సంపాదించుకొని వచ్చిన పిమ్మట నిరువురును గలిసి భుజింపు చుందురు. భోజనముచేసి కొంతవిశ్రాంతిగైకొన్న మీఁదట దస్తూరి కుదుర్చుకొనుటకై గంటములతోఁ దాటాకులమీఁద వ్రాయుచుందురు. తరువాతఁ గొంతసేపు తెనుఁగు కావ్యపఠన మొనరించి, పిమ్మట రాజకీ యోద్యోగులకడ కేఁగి వారల నాశ్రయించి వారలను వినయ విధేయులై వారు నియమించిన పనులను గావించి, సాయంకాల మైనతరువాత, పర్వతములు, చెఱువులు, నదులుగల ప్రదేశము లకు వాహ్యాళి వెడలి, ప్రకృతి సౌందర్యమును దిలకింపుచు నానందించు చుందురు. అటుపిమ్మట నింటి కరుదెంచి రాత్రి భోజన మైనతరువాతఁ గొంతసేపు భారతకథలను గాని, రామా యణకథలను గాని పూర్వరాజన్యచరిత్రలు మఱియేవియైనఁగాని

పెద్దలవలన వినుచుండురు. ఇట్లైదాఱుసంవత్సరములు బహుకష్టపడి సంస్కృతాంధ్రభాషలయందు చక్కనిపాండిత్యమును సంపాదింపఁగలుగుటయు కాక గొప్పవ్రాయసకాండ్రుడుకూడ నైరి. ఇంతియ గాక శాస్త్రము లభ్యసించుటకై పండితులుండెడిస్థానములకుఁ బోయి వారల నాశ్రయించి వారలకు శుశ్రూషలు గావించి శాస్త్రాభ్యసనము కూడఁ గావించిరి. సుప్రసిద్ధగణకులకడ కేఁగి రెండుమూఁడుసంవత్సరములు గణితశాస్త్రమునందుఁ గృషిచేసి ప్రావీణ్యమును సంపాదింపఁగలిగిరి. అతిసూక్ష్మబుద్ధి కలవాఁడగుటచేత తిమ్మన గోవిందుని కంటెను మేధావియై వన్నెకెక్కుచుండెను. తనబుద్ధిసూక్ష్మతచేత తిమ్మనార్యుఁడు ప్రపంచములోనివస్తుతత్త్వమును బాగుగా గ్రహింపుచుండెను. ఎప్పు డీతఁడు నెక్కడకుఁ బోయినను మనుష్యస్వభావమును గ్రహించుటకే ప్రయత్నము సేయుచుండెను. అరణ్యమునకుఁ బోయిన వివిధజాతివృక్షములతత్త్వములను గ్రహింపుచుఁ దెలియనివానిగూర్చి, దెలిసినవారి నడిగి తెలిసికొనుచుండెను. ఇట్లే జలచరములు, చతుష్పాదజంతువులు, మొదలగువాని యొక్కస్వరూపగుణస్వభావముల గుర్తింపుచు నాతఁ డెంతయో విజ్ఞానమును సంపాదించెను.

“శరీరమాద్యం ఖలు ధర్మసాధన” మ్మని చెప్పుచును శరీరారోగ్యమును గాపాడుకొనుచు దృఢకాయులుగ నుండవలయు నని నిరంతరమును దేహపరిశ్రమ చేయుచుండిరి.

ఆంధ్రకర్ణాటకములలో నుండునానాజాతిసాంప్రదాయచరిత్రముల నేర్పుతోఁ బఠించిరి. ఇట్లిరువది రెండుసంవత్సరములవయస్సు వచ్చునప్పటికి సంస్కృతాంధ్రములయందు సంపూర్ణపాండిత్యమును చాలనఱకు శాస్త్రీయపరిజ్ఞానమును, గణకవిద్యానైపుణ్యమును గడించి విశేషప్రతిభావంతు లనియు, దయార్ద్రహృదయు లనియు, కార్వేటినగరము, నారాయణవనము, చంద్రగిరి, గుత్తి, పెనుగొండ మొదలగుపట్టణములఁ బ్రఖ్యాతిగాంచు చుండిరి. ఇఁక వీరలు రాజనీతిశాస్త్రమును దెలిసికొనవలసియుండెను.

## చిట్టిగంగనామాత్యుఁడు.

ఈబాలు రభ్యసింపవలసినశాస్త్రములలోఁ బ్రధానమైనది యర్థశాస్త్రము. దానిని బోధింపఁ గలపండితులసంఖ్య బహుస్వల్పముగ నుండెను. అట్టిశాస్త్రమును బోధింపఁ గల మహనీయుఁ డొక్కఁడు చంద్రగిరిరాజ్యమునం దుండెను గాని యతఁ డెల్లరకు సులభసాధ్యుఁడు గాఁడు. అతఁడు కౌశికగోత్రుఁ డైననాదిండ్ల చిట్టిగంగనామాత్యుఁడు. ఈ మహనీయుఁడు తాను వృద్ధుఁ డైనను చంద్రగిరిరాజ్యాధిపతి యైన సాళ్వనరసింహ మనుజాధీశ్వరునిప్రధానమంత్రిగ నుండి యారాజ్యమును విస్తరింపఁ జేయు చుండెను.

ఇతఁ డిప్పటికి డెబ్బదేండ్లు నిండినవయస్సు గలవాఁడైనను గాయపుష్టియును, బుద్ధివైశారద్యము నితనికి బలీయముగ నుండెను. ఈమంత్రిశిఖామణి మనబాలురకు బంధువుఁ

డైనను దైన్యదశయం దుండియు వీ రేమికారణముచేతనో చిట్టిగంగనామాత్యునిప్రాపును మొదట నభిలషింప లేదు. ఈ బాలురు విద్యాభ్యాసము గావించి పేరుపొందినవా రగుట విని నాదిండ్ల చిట్టిగంగనామాత్యుఁడు వీరలను దనపట్టన మగునారాయణవనమునకు రప్పించెను. ఆకాలమునందు నారాయణవనము చంద్రగిరిరాజ్యమునకు రాజధానీనగరముగ నుండెను. సాళ్వ నరసింహభూపాలుఁ డిచ్చటనే నివసించు చుండెను గావున నాతని ప్రధానమంత్రి యగుచిట్టిగంగనామాత్యుఁడు గూడ నారాయణవనమునందే నివసించు చుండును. ఈగంగనామాత్యుఁడు సాళువతిమ్మరాజును గోవిందరాజును రప్పించి వారివిద్యలను బరీక్షించి యామావిద్యలయందు వారికిం గలప్రజ్ఞావిశేషములం బరికించి మిక్కిలిసంతోషించి తనదివాణమునందు లేకరులనుగా నియమించెను. అల్లు వారు చిన్నపదవులం దుండి తమ ప్రజ్ఞావిశేషములను జూపుచుఁ బైయధికారపదవులను సంపాదించుకొని ప్రవర్తించు చుండుటను గాంచి గంగనామాత్యుఁడు వారు రాజనీతిశాస్త్రము నభ్యసించినమహోన్నత పదవి నందఁగల రని నిశ్చయించి ప్రేమానురాగము లుట్టిపడ నొకనాఁడు తిమ్మనార్యుని రప్పించి 'తిమ్మన్నా! నీవు కడుబుద్ధిమంతుఁడవు; ప్రతిభాశాలివి; నీపూర్వులు మంత్రిపదవులను బొంది ప్రఖ్యాతిఁ గాంచినవారు. వారికంటెను, మాకంటెను నీవుప్రజ్ఞాఢ్యుఁడవై యుత్తమస్థానము నలంకరించియీదక్షిణ హిందూస్థానమున కంతకును సర్వాధికారివై ధర్మపరిపాల

నము గావింపఁగల వని నీశక్తి నిబట్టి నేను గ్రహించితిని. నీవంటి సమర్థుఁడు నేఁడు మఱియొకఁడు నాకీరాజ్యమునఁ గానరాఁడు. నేను వృద్ధుఁడ నైతిని. నాకుం దెలిసిన రాజనీతిశాస్త్రీయమర్మములు నన్నిటిని మహారాజ్యాంగతంత్రవిధానములతోడం గఱపి నిన్ను రాజనీతివిద్యావిశారదునిగా నొనరింపఁ నీయందుఁ గల మమకారము నన్ను శతవిధములఁ బ్రేరేపించు చున్నది. నాయనా! ఒక్కమాట మనస్సునం దుంచుకొనుము. హైందవధర్మరక్షణార్థమై స్థాపితమైనయీసామ్రాజ్యము వినాశము నొందకుండ, మ్లేచ్ఛాక్రాంతము గాకుండఁ జూచుకొమ్ము. నీజీవితకాలమున నీవొనర్పవలసిన విధ్యుక్తధర్మ మిదియే యని యెఱుంగుము. నీబొందిలో ప్రాణ మున్నంతదనుక దీని మఱువకుము.

## రాజకీయపరిస్థితులు.

చెట్టు చెడుకాలమునకుఁ గుక్కమూతి పిందెలు పుట్టినటులు సంగమరాజవంశమున దౌర్భాగ్యులు పుట్టి హరిహరప్రౌఢదేవరాయాదిరాజన్యవర్యులు సంపాదించిపెట్టిన సామ్రాజ్యవైభవమును గ్రమముగాఁ గోల్పోవుచు దుర్వృత్తులంబడి దుర్బలులై యొండొరులం జంపుకొనుచు స్వేచ్ఛావిహారులై వర్తింపుచుండుటయు, ఒకవంక బెడందకోటసుల్తాను (Sultan of Beder) కర్ణాటసామ్రాజ్యమును గబళింపఁజూచుటయు, మఱియొకవంక నోఢ్రరాజపురుషోత్తమగజపతి విజయనగరసామ్రాజ్యము పై దండయాత్రలు సలుపుచు నుదయ

గిరిపర్యంతము భూభాగము నాక్రమించుకొని పరిపాలించు చుండుటయుఁ దలపోసి యీనరపతి సామ్రాజ్యము దక్షిణ హిందూస్థానమున వర్థిలఁజేయ వలయు నని బుద్ధిమంతుఁడును, బాహుబలశాలియు మహాయోధుఁడు నగునీసాళువనరసింహ భూపాలుని నీ సామ్రాజ్యమునకుఁ బట్టాభిషిక్తుని గావింప దృఢ సంకల్పుఁడ నై పదేండ్లుగాఁ బ్రయత్నించు చున్నాఁడను. బహామనీసుల్తాను రెండవమహమ్మదుషాహ దండెత్తివచ్చి గండికోటదుర్గమును ముట్టడించినప్పుడు, కళింగదేశాధీశ్వరుం డైన పురుషోత్తమగజపతి కాంచీపురము పై దండెత్తి వచ్చినప్పుడు సాళ్వనరసింహునిసైన్యములు దలంపడి వారల నోడించి తఱుమునట్లు చేసితిని. సాళ్వనరసింహభూపతిని కర్ణాటసామ్రాజ్యమున కంతకు నభిషిక్తుని గావింపవలయు నని పెద్దకోరికతో నున్నవాఁడను. ఈసాళ్వనరసింహభూపాలుఁడు సర్వస్వతంత్రుఁడై పరిపాలనముఁ జేయుచున్నను విద్యానగరమున (విజయనగరము) సంగమరాజవంశీయులు సింహాసనస్థు లై యుండ నుపేక్షించి యూరకుండుట హైందవసామ్రాజ్యమునకు క్షేమకరము గాదు. ఏవేళనో బలవంతు లైనబహమనీసుల్తానులు నోటవేసికొందు రనుభయము గలదు. నే నొకవేళ నామహాత్కార్యము నెఱవేర్చునంతవఱకు జీవించియుండుట తటస్థపడక పోయెనేని నీమహాకార్యమునకుఁ బూనుకొనవలయును. దీని నీవు వాగ్దత్తముచేసినయెడల నీకు రాజనీతి శాస్త్రీయ మర్మ

ములనన్నిటిని బోధించి ప్రధానమంత్రి స్థానమునకుఁ గ్రమముగా రప్పింతు" నని యెచ్చరించెను.

అప్పుడు తిమ్మనార్యుఁడు 'అమాత్యవర్యా! నీయభీష్టమునుదీర్చుటకన్నఁ బరమోత్కృష్టమైనకార్యము నాకు మఱియొండు లేదు. అవశ్యము హైందవసామ్రాజ్యాభివర్ధనమునకై నాజీవితమును ధారపోయుదును. కృష్ణానదికి దక్షిణభాగమునుండి యశ్వపతులను గజపతులను బాఱఁద్రోలి మఱిమొప్పుడును నడుగుపెట్టకుండఁజేయుదను. మహాత్మా! నీకుం దెలిసిన రాజనీతిని సాంగోపాంగముగా బోధించి నాజన్మము కృతార్థతం బొరయునట్లు గావించి యాశీర్వదింపుము. నీకరుణాప్రసాదమున సమస్త హైందవాళియొక్క మన్ననకుఁ బాత్రుఁడనై యార్యధర్మరక్షణార్థమై నాజీవితమును ధారపోసి వాసికెక్కెదు' నని పలికెను. ఆపలుకుల కావృద్ధమంత్రి పరమానందమును బొంది యానాఁడు మొదలుకొని రాజనీతిబోధకంబు లగునర్థశాస్త్రీయ రహస్యంబుల బోధింపుచు వచ్చెను. రెండుసంవత్సరముల కాలములో దండనీతి యనుగొప్పశాస్త్రములోనిమహావిషయముల నన్నిటిని బోధించెను.

## అర్థశాస్త్రపఠనము.

మనువు, బాహుదంతుఁడు, బృహస్పతి, శుక్రుఁడు వ్రాసిన మహావిషయములను బోధించెను. భరద్వాజుఁడు, పరాశరుఁడు, వ్యాసుఁడు, వైశంపాయనుఁడు, ఘోటముఖుఁడు పిశునుఁడు, కౌణపదంతుఁడు, వాతవ్యాధి, కాత్యాయనుఁడు,

చారాయణుఁడు, కింజల్కుఁడు మొదలగు స్మృతికర్తలు వ్రాసిన నీతిశాస్త్రములు నేఁడుఖిలములై యున్నను, ఆకాలమున వ్యాప్తములో నున్నందున వానిలోనిరహస్యముల నన్నిఁటిని తెలియఁజెప్పెను. కౌటిల్యునియర్థశాస్త్రమును, కామందకుని నీతిసారమును జక్కఁగా జదివించి ప్రజ్ఞాఢ్యునిఁ గావించెను. ఇట్లనేకశ్రద్ధాభక్తులు గలిగి చిట్టిగంగనామాత్యునివలనఁ దిమ్మరుసుమంత్రి విద్యాసముద్దేశము, వృద్ధసంయోగము, అమాత్యోత్పత్తి, మంత్రిపురోహితోత్పత్తి, దూతప్రణిధి, జనపదనివేశము, దుర్గవిధానము, దుర్గనివేశము, సీతాధ్యక్షుత్వము, పణ్యాధ్యక్షత్వము, శుల్కాధ్యక్షత్వము, ధర్మస్థేయము, వ్యవహారము, కంటకశోధనము, యోగవృత్తము, అరిమిత్రోదాసీనాది ద్వాదశరాజమండలములు, వివిధరాజ్యాంగములయుత్తమస్థితి, శమవ్యాయామికము, పౌరుషము, దైవసహాయము, సంధివిగ్రహయాన ద్వైధీభావాసన సమాశ్రయములు, వ్యసనాధికారికము, అభియాస్యత్కర్మము, సాంగ్రామికము, సంఘవృత్తము, అబలీయసము, దుర్గాలంబోపాయము, ఔపనిషదికము, స్వబలోపఘాతప్రతీకారము, వంచనము, తంత్రయుక్తులు మొదలగు మహావిషయములను గూర్చినపరిజ్ఞానమును మెండుగా సంపాదించెను.

# ద్వితీయ ప్రకరణము.

## తుళువ వంశము. *

మొదట చంద్రగిరిరాజ్యమునకు నటుపిమ్మట నూత్న కర్ణాట సామ్రాజ్యమునకుఁ బట్టాభిషిక్తుఁడైన సాళువగుండయ నారసింహ భూపాలుని సైన్యాధ్యక్షుఁడును ముఖ్యమంత్రియు నగునరసరాజు తుళువ వంశమునందు జనించిన యీశ్వరరాజునకుఁ బుత్త్రుఁడై యుండెను. ఈశ్వరనాయకుండును గొంత కాలము సాళ్వనరసింహ భూమిపాలునకు సైన్యాధ్యక్షుఁడుగ నుండెను. వీరిది తుళువవంశము. ఈవంశమునఁ దిమ్మనుదండ నాథునకు నీశ్వరరాజు జనించెను. వీనికి నరసరాజు పుట్టెను. ఈశ్వరరాజు విఖ్యాత సేనానీశ్వరుఁడుగా నుండి బహుదేశము

* మహమ్మదీయ మహాయుగములో తుళువవంశము సాళువవంశాంతర్గతమనియు, తుళువ నరసరాజు సాళువనరసరాజునకు అన్నమనుమఁడనియు శ్రీయుత కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులు, ఎం. ఏ., గారు వ్రాసియున్నారు. ఆంధ్రకవుల చరిత్రములో "ఈతిమ్మయ యీశ్వరరాజు సాళువగుండ నరసరాజునకు సేనానాయకుఁడగుటయే గాక దాయాదుఁడు కూడనై యుండుటచేత నాతని యనంతరమున రాజ్యమును వహించినట్లు తోఁచుచున్నది" అని యొకచోటను, 'నరసింహరాజునకు (సాళువ) తిమ్మరాజను పేరుగల జ్యేష్ఠభ్రాత యొకఁడుగలఁడు. అతఁడే యీశ్వరరాజు తండ్రియైన సాళువతిమ్మరాజని తోఁచుచున్నది' అని యొకచోటను శ్రీయుత రావుబహదుర్ కందుకూరి వీరేశలింగముపంతులుగారు వ్రాసిన వ్రాఁతయు పై వారు వ్రాసినవ్రాఁత కాధారమై యుండవచ్చును. ఇందుకుఁ బ్రమాణ

లను జయించి సాళ్వనరసింహరాయనిరాజ్యమును విస్తరింపఁ జేసెను. వీనివిజయములనుగూర్చి వరాహపురాణమునం దిట్లభి వర్ణింపఁబడియెను.

"సీ॥ ఉదయాద్రి ఛేదించె హుత్తర నిర్జించె
గండికోటపురంబుఁ గదల ద్రివ్వెఁ
పెనుగొండ సాధించె బెగ్గలూరు హరించె
గోవెలనెల్లూరు గుంటుపటిచెఁ
గుండాణి విదలించె గొడుగుచింత జయించె
బాగూరు పంచముపాడు చేసె
నరుగొండ పెకలించె నామూరు మర్దించె
శ్రీరంగపురమును బాజిసమరె

గీ॥ రాయచౌహత్తమల్లధరావరాహ
ఘోటహూనమురార బర్బరబాహుసాళ్వ
నారసింహప్రతాపసన్నాహుఁ డగుచు
విశ్వహితకారి తిమ్మయయీశ్వరుండు."

---

యెవ్వరును జూప లేదు. తుళువనరసరాయని కంకితము గావింపఁబడినవరాహపురాణములో నందిమల్లన ఘంటసింగయకవులు సాళువవంశము వేఱుగను, తుళువవంశము వేఱుగను, స్పష్టముగ వర్ణించి యుండ వీ రిట్లు వ్రాయుట వింతగా నున్నది. వరాహపురాణావతారికలోను, ఆశ్వాసాంతపద్యములలోను కృతిభర్త సాళువవంశీయుఁ డని వక్కాణింపఁబడక తుళువాన్వయుం డని వ్రాయుటయే యీయుభయవంశము లొక్కటి కా వని స్పష్టమగుచున్నది. కాఁబట్టి సాళువవంశము వే ఱనియు తుళువవంశము వే ఱనియు మన మిప్పటికి స్పష్టముగా నిర్ధారింపవచ్చును.

తిమ్మరుసుమంత్రి ప్రతిభాధుర్యుఁడని దేశమున విఖ్యాతిని గాంచుట తనమిత్రుఁడైన నాదిండ్ల చిట్టిగంగనామాత్యుని వలన విని యాతనిచేఁ బ్రేరేపితుఁడై సాళ్వ గుండయనారసింహభూపాలునియంగీకారమును బడసి తుళువనరసరాజు తిమ్మరుసును దనకు ముఖ్యమంత్రిగఁ జేసికొనియెను. నాదిండ్ల చిట్టిగంగనామాత్యుఁడు తిమ్మరాజునకు, గోవిందరాజునకు వివాహమైనపిమ్మట స్వర్గస్థుఁడయ్యెను. అచిరకాలములోనే తిమ్మరుసుప్రజ్ఞావిశేషములు రాజ్యమునఁ బ్రవర్తిల్లుచు బహుజనశ్లాఘాపాత్రములై యాతని యశోవైభవమును నలుదిక్కులకుఁ బఱపుచుండినవి.

### మహావిప్లవము.

కర్ణాట సామ్రాజ్యమును బరిపాలించుచున్న యిమ్మడి విరూపాక్షరాయలు తన దుష్టప్రవర్తనముచేత జనకంటకుఁడయ్యెను. నిరంతరము సురాపాన ప్రమత్తుఁడై కామినీజనపరివృతుఁడై యంతఃపురమును విడిచి రాక మంత్రులకుఁ గాని, దండనాథులకుఁ గాని మోమయినఁ గనుబఱచక మైమఱచి విహరింపుచుండెను. ఇది గూడదని మందలించినదండనాథులను బెక్కండ్రను దుష్టుఁడై చంపించెను. ఇమ్మడి విరూపాక్షుఁడిట్లు దుష్పరిపాలనమున కొడిగట్టి జనకంటకుఁడై యుండుటఁ గాంచి సామంతనృపతు లెల్లరును స్వతంత్రులై యెవరిరాజ్యములను వారు పరిపాలించుకొనుచుఁ గప్పములు గట్టుట మానిరి పశ్చిమసముద్రతీరమునందలి రేవు లన్నియుఁ బరాధీనములై

నవి. తుంగభద్రాకృష్ణామధ్య దేశమును దురుష్కు లాక్రమించుకొనిరి. కళింగ దేశాధీశ్వరు లైన గజపతు లుదయగిరి రాజ్యమును వశపఱచుకొని పరిపాలించు చుండిరి. ఇంతకుఁ బూర్వమె చంద్రగిరి, పెనుగొండ, గండికోటరాజ్యముల నాక్రమించుకొని సాళ్వగుండ నరసింహభూపాలుఁడు మహాపరాక్రమవంతుఁడై అనుదినమును దనరాజ్యమును విస్తరింపఁజేయుచు స్వాతంత్రుఁడై పరిపాలనము సేయుచు జనరంజకుఁడు గాఁ బ్రసిద్ధి గాంచు చుండెను. ఇట్లు నానాఁటికిఁ గర్ణాటరాష్ట్రము బలము క్షీణించు చుండెను. దీనినంతయును జూచి సహింపఁజాలక వీని పెద్దకొడుకు తనతండ్రిని దనచేతులతోఁ జంపెను. వీనితమ్ముఁడు వీనిని జంపి రాజయ్యెను. వీఁడును దనతండ్రివలెనె దుర్మార్గుఁడై దుష్పరిపాలనముఁ జేయ మొదలుపెట్టెను. ఉద్ధతులనడుమఁ బేద కుండ శక్యము గానియట్లు తురుష్కులకును గజపతులకును నడుమఁబడి యిదివఱకే నలుగు చుండిన కర్ణాటసామ్రాజ్యము విద్యానగరమునందు సంభవించినట్టి రాజకీయవిప్లవస్థితినిఁ బురస్కరించుకొని బహమనీసుల్తాను తానొక్కగుక్కలో నీ మహాసామ్రాజ్యమును మ్రింగివేయవలయు నని చూచుచుండెను గాని సాళ్వగుండయనారసింహునిభయముచేత వెనుకముందు నారయుచు సమయమునకై నిరీక్షించు చుండెను.

## సమయాకర్షణము.

తుళువనరసరాయనికడ మంత్రిపదవిని వహించిన తిమ్మరుసు ప్రతిభాధ్యుఁడైనమంత్రి గావున విద్యానగర రాజకీయ

విప్లవపరిస్థితులను దెలిసికొని యుపేక్షను వహింపక తా నెవ్వని ప్రాపకమువలన నభివృద్ధి బొందఁ గలిగెనో యట్టి రాజకీయ విద్యాగురు వైన చిట్టిగింగనామాత్యుని గోపమును నేమాత్రము మఱవక యాదరణము నెట్లు సద్వినియోగమునకుఁ దే వలసి యుండునో దానిని జక్కఁగా నాలోచించి హైందవధర్మరక్షణార్థ మీ హైందవసామ్రాజ్యము సముద్ధరించుట తనకు విధ్యుక్త ధర్మ మని నిశ్చయించెను. అప్పు డుపేక్ష చేసిన యెడల నావల బ్రమాదము జనింపవచ్చును. విద్యానగరము బహామనీ సుల్తానులవశ మయ్యెనేని హైందవసామ్రాజ్యము క్రమముగా నంతరించును. హైందవసామ్రాజ్యముతో నార్యధర్మములు తాటాదూటమగుట నిశ్చయము. ప్రజ్ఞావంతుఁ డని; ప్రతి భాషుఁ డని సమర్థుఁ డని తలంచియే చిట్టిగింగనామాత్యుఁడు భావిస్థితిని దలపోసి యీవిషయమై తన్ను బ్రబోధించినప్పుడు తిమ్మరుసు మిడిగ్రుడ్లు పెట్టుకొని యూరక చూచుచున్న పక్షమున నాతడును సామాన్యుని వంటివాఁడే యగును. అతడొకనాఁడు నరసారాయనికడ కేగి యిట్లనియెను. నరసరాయా కర్ణాటప్రభువు డౌర్భాగ్యస్థితి నరసియు విను చున్నావుగదా? అతఁడు రాజ్యమును బరిపాలింప సమర్థుఁడు గాఁడు. ఎప్పుడు నంతఃపురము విడిచి రాఁడు. రాజ్యాంగముఁ గ న్నెత్తి చూడఁడు. తురుష్కులు కృష్ణ దాటి వచ్చిరి. సామంతనృపతులు స్వాతంత్ర్యమును బ్రకటించుచున్నారు. ఈసమయమును జూచి బహామనీ సుల్తాను విద్యానగరముపై దండెత్తి వచ్చి వశపఱచుకొనునేని

హైందవరాజ్యము లింక నిలుచునా? హిందూమతధర్మములు తాఱుమాఱులు గాకుండునా? ఇట్టిసమయమున మన ముపేక్షించి యూరకుండుట మనదేశమునకును మతమునకు నపచారము సల్పినవార మగుదుము. పూర్వము జనకంటకుఁడై వేనుఁడు దుష్పరిపాలనము జేయుచుండఁ బ్రజలు వానినిఁ బదభ్రష్టుని గావించి పృథువునకుఁ బట్టము గట్టినట్లుగా నీకర్ణాటప్రభుని సింహాసనమునుండి తొలగించి మనసాళ్వనరసింహభూపాలుని సార్వభౌమునిగఁ జేసి పట్టాభిషిక్తుని గావింతము. నిలిచియున్న యీహైందవసామ్రాజ్యమును సముద్ధరింతము. మనరాజకీయవిద్యాగురు వైనచిట్టిగంగనామాత్యుఁడు మనకుబోధించిన పరమధర్మ మిదియే సుమా." అని ప్రబోధించెను. అంత నరసారాయఁ డీపలుకులను విని తిమ్మరుసు మోమొకించుకసేపు తేఱిపాఱఁ జూచి యతనిదూరపుటాలోచనకు సంతసించి "మంత్రివరా! నీబుద్ధికి మెచ్చితిని. అవును నీవు చెప్పినది సత్యము. మన మీసమయమును పోనీయ రాదు. మన మిప్పుడూరకుండిన తుదకు మనకే ముప్పు రాఁగలదు. కర్ణాటప్రభువును సింహాసనమునుండి తొలగించి మన ప్రభువర్యునకుఁ బట్టము గట్టుద" మని చెప్పి యప్పుడే యీవిషయమును దెలుపుచు సాళ్వనరసింహభూపాలునకు సందేశముఁ బంపెను. అప్పటికే తిమ్మరుసు ప్రతిభాధుర్యుఁడనియు, రాజ్యధురంధరుఁడనియు సాళువనరసింహభూపాలుఁ డెఱింగియుండెను. తిమ్మరుసువంటి ప్రతిభాధుర్యునిచేఁ బ్రబోధితుఁడై తనసైన్యాధ్యక్షుఁ డగు

తుళువనరసారాయఁడు పంపించినసందేశమున కెంతయు సంతో షించినవాఁడై తనకడ నున్నమంత్రివరులను, దండనాథులను రప్పించి వారల కాసందేశమును విన్పింపఁగా వారెల్లరును సన్మ తించి తిమ్మరుసుబుద్ధి వైశద్యమును మిక్కిలి గొనియాడిరి. అప్పుడా సాళ్వనరసింహభూపతి విద్యానగరముపై దండయాత్ర వెడలుట కాజ్ఞాపత్రికను వ్రాసి తనసైన్యాధ్యక్షునకు బంపెను.

## తుళువనరసింహునిదండయాత్ర.

సాళ్వనరసింహుని యాజ్ఞాపత్రికను తిమ్మరుసుమంత్రి సైన్యాధ్యక్షునకుఁ జదివి వినిపించెను. తాను తలపెట్టిన కార్య మున కెల్లరు నామోదించుట భావిశుభసూచక మని గ్రహించి తిమ్మరుసు పరమానందభరితుఁ డయ్యెను. అంతట తిమ్మరుసు నరసరాజును గాంచి "భూవరా! ఇఁక మనము జాగు సేయ రాదు. సేనలను సన్నద్ధము గావించుకొని మనయుద్యమ మెవ్వ రికిఁ దెలియకుండ సకస్మాత్తుగాఁ బోయి విద్యానగరముపై బడవలయును. అట్లు గానియెడల ప్రతిపక్షులవలనను శత్రు వులవలనను మనకు ప్రతిబంధకము లేర్పడి మనప్రయత్న మంతయు విఫలము గా వచ్చును. గాన మనకు నపకారము గలుగ వచ్చును. ఇట్టి సందర్భములయం దాలస్యము జయప్రద ము గాదు. ఈమన ప్రయత్నములను మనప్రతిపక్షనాయకు లగుదండనాథులు విన్న విద్యానగరమును సంరక్షించుట కై స్వసైన్యములతోఁ బ్రవేశింతురు. అపుడు గోటఁ జిదుపందగిన

వాని గొడ్డలిచే నఱకవలసి వచ్చు" నని హెచ్చరించెను. నరస భూపతియు తిమ్మరసు పలికినపలుకులయందలియాథార్థ్యమును గ్రహించి, కాలయాపనము సేయక వలసినసైన్యములను కొలది కాలములోనే సమకూర్చి తిమ్మరసు పెట్టినశుభముహూర్తమునఁ బ్రయాణభేరి మ్రోగించి దండయాత్రకు బయలుదేఱెను. నరసారాయనితోఁ దిమ్మరసుకూడ నుండెను. తిమ్మరసు మంత్రిసత్తముఁడుమాత్రమే గాక సమరక్రియ మెఱింగినమహాయోధుఁడుకూడ నై యుండెను. అందువలన నరసారాయనికి మిక్కిలిసహాయకారిగ నుండెను. ఇట్లు గుత్తినగరము నుండి దండయాత్ర వెడలి విద్యానగరముఁ జేరి నగరముచెలువం విడిసియున్నపుడు తిమ్మరసుమంత్రి కర్ణాటరాజ్యసంరక్షకు లై యుండినదండనాథులకు సామంతనృపతులకు నరసారాయనిపేరిటఁ దాము వచ్చినకార్యముయొక్క ప్రయోజనమును దెలుపుచు లేఖలను వ్రాసి పంపెను. సాళువనరసింహభూపాలునికీర్తి యప్పటికే రాష్ట్రమునందంతట వ్యాపించి ప్రసిద్ధి వహించి యుండుటచేత నెవ్వరును దత్సైన్యాధ్యక్షుఁడును సమర్థయోధుఁడు నై నతుళువనరసారాయని నెదుర్కొన సాహసింప లేదు. నరసారాయఁ డనేకులకు గానుక లంపించెను. ఇట్లు విద్యానగరములోనిదండనాథు లెల్లరును వశ్యు లై మౌనము వహించి యుండ నరసారాయఁడు నగరమున కెంతమాత్రము నష్టము గలిగింపక రణభేరి మ్రోగించుచు నగరము సొచ్చి దానును సేనలును మహావైభవముతో నూరేగుచు

రాజభవనము సమీపించు చుండెను. ఇట్లు జరుగు చున్న దని నేత్రిబీరకాయ! యన్నట్లు ప్రౌఢదేవరాయుల నామమును వహించినయాకామినీమనోహరుఁడు విద్యానగర సింహాసనాధిష్ఠితుఁడైనయాకర్ణాటప్రభువు వినియు నిట్లుండెను. నరసారాయఁడు రాజభవనము సమీపించు చున్నాఁ డని సందేశమును దెచ్చినభటుని విశ్వాసపాత్రునిఁ బరిభవించి పంపించెను. వినాశకాలమునకు విపరీతబుద్ధి జనించిన దని యెల్లవారును దలంచి యుపేక్ష వహించి యుండిరి. ఇట్లు నరసారాయఁడు నగర మంతయు మహావైభవముతో నూరేగి రాజభవనము సమీపించి ద్వారపాలకులఁ బాఱఁద్రోలి యంతయు వశపఱచు కొన్నను నామందభాగ్యుఁడు ఘంటాపురములోనిశయ్యాగృహమును విడిచి బయటికి రా లేదు. తన కాసేనాని రాజు పదవు కొని యున్నగృహము సమీపింపఁగా దనకు రానున్నయుపాయమును నపుడు గ్రహించి ప్రాణరక్షణార్థము దిడ్డివాకిటనుండి తప్పించుకొని నిజమందిరమును, నగరమును విడిచి పాఱి పోయెను. ఇట్లాతఁడు పాఱిపోయె నన్నవర్తమానమును విని నరసారాయఁడు వానిం బట్టుకొనుట కై శ్రమపడక తత్క్షణము ధనభాండారమును నగరము నంతయు స్వాధీనముఁ జేసికొని సాళువనరసింహభూపాలుని కీవృత్తాంతమును దెలుపుచువిద్యానగరమునకు విచ్చేయు మని సందేశ మంపెను. నగరమునంతయు నరసారాయనికి గడగడలాడు చుండెను. నగరములోని యాబాలవృద్ధు లీమార్పునకు సంతోషించిరి. బహుస్వల్ప

సంఖ్యాకుల కిది కంటకముగాఁ గాన్పించినను వీరి నెదుర్కొను సంతటి శక్తి లేక యుండెను. రాజబంధువులను విద్యానగరమున నుండనీయక నరసారాయఁడు కొందఱను పెనుగొండకును, కొందఱను గుత్తికిని, కొందఱను జంద్రగిరికిని బంపించెను. అంతఃపురను లోనగు సేవకులను దొలఁగించి వారిస్థానముల క్రొత్త వారిని నియమించెను.

## సాళ్వనరసింహునిపట్టాభిషేకము.

తిమ్మరుసుమంత్రి సాళ్వగుండయనారసింహునిపట్టాభిషేకమహోత్సవాహ్వానపత్రికలను రాష్ట్రములోనిసామంతనృపతులకు దండనాథులకుఁ బంపించెను. సాళువ నరసింహభూపాలుఁడు నరసారాయనికడ నుండి వచ్చినసందేశమును విని తనవారివిజయమునకు సంతసించుచును నెంతమాత్రమును జాగు సేయక పురోహితులను, మంత్రులను, సేనాపతులను సామంతులను, రాణులను, పుత్రులను, పరివారజనంబులను వెంటఁ గొని యొకశుభముహూర్తమున నారాయణవనమునుండి బయలుదేఱి కొన్నిదినములకు విద్యానగరమునకు వచ్చెను. తన సైన్యాధ్యక్షుఁడును, వాని మంత్రి యగుతిమ్మరుసు పౌరజనులతో నెదురుగావచ్చి నగరమునకుఁ గొనిపోయి రాజభవనమునం బ్రవేశపెట్టిరి. ఈసాళ్వనరసింహభూపాలుఁడు విద్యానగరనివాసులకుఁ గ్రొత్తవాఁడుకాఁడు. సాళ్వనరసింహుఁడు విద్యానగరమునఁ బేరు మోసినవాఁడే. కావున నతనిఁ బ్రేమించువారే యానగరవాసుల నధికసంఖ్య గలవా రుండిరి. సాళువ

నరసింహభూపతి బలాఢ్యుఁడు, సమర్థుఁడు, యోగ్యుఁడు నై నందున సామంతనృపవర్గ మాతనిపట్టాభిషేకమహోత్సవమున కామోదించుచుఁ గానుక లంపించిరి. మఱికొందఱు నామహోత్సవమును గన్నులార వీక్షించుటకై తామే యరుదెంచిరి. ఒకశుభముహూర్తమున సాళ్వనరసింహభూపతి కర్ణాటసామ్రాజ్య పట్టాభిషిక్తుఁడై మహారాజాధిరాజ, రాజ పరమేశ్వరేదిత్యాది బిరుదాంచితుఁడై వఱలెను. అంతటనుండి కర్ణాటసామ్రాజ్యము నరసింహసామ్రాజ్య మని దిగంతములవఱకు బేరుమ్రోసెను. కర్ణాటసామ్రాజ్యము బలపడియెను. సామంతనృపవర్గము నరసింహసార్వభౌముఁ డన్న భయభక్తులతో నుండెను. దండనాథు లెల్లరును వినయవిధేయులై యుండిరి. ఇట్లు సాళ్వనరసింహభూపతి శకసంవత్సరము ౧౪౦౮-లో (1486-87) కర్ణాటసామ్రాజ్యసార్వభౌముఁ డయ్యెను. ఈతని పరిపాలనతో విద్యానగరమునఁ దెలుఁగువారికిఁ బలుకుఁబడి యెక్కువ యయ్యెను. కర్ణాటసామ్రాజ్యము సంపూర్ణముగా నాంధ్రుల స్వాధీన మయ్యె నని చెప్పవచ్చును. తిమ్మరుసుమంత్రి తన ప్రజ్ఞను వికసింపఁజేయుకాలము పొటస్థించెను. ఇట్లు మనోరథ సిద్ధిఁ బడయు నదృష్టముఁ గాంచినతిమ్మరుసుమంత్రిని సార్వ నరసింహసార్వభౌముఁడు విడిచిపెట్టి యుండ లేదు. అతని ననేక విధముల సత్కరించెను. అతనితో యోచింపక యేకార్యమును జేయకుండెను. తుళువనరసరాయనిమంత్రి యనుమాటయె కాని తిమ్మరుసు విద్యానగరమునుండి రాజకార్యధురంధరుఁ

డై నరసింహసార్వభౌమునకు సలహాల నందిచ్చుచుఁ బరిపాలనమునఁ దోడ్పడు చుండెను. ప్రధానమంత్రిపదవిని వహింప వలసిన దని సార్వభౌముఁడు కోరినను తిమ్మరుసు తనకంటె వృద్ధు లై చిరకాలమునుండి నాశ్రయించుకొని భక్తిశ్రద్ధలు చూపి కొలుచు చున్న మంత్రిపుంగవులను గాదని వయస్సునఁ చిన్నవాఁ డగుఁదా నాపదవి నపేక్షించుట క్షేమకరము గాదనియు, మిత్రభేదమునకు హేతు వగు ననియు, దేశశాంతికి భంగకర మగు ననియు నచ్చఁట జెప్పి సామ్రాజ్యముపట్ల సదాసేవాపరతంత్రుఁడ నై యుందు నని వాగ్దత్తము గావించెనుఁ. తుళువనరసభూపతియు సార్వభౌముఁడు నాతని బుద్ధికౌశల్యమును శ్లాఘించిరి. విద్యానగరమునఁ దిమ్మరుసు ప్రసిద్ధి సర్వత్ర వ్యాపించెను. ఒకనాఁడు నరసింహసార్వభౌముఁడు తిమ్మరుసుమంత్రిని పిలువనంపించి యిట్లనియెను.

“తిమ్మరుసుమంత్రీ! నీవు మంచి బుద్ధిశాలివి. నా కొక కోరిక గలదు. అశ్వపతు లైన బహామనీసుల్తానులును, గజపతు లైన కళింగదేశాధీశ్వరులును మనకుఁ బ్రబల శత్రువు లై యున్నారు. కర్ణాటరాజ్యాధిష్ఠితుఁడ నై నరపతిసార్వభౌముఁడ నై యున్నను అట్టిశత్రువు లస్మద్రాజ్యము నపహరించి ప్రవర్ధమానులగుచుండఁ జూచుచు నే నెట్లూరకుండఁ గలను. అశ్వపతులను గజపతులను గూడఁ గృష్ణకు దిగువభాగమున నుండకుండఁ బాఱఁద్రోల వలయు నని దృఢసంకల్పము గలదు. నే నీశత్రువులనుఁ బాఱఁదోలునంతవఱకు నాకు నిద్రాహారముల

యం దధికుని జయింపను. దీని జయప్రదముగా నిర్వహించుమా
ర్గము నెద్దియైన, జూపుము."

తిమ్మరుసు హితబోధ.

అందులకుఁ దిమ్మరుసు నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.
రాజేంద్రా! అశ్వపతులు గజపతులు మనకు శత్రువులుగ
నున్నమాట సత్యము. వారలను జయించుట కష్టసాధ్యము.
అశ్వపతుల కాశ్వసైన్యము మెండుగాఁ గలదు. పూర్వకాల
మున సైన్యము రథములు, గజములు, అశ్వపతులు, పదాతు
లనెడు నాలుగుభాగములుగా నుండి 'చతురంగ' మను సంజ్ఞ
కలిగి యుండెను. ఆకాలమునందు రథబలమె శ్రేష్ఠ మైనదిగా
నెంచఁబడియెను. రథికులని, అతిరథుఁడు, మహారథుఁడు, సమ
రథుఁడు, అర్ధరథుఁడు ననుబిరుదము లుండెను. రథబల మింతకుఁ
బూర్వమె సేనాంగములో నశించి తక్కినవి మూఁడుమాత్రమె
నిలిచి యున్నవి. కళింగదేశమునం దరణ్యములు మెండుగ నుం
డుటచేతను నాయరణ్యములలో గజములు విస్తారముగా నుం
డుటచేతను కళింగదేశాధిపతులకు గజబల మధికముగా నుం
డుట వచ్చెను. అందువలన వారలకు గజపతు లనుబిరుదునా
మము గలిగినది. అరబ్బీపారశీక సింధుదేశములందు గుఱ్ఱము
లధికముగా నభివృద్ధి యగుచున్నవి. ఈదేశములు మహామ్మ
దీయాక్రాంతము లై వారలచేఁ బరిపాలింపఁబడు చుండుట
చేత వారలకు నశ్వబల మధికముగా నుండెను. అందువలన
వారలకు నశ్వపతు లనుబిరుదము వచ్చినది. పదాతిసైన్యము

మన కెక్కువగా నుండుటచేత మనకు నరపతు లనుబిరుదము వచ్చినది. అశ్వపతులను జయించుటకు మన కాశ్విక సైన్యము మెండుగా నుండవలయును. గజపతులను జయించుటకు గజసైన్యము మెండుగా నుండవలయును. బహామనీసుల్తానుకన్న మీర లైశ్వర్యవంతులు. బహామనీసుల్తానుకన్న మన మధికమైనవెల యిచ్చినపక్షమున మనకే విక్రయింతురు. పోర్చుగీసు వర్తకులమూలమున మన మీకార్యమును నిర్వహించుకొన వచ్చును. అశ్వికసైన్యమును మనము బలపఱచుకొనుపర్యంతము బహామనీసుల్తానుపై దండయాత్ర సలుపరాదు. అతఁడు దండెత్తివచ్చిన మనము నిలిచి పోరాడవచ్చును. కాని మనము మాత్రము దండెత్తి పోరాదు. అశ్వబలమును సమకూర్చుకొని యశ్వపతులను జయించినపిమ్మట గజపతులను జయింపవలయును. అంతపర్యంతము మన మోపిక వహించి యశ్వబలమును గజబలమునుగూడ పెంపుచేసికొనుచుండుట శ్రేయమని నాయభిప్రాయము. అశ్వములను సంపాదించుటకై ధనమును గుప్పింప వలయును.''

తిమ్మరుసుచే నిట్లు ప్రేరేపింపఁబడి నరసింహామహారాజేంద్రుఁడు అరబ్బీదేశమునుండియు, పారశీకదేశమునుండియు నుత్తమాశ్వములను పెక్కింటిని దెప్పించుటకై బ్రతికినవైనను చచ్చినవైనను మూఁడుగుఱ్ఱములకు వేయివరహాలచొప్పున నిచ్చుటకుఁ బ్రారంభించినందున మూరు లనుమహమ్మదీయ వర్తకులును, పోర్చుగీసువర్తకులు నశ్వములను గొనివచ్చి,

సాళ్వనరసింహరాయని కమిత్రభక్తవంతు లగు చుండిరి. తన కొఱకై తెచ్చినగుఱ్ఱములు సముద్రముమీఁదఁ జచ్చినను వానితోఁకలను దెచ్చినపక్షమున ధన మొసంగు చున్నందున వర్తకు లావ్యాపారమును విడువక సాగించు చుండిరి. అందు వలన స్వల్పకాలములో నరసింహునియశ్వబలము శత్రుజన భయంకర మయ్యెను. ఇట్లు సాళ్వనరసింహభూపతి జీవచ్ఛవ ముగా నుండి కునుకుచున్న రాష్ట్రమున నుత్సాహక్రియా శక్తుల స్వసామర్థ్యముచే నెల్లెడలఁ బురికొల్పి పునర్జీవనము గల్పించి శత్రుభయంకరుఁ డై ప్రజాపాలనముఁ జేయు చుండు టచేతఁ దురుష్కులును విదేశీయులగుపోర్చుగీసువారును, కర్ణాట రాజ్యమును 'నరసింగనిరాజ్య' మనియె వ్యవహరించిరి. తురు ష్కులనుండి రాయచూరుదుర్గమును గజపతులనుండి యుదయగిరి రాజ్యమును వశపఱచుకొనవలయునని యుత్సాహపడు చుండెను గాని విధివశంబున నాకోరిక లీరిక తీఱకముందే స్వర్గస్థుఁ డగుట సంభవించెను. ఇతఁడు సార్వభౌమపదవికి వచ్చినతరు వాత నెక్కువకాలము పరిపాలనము చేసినట్లు గన్పట్టదు. ఇతడు తనమరణకాలమునందుఁ దనపెద్దకుమారుని రాజును జేసి యతఁడు బాలుఁ డగుటచే సైన్యాధ్యక్షుఁ డైన నరసరాజును గార్యకర్తనుగా నియమించెను.

# తృతీయ ప్రకరణము.

## ఇమ్మడి నరసింహరాయఁడు.

సాళ్వ నరసింహరాయఁడు స్వర్గస్థుఁ డైన వెనుక నతని పెద్దకుమారుఁడు బాలుని తిమ్మరాయనిఁ బట్టాభిషిక్తుని గావించి తుళువనరసరాజు సమస్త రాజ్యభారధురంధరుఁ డై తిమ్మరుసు మంత్రి సాహాయ్యముతోఁ బరిపాలనము సేయుచుండెను. నరసింహసామ్రాజ్యమును కీర్తిమాహాత్మ్యమును బొందిన నరసరాయఁడు తానే రాజ్యచక్రమును నడిపించుటఁ జూచి సహింపఁ జాలక యొకదళవాయి నరసరాయనిపై నొకయపవాదు గల్పింపనెంచి రహస్యముగా బాలరాజును జంపించెను. తుళువ నరసరాజే రాజద్రోహి యై రాజ్యాపహరణనిమిత్తము బాలరాజును జంపించె నని ప్రజలు చెప్పుకొనుచు నరసరాజును ద్వేషించునట్లుగాఁ జేసినవాని కపటతంత్రమునకుఁ బ్రతిహతి నాలోచింపు మని తిమ్మరుసును వేఁడెను. ‘‘ప్రభువర్యా! శత్రువును సాధించుపని తరువాత చూచుకొందము. ముందుగా సాళ్వనరసింహభూపాలుని ద్వితీయపుత్త్రుని ఇమ్మడి నరసింహరాయఁ డనుపేరుతోఁ బట్టాభిషిక్తుని గావించి యపనిందఁ బాపికొను’’ మని తిమ్మరుసుమంత్రి ప్రబోధింపఁగా నతఁ డట్లు గావించి యపనిందఁ బోఁగొట్టుకొని జనరంజకుఁ డయ్యెను.

తన ప్రయత్నమంతయు నీకార్యము మూలముగా విఫలమైనం దున నాదళవాయి విచారించుచు, తుళువ నరసరాయని మఱింత ద్వేషించుచు నపకారము సలుప నిశ్చయుఁడై ఇమ్మడి నరసింహరాయని ప్రేమను క్రమముగా సంపాదించి యాతనిఁ దన కనుకూలుని గావించికొని తుళువనరసరాయని, తిమ్మరుసును, సాగనంపుటకై ప్రయత్నించుచుండెను. తిమ్మరుసుమంత్రి చారులవలన వానిదుర్మార్గమును దెలిసికొని నరసరాయనితో నిట్లనియె. " వీరాగ్రణీ! వీఁడు మనకు శత్రువై బాలుఁడైన మహారాజు నాకర్షించి యాతనితోఁ జెలిమి గావించుకొని మన వినాశమునకై ప్రయత్నించుచున్నాఁడు. భ్రాతృహంతకుఁ డైనవీనిని జేరఁదీసి యిమ్మడి నరసింహరాయఁడు గౌరవించు చున్నాఁడు. దీన నేమియుపద్రవము కలుగునో యీబాలరాజు గుర్తెఱుంగక యున్నాఁడు. నిష్కారణముగా దనయన్నను జంపించినవాఁడు తన్నుఁ జంపింపక మానునా! ఇతనిదౌర్భాగ్య మే మని చెప్పవచ్చును? మనముపేక్షించి యున్నపక్షమున సామ్రాజ్యమునకు ముప్పువాటిల్లును. ఈద్రోహియైనదళ వాయిని బలిమినైన మాయోపాయముననైనఁ గడతేర్చినఁ గాని నీకును, నాకును, సామ్రాజ్యమునకును క్షేమము లేదు. కావున ముందుగా నేను బాలరాజును మందలించి హితబోధ గావించి చూచెదను. అతఁడు వినకున్న జరుపఁదగినకార్యమును గూర్చి తరువాత యోచింతు' మని చెప్పి యాతనిసమ్మతి గైకొని తిమ్మరుసుమంత్రి యొకనాఁడు మహారాజుసన్నిధానమునకుఁ బోయి యిట్లు హితబోధ గావించెను.

"రాజేంద్రా! ఈసామ్రాజ్యమునకై మీతండ్రియును సైన్యాధ్యక్షుఁడైన నరసరాయఁడును పొందినశ్రమ యింతింత గాదు. మీతండ్రియెడఁ గలభక్తివిశ్వాసములచేత తుళువనరస రాయఁ డెప్పుడును మీతండ్రికి కుడిభుజముగా నుండి యీ సామ్రాజ్యసంపాదనమునందుఁ దోడ్పడి ప్రతిపక్షుల నుక్కడంచి యీమహాసామ్రాజ్యమున కంతకుఁ బట్టాభిషిక్తుని గావించి ప్రతిభ గాంచినవాఁడు గాని సామాన్యుఁడు గాఁడు. మీ తండ్రి స్వర్గస్థుఁడైనను మీతండ్రియభీష్టముప్రకారము మీ యన్నను బట్టాభిషిక్తునిఁ గావించి సమస్తరాజ్యభారధురంధరుఁ డై ప్రజాపాలనము సేయుచుండ సహింపఁజాలక దుర్మార్గుఁడై నీహితుఁడైనదళవాయి వానిని రహస్యముగా జంపించెను. ఈయపనిందఁ దనపైఁ బడెనని విచారించి నరసరాయఁడు స్వామిద్రోహి కాఁడు గావున నిన్నుఁ బట్టాభిషిక్తుని గావించి నీచేతఁ బరిపాలనము సేయించుచున్నాఁడు. దీనిని నీవు విస్మ రించి భ్రాతృహంతకుఁడైనయాదుర్మార్గునితో మైత్రి నెఱ పుచు కృతఘ్నుఁడవై నరసరాయనికిని నాకును నపకారముఁ జేయఁ జూచుచున్నాఁడవు. నీవు బాలుఁడవు. లోకవృత్త మెఱుంగనివాఁడవు. నీచులను జేరఁదీసి మైత్రి నెఱపుదువేని తుదను సామ్రాజ్యమును, ప్రాణములనుగూడ గోలుపోవలసి వచ్చును. కావున నాప్రార్థనమును మన్నించి దుర్మార్గులతోడ సహవాసమును మానుము. ముఖ్యముగా భ్రాతృహంతకుఁ డైనయాదళవాయినిఁ జెఱబట్టి యుంచుటయొండె, దేశము

నుండి వెడలనడచుటయొండె చేయుట నీకు శ్రేయోదాయకము. నీయొక్కయు, సామ్రాజ్యముయొక్కయు శ్రేయస్సును గోరి నిర్భయముగాఁ బలుకుచున్నాఁడను."

ఇట్లు తిమ్మరుసుమంత్రి సాహసించి హితోపదేశము చేసినప్పుడు మౌనము వహించి యూరకుండెను గాని బాలరాజు ప్రత్యుత్తర మీయఁడయ్యెను. అంత తిమ్మరుసుమంత్రి బాలరాజునొద్ద సెలవు గైకొని నరసరాయనికడ కేతెంచి బాలరాజు మౌఢ్యము నెఱింగించి కలుగనున్న ప్రమాదమునుగూర్చి ముచ్చటించి యాదళవాయినిఁ బట్టుకొని సంహరించుట కర్తవ్యమని చెప్పి యందులకుఁ దగినమార్గమును సూచించెను. అతని హితోపదేశమును శిరసావహించి నరసరాయఁడేదోమిష కల్పించుకొని తిమ్మరుసుతోఁగూడ పెనుకొండకుఁ బోయి, అధిక సైన్యమును గూర్చుకొని రహస్యముగా విద్యానగరమునకు వచ్చి ముట్టడించి భ్రాతృహంతకుఁడైనదళవాయిని శిక్షింతువా లేక రాజ్యము విడిచెదవా యని బాలరాజునకు కబురు పంపెను. ఇట్లు దృఢనిశ్చయుఁడై తుళువ నరసరాయఁడైదాఱుదినములు ముట్టడివేసి విడువకయుండ బాలరాజు భయపడి యింకఁ గార్యము మించు నని వెంటనే యాదళవాయిని జంపించి వానితలను నరసరాయనికడకుఁ బంపెను. అప్పుడు నరసరాయఁడు ముట్టడిని మాని యంతఃపురమునకు బోయి యాబాలరాజును సందర్శించి యింక నెన్నఁడు నిట్టికార్యములఁ జేయకుమని మందలించి యాతని నచ్చట నుంచక వేఱొక దుర్గమునకుఁ

బంపి యాతనిసంరక్షణార్థము కొంతసైన్యమును నిలిపి పేరున కిమ్మడి నరసింహరాయఁడే రాజేంద్రుఁ డైనను వ్యవహారమున మాత్రము తుళువనరసరాయఁడే మహారాజేంద్రుఁ డై సమస్త రాజ్యభారధురంధరుఁ డై ప్రవర్తిలెను. అతనియాజ్ఞ సామ్రాజ్యమునం దంతట నమోఘముగా నిర్వర్తిల్లు చుండెను. అత్యధికప్రతిభావంతుఁ డైన సాళువతిమ్మనామాత్యుఁడు మహాప్రధాని యై రాజ్యతంత్రమును నడుపు చుండఁ దుళువనరసరాయనికీర్తి జగద్వ్యాప్త మగు చుండెను. తిమ్మరుసుమంత్రి సామ్రాజ్యమున కంతకు మూలస్తంభ మయ్యెను. ఎవ్వనిపలుకు సామ్రాజ్యమున నప్రతిహత మై ప్రవర్తించు చుండె నని ప్రశ్నించితి మేని తిమ్మరుసునే మొదట చెప్ప వలయును. మహారాజులు, మండలేశ్వరులును, మంత్రులు, సేనానులు మొదలగువా రెల్లరు నాతనియాజ్ఞాబద్ధు లై ప్రవర్తించుచుండిరనఁ దక్కినవారిసంగతి చెప్ప నేల ?

## తురుష్కుల జయించుట.

విజాపురసుల్తా నగుఆదిల్ షాహ ప్రత్యర్థి యగుకాశింబరీదు తనప్రతిపక్షిని జయించుట కై తనకు సాహాయ్యము చేయ వలసిన దని నరసరాయనిఁ బ్రార్థించెను. అతఁడు తిమ్మరుసుతో నాలోచింపగా నాతఁ డిట్లనియెను. "విజాపురసుల్తాను మనకు శత్రువు. కాశింబరీదును మనకు శత్రువు. మనకు శత్రువులగ నుండువారు తమలో దాము పోరాడునపుడు మన మొక పక్షమున జేరి రెండవపక్షము నోడించితి మేని మొదటిపక్షము

వారు మనకు సులభసాధ్యు లగుదురు. శత్రువులను జయించుట కిది యొకమార్గము. మఱియు వారిలోవారి కైకమత్యము కలుగ కుండ వారిలోవారికి మనస్పర్ధలను గలిగించు చుండ వలయును. అందువలన వారిబలము తగ్గిపోయి సులభసాధ్యు లగుచుందురు. ఇది యొకవిధమైన రాజనీతి. కాశింబరీదు మన సాహాయ్యము నపేక్షించెను గావున మనము చేయుసాహాయ్యము మనకే లాభించునదిగా నుండవలయును. కనుక కృష్ణా తుంగభద్రానదులనడుమ నుండు దేశము అనగా ముదిగల్లు రాచూరు దుర్గముల మన మాక్రమించుకొందము. అని చెప్పి కాశింబరీదునకు వర్తమానము చేసి కొంతసైన్యమును బంపించి యాదుర్గములను వానిచుట్టు నుండుదేశము నాక్రమించుకొనియెను. ఆదిల్ షాహా యేమియుఁ జేయజాలక కొంతకాల మూరకుండవలసినవాఁ డయ్యెను.

## కోనేరినాథునిదుండగము.

సాళువనరసింహభూపాలునికాలముననే సాళువ తిరుమల భూపాలునికిఁబిమ్మట మహామండలేశ్వరుఁడైన కోనేరినాథుఁడు తిరుచనాపల్లిమండలమునకుఁ బరిపాలకుఁడుగా నియమింపఁబడి ప్రజాపాలనము సేయుచుండెను. ఇతఁడు శైవుఁడైనందున జంబుకేశ్వరాలయమునెడఁ బక్షపాతము గలిగి శ్రీరంగములోని రంగనాథునిదేవాలయధర్మకర్తలను నానావిధముల బాధింపఁగా వార లీతనిబాధ పడలేక గోపురము పైనుండి ప్రాణత్యాగమును గూడఁ జేసికొని రఁట! ఈసమాచారము తిమ్మరుసునకుఁ

దెలియవచ్చెను. తిమ్మరుసుమంత్రి శైవవైష్ణవమతములయందు సమబుద్ధి గలవాఁ డగుటచేత కోనేటినాథునిదుండగములను నివర్తింపఁజేయుట శ్రేయోదాయక మని నరసరాయనిఁ బ్రేరేపించెను. అతఁడు నాగమనాయని, కుమారనరసనాయని (వీర నరసింహరాయలు?) వెంట నిడికొని తిరుచునాపల్లి మండలమునకుఁ బోయినప్పుడు కోనేటినాథుఁ డీసమాచారముఁ దెలిసికొని బహుసైన్యములం గూర్చుకొని వీరి నెదుర్కొని ఘోర సంగ్రామము సలిపెను. తుళువనరసరాజు కోనేటినాథునిఁ రణరంగమున నోడించి సంహరించెను, అంతట నరసరాజు నాగమనాయకుఁడు, కుమారనరసనాయకుఁడు శ్రీరంగమునకుఁ బోయి రంగనాథుని సందర్శించి భక్తియుక్తముగ నాదేవునకు భూదానములను బెక్కులను గావించిరి. కోనేటినాథునకు భయపడి స్వగృహములను విడిచి పాఱిపోయినవైష్ణవస్వాముల కభయమొసంగి స్వస్థానమునకు రప్పించి యుత్సాహముఁ గల్పించిరి.

## బహమనీరాజ్యవిభాగములు.

అవక్రపరాక్రముఁడై అరాతిజనభయంకరుఁడై ఇమ్మడి నరసింగరాయని దూరముగాఁ గూరుచుండఁబెట్టి తానే సార్వభౌముఁడైనట్లుగా సామంతనృపవర్గముచే మ్రొక్కులను బడయుచున్న తుళువనరసింగరాయఁడు తనకు వశ్యుఁడై కర్ణాటసామ్రాజ్యనిర్వహణభారము నంతయుఁ దనపైఁ బెట్టినందున సాళువతిమ్మనామాత్యచూడామణి యామహాసామ్రాజ్యతంత్రమును బ్రజానురంజకముగ నడపుచు, సుస్థిరముగ నిలుచు

మార్గము నాలోచింపు చుండెను. అదివఱకు హైందవసామ్రాజ్యమునకు ప్రతిస్పర్ధముగ వర్థిల్లు చున్న బహమనీసామ్రాజ్యము స్వప్రయోజనపరులైన సుబేదారులకు చిక్కి యన్యోన్యవైషమ్యములమూలమున నైదువిభాగములుగా విడిపోయెను. (౧) బేరీద్ షాహా. ఇది కాసింబేరీద్ అనువానిచే నేర్పడియెను. దీని రాజధాని బేదర్ లేక బిడందకోట. (౨) ఇమాంషాహి. ఇది వరాడ్ దేశములోనిది. ఫత్తేఉల్లా ఇమాంషాహ అనువానిచే నేర్పడియెను. దీనిరాజధాని గావిల్‌గడము. (౩) నిజాంషాహి ఇది అహమ్మద్ షాహా అనువానిచే నేర్పడియెను. దీనిరాజధాని అహమ్మదునగరము. (౪) ఆదిల్ షాహి. ఇది యూసుఫ్ ఆదిల్ షాహు అనువానిచే నేర్పడియెను. దీనిరాజధాని విజాపురము (౫) కుతుబ్‌షాహి. ఇది కూలికుతుబ్‌షాహ అనువానిచే నేర్పడియెను. దీనిరాజధాని గోలకొండ.* బహమనీరాజ్య మిట్లు విభాగమై బలహీన మగుటకూడ తిమ్మరుసు చేయుప్రయత్నములకుఁ దోడ్పడి జయప్రదము లగుట కవకాశ మిచ్చుచుండెను. మహారాజ్యతంత్రజ్ఞుఁడైనతిమ్మరుసు శత్రురాజ్యములలో ననోన్యమైత్రి లేకుండునటులు ప్రయత్నించుచుఁ దనసామ్రాజ్యమునందలిసామంతప్రభువర్గమునను, సేనాధిప వర్గమునను, మంత్రివర్గమునను, మనస్పర్థలు జనించి సామ్రా

---

* ఈగోలకొండరాజ్యము బహమనీరాజ్యమునుండి క్రీ. శ. ౧౫౧౨ సంవత్సరమున విడిపోయెను. తక్కిన వన్నియు క్రీ. శ. ౧౪౯౨ లోపలనే స్వతంత్రమును బ్రకటించి పరిపాలింపఁబడు చుండినవి.

జ్యవినాశహేతువులు గా కండ వేయికన్నులతో జూచుచు హైందవసామ్రాజ్యమును వీక్షించు చుండెను. కాని దైవ మెల్లకాల మనుకూలుఁడై యొక్కరీతి నుండుట యసంభవము.

ఆదిల్ షాహా పరివేదనము.

విజాపురరాజ్యమునకును విజయనగర సామ్రాజ్యమునకును నడుమ రాచూరుమండలము గలదు. ఈభూభాగము కృష్ణానదికిని తుంగభద్రానదికి నడుమ బలాఢ్యము లైనముదిగల్లు రాచూరుదుర్గములచే నలంకరింపఁబడి యుండెను. ఇది సామ్రాజ్యరక్షకత్వమునకె కవచముభంగి నుండుటచేత బహమనీ సుల్తాను దీని నెప్పుడును స్వాధీనములో నుంచుకొనవలయు నని ప్రయత్నించుచుండెను. అట్లే విజయనగరసామ్రాజ్యసార్వభౌముఁడును స్వాధీనములో నుంచుకొనవలయు ననియే ప్రయత్నించు చుండెను. ప్రస్తుత మియ్యది విజయనగరాధీశ్వరునిచే నాక్రమింపఁబడియె నని యిదివఱకుఁ జెప్పి యున్నాఁడను. ఇంత ప్రముఖ మైనభూభాగము శత్రువు లాక్రమించినందులకుఁ బరితపింపుచువిజాపురసుల్తాను తన వజీర్లతో నిట్లు పలికెను.

"ముదిగల్లు, రాచూరుదుర్గములు మనరాజ్యమున కాయుస్థానము లని మీ రెఱుంగుదురు. అట్టి యాయుస్థానములను మనశత్రువు లాక్రమించి విజృంభించు చున్నారు. మఱియు హైందవసామ్రాజ్యవర్ధనస్థిరనీతికరణకుశలుం డగు తిమ్మరుసు మంత్రి నేఁడు గా కున్న రే పైనను విజాపురరాజ్యమును తుద

ముట్టింపఁ గలఁడు. అతఁడు బ్రాహ్మణమంత్రి; మహారాజ్య
తంత్రజ్ఞుఁడు; అప్రతిమానప్రతిభాశాలి. అతనితో సాటివచ్చు
వాఁడు విజాపురరాజ్యమునం గాన రాఁడు. నే నెవ్వనికి భయ
పడువాఁడను గాను కాని వాని యొక్కనికే భయపడవలసి
వచ్చుచున్నది. ఇంక మన ముపేక్షించుట ప్రమాదహేతువు.
ఎట్లయిన నాదుర్గములను స్వాధీనపఱచుకొన్నఁ గాని నాకు
నిద్దుర పట్టదు. ఈయపకీర్తిని బాపుకొన్నఁ గాని దక్షిణహిం
దూస్థానమునఁ దురుష్కరాజ్యములకుం గలప్రతిష్ఠ క్షీణ మై
పోవును.''

అని నొవ్వఁబలికి దండయాత్రకు సైన్యముల సన్నద్ధము
చేయవలసిన దని యుత్తరు వొసంగెను. అతనియాజ్ఞను శిరసావ
హించి యావజీర్లు సైన్యాధిపతులకుఁ దెలియఁ జేసిరి. తుళువ
నరసరాయఁడు రాజద్రోహులనడంచుటకై దక్షిణదేశమునకుఁ
బోయినసమయమున విజాపురసుల్తాను రాచూరుమండలము
పై దండెత్తి వచ్చె. అయినను తిమ్మరుసుమంత్రి యూరకుం
డక యాసుల్తాను నెదుర్కొని తఱుముటకై నరసరాయని
సోదరుఁ డగుతిమ్మనాయకుని నియమించెను. * అతఁడు కొంత

---

* హేమరాజు బాలరాజును వెంట నిడుకొని యుద్ధము చేసె
ననియు, హేమరాజు పాఱిపోయె ననియు, బాలరాజు గాయముల నొంది
మార్గమధ్యమునందుఁ జనిపోయె ననియు, ఫెరిస్తా వ్రాసెను గాని హేమరా
జన నరసరాయఁ డనియు, బాలరా జన ఇమ్మడి నరసింహరాయఁ డనియుఁ
గొందఱు చరిత్రకారు లూహించుచున్నారు. వారియూహలు సరి యైనవి

సైన్యమును వెంటఁబెట్టుకొని పోయి తుంగభద్రానదిని దాటి యసహాయశూరుఁడై తురుష్కసైన్యముల నెదిరించి దోర్దర్పమును జూపి కొంతతడవు పోరాడఁ గలిగి తురుష్కసైన్యమును గొంతవఱకు నాశము గావించెను గాని సుల్తానా యవమానమును భరింపఁజాలక సేనలం బురికొల్పుకొని స్థిరచిత్తుఁడై రణరంగమున నిలిచి సమరము సలుప తిమ్మరాయనుఁడు శత్రుసైన్య మాధిక మగుటఁ గాంచి పోరాడఁ జాలక తనసైన్యములను మరలించుకొని రాజధానికి వచ్చెను. ఆదిల్ షాహా విజయనగరరాజధానిపై దండెత్తి రాఁగలసమర్థుఁడు గాకుండుటచే నంతటితోఁ దృప్తి నొంది ముదిగల్లురాచూరుదుర్గములను గైకొనియెను. తిమ్మరాయను సామ్రాజ్యమున రాజ్యాంగ

---

కావు. ఎందు కన, ఇమ్మడి నరసింగరాయలు క్రీ. శ. ౧౫౦౫ వఱకు బ్రదికి యున్నట్టు శాసనములు గన్పట్టుచున్నవి. (ఎపిగ్రాఫికా ఇండికా సంపుటము. 7-నం 8 రు శాసనము జూడుఁడు). హేమరాజను పేరు తిమ్మరాజను పేరునకు సంబంధించినది కాని నరసరాజను పేరునకు పోలికగలిగినది కాదు. ఇంతియగాక యీయుద్ధము క్రీ. శ. ౧౪౯3-వ సంవత్సరమున జరిగినట్లు ఫెరిస్తా వ్రాసి యున్నాఁడు. ఆసంవత్సరమున నరసరాజు దివ్యక్షేత్రయాత్రార్థము దక్షిణదేశమునకుఁ బోయినట్టును, తిరుచునాపల్లిమండలేశ్వరుఁడైన కోనేటినాయునితోఁ బోరాడి జయించినట్లును, కోనేటినాయఁడు యుద్ధములో మృతినొందినట్లును అచ్యుతరాయాభ్యుదయ మనుసంస్కృతకావ్యమువలన విదిత మగుచున్నది. కావున ఫెరిస్తా వ్రాసిన దంతయు సత్యము కాదు. ఆదిల్ షాహాతో యుద్ధము చేసి యోడిపోయినది నరసరాయఁడు కాదు. అతఁడు నరసరాయనిసోదరుఁ డగుతిమ్మరాయఁడై యుండవలయు ననుట యథార్థమునకు దూరమైనవిషయము కాదు.

సంస్కరణములను గావింపవలసి యుండెను. రాజ్యాంగమును బలపఱచుకొన్నఁ గాని తురుష్కులతోఁ వైరముఁ బెట్టుకొని సాధించుటకు బ్రయత్నించుట యుత్తమపద్ధతి కాదని యూహించి సైన్యాధిపతులు ప్రోత్సహించినను తురుష్కుల నుద్రేకింపఁజేయు మార్గముల పొంతఁ బోక యీయవమానమును సహించి యూరకుండెను. విజయనగరమున కుత్తరపుదిక్కున శిథిలము లైయున్న ప్రాకారములను దుర్గములను బలపఱిచెను. ఎన్నిదినములు ముట్టడించినను శత్రువుల కభేద్య మైయుండునట్లు చేసెను. నగరరక్షకసైన్యమును పెంపు గావించెను. బొక్కసమును ధనముచే నింపుచుండెను. ప్రతిసంవత్సరమును గజబలమును, హయబలమును కొంచెముగనో ఎక్కువగనో చేర్చుచుండెను. సామ్రాజ్యమున దన కనుకూలు రెవ్వరో, ప్రతికూలు రెవ్వరో తెలిసికొని ప్రతికూలురను, నేర్పరితనముచే వశపఱచుకొనుచుండెను. అదిల్‌షాహా తనకు జయము గలిగినందులకు నెంతసంతోషించినను, ఎప్పు డైనను తిమ్మరుసుమంత్రి తనరాజ్యమునకు ముప్పు దేఁ గలఁడని దృఢముగా విశ్వసించినవాఁడు గావునఁ దరువాత నతఁడు తిమ్మరుసుతో నొడంబడిక జేసికొనియెను. ఇట్లుభయరాజ్యములవారు కొంతకాలము మైత్రి గలిగి యుండిరి.

# చతుర్థప్రకరణము

## రాజకుటుంబరక్షణభారము.

ఇక్ష్వాకువంశవార్ధిచంద్రుఁడగు దశరథమహారాజునకు కౌసల్యాసుమిత్రాకైకేయీలవలెఁ దుళువ నరసింహరాయునికి 'తిప్పాంబ, నాగాంబ, ఓబాంబ' లనుమూవురు భార్య లుండిరి. నరసింహరాయనికి తిప్పాంబయందు వీరనరసింహదేవ రాయఁడును, నాగాంబయందు కృష్ణదేవరాయఁడును, ఓబాం బికయందు అచ్యుతదేవరాయఁడును, రంగరాయఁడుననుకుమా రులు నలువురు జనించిరి. ఎట్లుసామ్రాజ్య భారమునంతయుఁ దిమ్మరుసుమంత్రిపైనుంచి ప్రవర్తించెనో, అట్లేనరసింహదేవ రాయఁడు స్వకుటుంబరక్షణభారమునుగూడ నాతనిపైనే యుంచెను. సామ్రాజ్యసంరక్షణభార మెంతకష్టప్రద మైనదో రాజకుటుంబసంరక్షణభార మంతకష్టప్రద మైనది. ముగ్గురు భార్యలను గట్టుకొని దశరథుఁడెట్లు బాధపడియెనో యట్లే నరసింహదేవరాయఁడును ముగ్గురుభార్యలను గట్టుకొని బాధ పడుచుండెను. ప్రణయినులప్రణయకోపములమూలమున సంభ వించెడికలహములను నివర్తింపఁజేయుసందర్భమున నరసింహ దేవరాయనికి హితవిధానములఁ గఱపవలసినవాఁడు తిమ్మరుసు గాక సమర్థుఁడగుమంత్రి మఱియొకఁడు లేఁడు. ఇట్లగుట దుర్భర మైనరాజకుటుంబరక్షణభారము బ్రాహ్మణమంత్రిపై

నిడుటకు గారణ మైనది. ఇట్టి కార్యనిర్వాహకత్వమున నర సింహభూపాలవర్యుఁడు తిమ్మరుసుమంత్రిని గాక మఱియెవ్వని నైన నియోగించి యుండెనేని సామ్రాజ్యమునే కోల్పోయి యుండును. ఇట్టి మానిహత్యమును వహించి తిమ్మరుసు తనప్రజ్ఞా విశేషముచేత నంతఃపురమందిరమున మహోపద్రవము లేవియు సంభవింపకుండఁ గాపాడుకొనుచు వచ్చెను. ఏమంత్రి యెట్టి బుద్ధి కలవాఁడో, ఏసేనాధిపతి యెట్టిస్వభావము కలవాఁడో, ఏమాండలికప్రతినిధి యెట్టినైసర్గికగుణము కలవాఁడో, ఏసామంతనృపతి యెట్టితలంపు గలవాఁడో సామ్రాజ్యమున నెల్ల వారిగుణశీలవృత్తములను దెలిసినవాఁడు తిమ్మరుసుమంత్రి. మఱియు రాజాంతఃపురమందిరమున సేవకావృత్తి నున్నదాస దాసీ జనంబులగుణశీలవృత్తములఁ జక్కఁగా గ్రహించినవాఁడు తిమ్మరుసుమంత్రి. ఇంతియ గాక యంతఃపురమందిరముల నివ సించురాజబంధువు లందఱు నెట్టివారో యాతఁ డెఱుంగును. ఈమహాపురుషుఁడు చేయుకార్యములకు సామ్రాజ్యాధిపతి యెన్నఁడు నడ్డము రాఁడని యెల్లవారు నెఱుంగుదురు. అందుచే మహాధికారి యైననేమి సామాన్యాధికారి యైననేమిఁ మహారాజైన నేమి, మహారాజబంధువుఁడైన నేమి, అధికారి యైన నేమి, అనధికారి యైన నేమి, పట్టపురాణి యైన నేమి, దాసీయువతి యైన నేమి, తిమ్మరుసాజ్ఞ యన గడగడలాడుచు విధేయులై వర్తించు చుండిరి. అంతఃపురమందిరములలో నెంతరహస్యముగా నెట్టికార్యము జరిగినను తిమ్మరుసు చెవిని

బడక మానదు. ఇట్లనుటవలన నంతఃపురమందిరములఁ గాని సామ్రాజ్యమునఁ గాని యాతనికిఁ బ్రతిపక్షులు లేరని గాని యాతఁడు తలపెట్టుకార్యములకుఁ బ్రతివిధానములఁ బన్ని విఘాతము చేయఁజూచువారు లేరని కాని చెప్ప సాహసింప రాదు. ప్రథమకర్ణాటరాజవంశమును సముద్ధరింపవలయు నని తత్పక్షపాతులై సమయమపేక్షించి వేచియున్నవారు గొందఱు గలరు. ఈమహాసామ్రాజ్యమునకు సాళువనరసింహభూపతిసంతతియే యాధిపత్యము వహింపవలసిన వారుగాని యన్యులు కారని యిమ్మడినరసింహరాయలను వజ్రసింహాసనారూఢుని గావించి సామ్రాజ్యమును సాళ్వరాజవంశమునకే నిలుపవలయు నని ప్రయత్నించువారు గొందఱు గలరు. అనేకకారణములచే నిట్టి మహాపదవిని వహించి సమస్తసామ్రాజ్యైకకార్యధూర్వహుఁడై ప్రవర్తించెడితిమ్మరుసునెడఁ గేవల మసూయాపిశాచగ్రస్తులై ప్రతిపక్షులుగా నుండెడివారు మఱికొందఱు గలరు. వీ రెల్లరును తిమ్మరుసునెడఁగలభక్తిచే విధేయులై యుండి రని తలంప రాదు. అత్యనేకమైనప్రతిభయు అప్రతిమానమైనప్రజ్ఞయు అత్యద్భుతమైన మేధాశక్తియు అకళంకమైన సామ్రాజ్యభక్తియు అత్యనురూపమానమైనసమర్థతయు, అప్రతిబద్ధమైనయాజ్ఞయు, వీనిమించినయౌదార్యమును, క్షాత్రమును, బ్రహ్మతేజస్సును ప్రతిపక్షుల భయకంపితులను జేయఁగా వారెల్లరును తిమ్మరుసు ననువర్తించువా రైరి. సాళ్వనరసింహభూపాలునిపుత్త్రుఁడైనయిమ్మడి నరసింహరాయని పెనుగొండ

రాజ్యమున కధిపతిని గావించి వానిని వానికుటుంబమును పెనుగొండదుర్గమున నుండునట్లుగ నియమించెను. ప్రథమకర్ణాటరాజవంశమునెడఁ పక్షపాతము గలవారి కెవ్వరికిని విద్యానగరమున గొప్పపదవు లేవియు నొసంగియుండ లేదు. కర్ణాటకులం వలన నేవిధ మైనయుపద్రవమును గూడకుండ వారిలో సమర్థులై యిష్టులుగా నున్న వారికి గొప్పపదవుల నిచ్చి కర్ణాటప్రజల మెప్పునుగూడఁ గాంచుచుఁ గర్ణాటకులకుఁ దెలుగువారికి వైమనస్యములు పెరుఁగకుండఁ జూచుకొను చుండెను. కర్ణాటదేశమునఁ దెలుఁగువారికిని, తెనుఁగుదేశమునఁ గర్ణాటకులకు నధికారపదవు లొసంగు చుండెను. తనకు నలువదియేండ్లు నిండకపూర్వమె మహామాన్యపదవిని బొంది మహాకర్ణాటరాజ్యచక్రమును జేత బట్టుకొని విదేశీయరాజ్యతంత్రజ్ఞులు నయితముఁ "జే" యని ప్రస్తుతింప హస్తనైపుణ్యము వన్నెకెక్కునట్లుగా గిరగిర దిప్పు చుండెను.

## తిప్పాంబకౌటిల్యము.

ఏమిహేతువుచేతనో చెప్పజాలము కాని నరసింహదేవరాయఁడు తిప్పాంబకంటెను నాగాంబికయం దెక్కువ ప్రేమమును జూపు చుండెను. దీనివలన తిప్పాంబకు నాగాంబికయందసూయ జనించెను. తిప్పాంబకుమారుఁ డైనవీరనరసింహదేవరాయఁడు నాగాంబకుమారుఁ డైనకృష్ణదేవరాయనికంటెను వయస్సునఁ బెద్దవాఁడు. తిమ్మరుసుమంత్రినే నాగాంబికాపుత్త్రుఁ డైనశ్రీకృష్ణదేవరాయనికి విద్యాగురువునుగా నరసిం

హదేవరాయఁడు నియమించెను. తనపుత్రులలో సమస్తవిధములు కృష్ణదేవరాయఁడే సుభగుఁడని తనసమ్ముఖమునఁ బలుమారు తిమ్మరుసు ప్రశంసింపుచు వచ్చినందున నరసింహదేవరాయఁడు నొకింత యసూయకముగాఁ గృష్ణదేవరాయని ప్రేమింపుచువచ్చెను. ఇది యంతయును దిప్పాంబకు మరిసినపుండులో నుప్పుపెట్టిన చందంబుగా నుండెను. తనకుమారుని పట్టాభిషిక్తునిఁ జేయక సపత్నీపుత్రుఁడైన కృష్ణదేవరాయనికే నరసింహదేవరాయఁడును తిమ్మరుసుమంత్రియుఁ బట్టము గట్టుదురని మనంబున నిశ్చయించి యొకనాఁడు తిప్పాంబాదేవి యిట్లు దురాలోచనము చేసెను.

“రాయనికి నామోదకంబైన నాగాంబికయందెక్కువయనురాగము గలదు. రాజునెడ నాగాంబకుఁ గలచనువు నాకు లేక యున్నది. రాజ్యతంత్రము నడుపు తిమ్మరుసుమంత్రి కృష్ణరాయనికి విద్యాగురు వయ్యెను. అందుచే మంత్రి కృష్ణరాయుని నరసరాయని సమ్ముఖమున స్తుతిపాఠములు చేయుచు నాతనియెడ రాయనికిఁ బ్రేమ మధిక మగునట్లు చూచుచున్నాఁడు. రాజ్య మన్ననో వంశక్రమాగత మైనది కాదు. ఇప్పటికి రెండువంశములు గడచినవి. మూఁడవవంశమునకుఁ దక్కు నని యెట్లు చెప్పనగును? ఈమంత్రిసత్తముఁడు రాయనిమరణానంతరము కథ యెట్లునడిపించునో యెవ్వరు చెప్పఁగలరు? సామ్రాజ్యమంతను బిడికిటఁ బట్టి యింటను బైటను నిరంకుశాధికారి యై ప్రవర్తించుచున్నాఁడు. ఇతని

కా దని యెదురో్కొనుట పట్టపురాణి నైననాకె సాధ్యము గాకయుండ మఱియెవ్వనికి సాధ్య మగును. ఇమ్మడి నరసింగ రాయని దూరముగాఁ గూరుచుండఁబెట్టి నరసరాయనిప్రతాప మును జాటుచు నాతని వలలో వేసికొని నరసరాయనిపేరుతో తా నే సామ్రాజ్యము నేలు చున్న యీబ్రాహ్మణమంత్రి నరసరాయనిమరణానంతరము నాకుమారుఁ డైనవీరనరసింహ రాయనికిఁ బట్టము గట్టు నని నా కెట్లు నమ్మకము కలుగఁ గలదు? తిమ్మరుసుమంత్రియుఁ గృష్ణరాయఁడు బ్రదికియుం డఁగా నాకుమారునకు రాజ్యము లభించు ననుమాట కల్ల. కావున వీరిలో నెవ్వని నైనఁ జంపించినఁ గాని నాకోరిక కొన సాగదు. తిమ్మరుసుమంత్రిని జంపించుట సాధ్య మగునని కాదు. అదియును గాక యతనిఁ జంపించితిమేని కట్టడ దప్పి రాజ్య మరాజకము కా వచ్చును. అప్పుడు నాకుమారునకే యీరాజ్యము దక్క నని చెప్ప రాదు. మఱియు నతఁడు బ్రాహ్మణుఁడు. అతని జంపితినేని బ్రహ్మహత్యాదోష మెన్ని జన్మముల కైనను నన్ను విడుచునా? కావునఁ గృష్ణరాయని జంపించుట కార్యసాఫల్యమునకు ముఖ్యము. అది సులభ సాధ్యము.''

ఇట్లు తలపోసి తిప్పాంబిక తనదాసీకన్యకలతోఁ గృష్ణ రాయనివిషప్రయోగముచేఁ జంపించుట కై దురాలోచనము చేసి వెంటనే యామహాకార్యమునకుఁ గడంగెను.

తిప్పాంబ విషప్రయోగముచే సపత్నీపుత్రుని జంపిం పఁబూనికొనియె నన్నసమాచారము దెలియరాఁగా తిమ్మరుసుమంత్రి విచారించి వానిని మృత్యువువాతఁ బడకుండ సంరక్షించెను. అంతటితో నిరుత్సాహపడి యూరకుండక తిప్పాంబ మఱింతదిట్టతనమును బూని కృష్ణరాయుని జంపింప ముమ్మారు ప్రయత్నించెను గాని తిమ్మరుసు వానిని ప్రాణాపాయమునుండి తప్పించి తిప్పాంబదౌష్ట్యమును దంపోసి తనయింటనే యుంచుకొని వానిని సంరక్షించుచు వచ్చెను. ఆమె దుష్ప్రయత్నములన్నియు నొకదానివెనుక నొకటి భగ్నము లయ్యెను. ఇట్లు కృష్ణరాయనిప్రాణములను గాపాడి విద్యాబుద్ధులు గఱపుచు, బెనుచు చున్నందునఁ గృష్ణరాయఁడు తిమ్మరుసుమంత్రిని 'అప్పాజీ' (నాయనగారూ) అని పిలుచు చుండెను. తిప్పాంబ కుమారుఁడైనవీరనరసింహదేవరాయఁడు భుజబలపరాక్రమసంపన్నుఁడైనను కుటిల స్వభావుఁడును క్రూరచిత్తము గలవాఁడు నై యుండెను. వీరనరసింహరాయనికిఁ దనపై నసూయ జనింపకుండ నాతని యువరాజునుగా సంభావించుచు తిమ్మరుసుమంత్రి యాదరింపుచు రాజనీతిధర్మముల నుపదేశింపుచుండెను. అఖండప్రజ్ఞాధురంధరుఁడైనయుగంధరునివంటివాఁడని వీరనరసింహరాయఁడు తిమ్మరుసును పితృసమునిగా భావింపుచు నాతనిదయను సంపాదించుకొనుటకై విధేయుఁడై యాతని కిష్టమైనరీతిగా వ్యవహరించు చుండెను.

## కృష్ణరాయనివిద్యాభ్యాసము.

శత్రువులవలన నేయుపాయమును గలుగకుండ సంరక్షించుటకై పితృవాత్సల్యముం బూని కృష్ణరాయునికి రక్షకునిగా తిమ్మరుసుమంత్రి ప్రజ్ఞాఢ్యుం డైనతనతమ్ముని గోవిందరాజును నియమించెను. అతనికిం దానును గోవిందుడును విద్యాబుద్ధులు గఱపు చుండిరి. పదునెనిమిదిసంవత్సరములప్రాయము వచ్చునప్పటికి నాంధ్రగీర్వాణభాషలయందు సాహిత్యజ్ఞానమును సంపాదించెను. కర్ణాటభాషయు, హిందూస్థానీభాషయు నభ్యసించెను. సాముగరిడీలం దేఱెను. ధనుర్వేదపారంగతుండయ్యెను. అశ్వారోహణమునందు గడితేఱి తురగరేవంతుండనం బ్రసిద్ధి గాంచెను. తిమ్మరుసు వానిబుద్ధికౌశల్యమునకు, తనయెడం గలభక్తికి సంతసించి రాజనీతి, దండనీతి మొదలగు రాజ్యతంత్రవిధానముల న్వయముగా నేర్పి మహోన్నతుని గావించెను. కృష్ణరాయఁడు సుందరాకారుఁడు. చక్కనిముఖవర్చస్సు గలవాఁడు. పొట్టియు,బొడవును గాక కాయపుష్టికిం దగినపొడవు గలవాఁడు. అతనిముఖముమీఁద స్ఫోటకపుమచ్చలు కలవు గాని ముఖవికాసము చూచినప్పుడుమాత్రము సార్వభౌమత్వమును స్ఫురింపఁజేయునట్టిరీతి గానంబడుచుండును. దేహమును దిట్టపఱచి సుస్థిరముతోఁ గదనభూమి దృఢముగ నిలుచుటకై కృష్ణరాయఁడు ప్రతిదినమును విడువకుండ శరీరసాధనము సలుపు చుండెను. ఇట్లు కృష్ణరాయఁడు పూర్వజన్మసుకృతవిశేషముననను, దైవానుగ్రహము వలనను, తిమ్మరుసు

మంత్రి కృపావిశేషమునను విద్యను, శరీరదార్ఢ్యమును, రాజనీతినైపుణ్యమునుమాత్రమె గాక పరస్త్రీయెడ సోదరీభావము నలవర్చుకొని తిమ్మరుసు నడిపినవిధముగా నడిచి యాతనికి ముదంబుఁ గూర్చుచుఁ బ్రజానురంజకుఁడై పరివర్తించుచుండెను.

## నరసరాయనిమృతి.

ఇంతలో క్రీ. శ. ౧౫౦౩-వ సంవత్సరమున నరసరాయనికి నుబ్బుజాడ్యము జనించి దినక్రమమున నభివృద్ధి నొంది తుదకు భయంకరమైనదిగాఁ బరిణమించెను. తాను జీవించెద నన్నయాశను విడిచిపెట్టెను. ఒకనాఁడు నరసరాయఁడు తిమ్మరుసును బిలుపించి యిట్లనియెను.

"అమాత్యవర్యా! నా కవసానకాలము సమీపించినది. ఇఁక నా బ్రదుకు దినములమీఁద నున్నదిగాని మాసముల మీఁద లేదు. ఇంతవఱకు రాజ్యభారమునంతయు నీమీఁద విడిచిపెట్టినందులకు నామాట దక్కించి సామ్రాజ్యము సముద్ధరించి వన్నెయు వాసియుఁ గల్పించితివి. నిన్ను నమ్మి నే నిఁక సుఖముగాఁ బ్రాణములను విడువఁగలను. నాసామ్రాజ్యమును నాబిడ్డలను నీ కప్పగించుచున్నాఁడను. ఈసామ్రాజ్యము నీచే సురక్షితము కాఁగలదు. ఈబిడ్డలు నీచే సురక్షితులు కాఁగలరు. నావెనుక వీరనరసింహదేవరాయనికిఁ బట్టము గట్టుము. అతఁడు నీసాహాయ్యమునను, కృష్ణయనితోడ్పాటునను బ్రజానురంజకముగా నీసామ్రాజ్యమును బరిపాలింపఁ గలఁడు. నాపుత్త్రి

లన్యోన్యము మత్సరగ్రస్తులై తగవులాడకుండఁ జూచుచు వారలను సంరక్షించుభారము నీయది. ఇమ్మడి నరసింగరాయనిచేఁ గాని వానివంకవారిచేఁ గాని యేవిధ మైనయుపద్రవము పొడమ కుండ సామ్రాజ్యమును సంరక్షింపఁగలసమర్థుండవు నీ వొక్కఁడవే సుమా.''

అని పలికి పుత్త్రులం బిలుపించి 'పుత్త్రకులార! తిమ్మరసు నేఁడుమొదలు మీకు రక్షకుఁడు కాఁబోవు చున్నాఁడు; సకలకార్యసమర్థుం డైనతిమ్మరుసు చెప్పినట్లు వర్తింపుఁడు; దాన మీకు సౌభాగ్యమును శ్రేయస్సును గలుగును, నేను బ్రతికియుండఁగా కృష్ణకు దిగువభాగమున నశ్వపతులకు, గజపతులకు రాజ్యము లేకుండఁ జేయవలయునని యెంతయో ప్రయత్నించితిని గాని దాని నెఱవేర్చుభాగ్యము నాకు లభించినది కాదు; ఎంతకాలము తురుష్కులు ముదిగల్లు, రాచూరు దుర్గములను స్వాధీనములో నుంచుకొనఁ గలుగుదురో అంత పర్యంతము సామ్రాజ్యమునకు క్షేమము లేదని యెఱుంగుఁడు. దక్షిణహిందూస్థానమున మీప్రతిష్ఠ నిలుపుకో దలఁచిన పక్షమున నేను సాధింపఁజాలక విడిచిపెట్టినదానిని మీరు సాధింపవలయును; తిమ్మరుసుబుద్ధి ననుసరించి వర్తింతురేని జయ మవశ్యము. మీకు లభ్యమగు ననుటకు నెంతమాత్రము సందియము లేదు' అని చెప్పి వెంటనే ప్రాణములను విడిచి కీర్తిశేషుఁ డై లోకాంతరగతుఁ డయ్యెను.

## వీర నరసింహుని పట్టాభిషేకము.

నరసరాయుని మృతి తిమ్మరుసునకు మఱింత కష్టప్రద మయ్యెను. వీరనరసింహుఁడు తిమ్మరుసునకు విధేయుఁడుగాఁ గన్పట్టుచున్నను విశ్వాసపాత్రునిగా నెంచుకొనలేదు. తిమ్మరుసు కృష్ణరాయనికిఁ బట్టము గట్టునేమో యన్న యనుమానమును భయమును నాతఁడు గలిగి యుండెను. అందువలన నాతనికి మాత్సర్య మంకురించెను. తనకును కృష్ణరాయనికి నెట్టి యుపకృతి గావించునో యన్న భయము తిమ్మరుసునకుఁ గలదు. తిమ్మరుసుమాత్రము నరసింహునిఁ దొలఁగించి కృష్ణరాయనికిఁ బట్టము గట్టవలయు నని యూహింప లేదు. ఇమ్మడి నరసింగరాయనికిఁ బట్టము గట్టక వీరనరసింహునకుఁ బట్టము గట్టిన యెడల సేనానులకు, మంత్రులకుఁ బ్రజలకు నిష్టముగ నుండునో లేదో యన్న భయము గలదు. సంగమరాజవంశీయులపక్షమున నున్నవారివలనఁగూడ భయము గలదు. ఇమ్మడి నరసింగరాయునికంటె వీరనరసింహరాయఁడు బలస్తోమము మెండుగా నుండుటచేతను, ఇమ్మడి నరసింగరాయఁడు పెనుగొండలో నుండుటచేతను, వీరనరసింహరాయఁడు సింహాసన మాక్రమించుకొని తానే సార్వభౌముఁడ నని ప్రకటించెను. అధికారివర్గము తిమ్మరుసుమంత్రిపట్ల భయమును భక్తియును గలవారు గావున విద్యానగరమున నాతని నెదుర్కొన లేకపోయిరి. తిమ్మరుసునెడఁ దన కెంతయనుమాన మున్నను నతనితో వైరము బెట్టుకొనుటవలనఁ గార్య భంగ మగు నని తలంచి

తిమ్మరుసును దనకుఁ దోడ్పడవలయు నని ప్రార్థించెను. తిమ్మరు సందులకు సంతసించి మంత్రిత్వమును బూని నరసింహుని విద్యానగరసామ్రాజ్యమున కభిషిక్తుని గావించెను. అదివఱకు ద్రావిడాంధ్రకర్ణాట దేశములలోఁ గప్పములు చెల్లించురాజు లనేకులు వీరనరసింహరాయనిప్రభుత్వము నంగీకరించినను కర్ణాటదేశములోనిసామంతనృపాలు రనేకులు కప్పములు చెల్లింప మని తిరస్కరించిరి. ఇమ్మడి నరసింగరాయనితో మఱి కొందఱు కుట్ర చేయు చుండిరి. ఒక్కమాఱుగ సామ్రాజ్యముఁ గల్లోలము జనించెను.

వీరనరసింహునిదిగ్విజయయాత్ర.

తిమ్మరుసుమంత్రి ప్రతిభాశాలి గావునఁ దురుష్కుల నుండి యపాయము కలుగ కుండుటకై తుంగభద్రానదీతటమున నొకకొంతసైన్యమును, గజపతులాక్రమించుకొని రాకుండ నుదయగిరిప్రాంతము సరిహద్దున నొకకొంతసైన్యమును గాపు వెట్టెను. ఇమ్మడి నరసింగరాయని బెనుగొండ రాజ్యమున కధిపతిని గావించి మాతని సమాధానపఱచి యూరకనుండి కలిగెడియుపద్రవమును దప్పించుకొనియెను. రాజధానియగు విద్యానగరమున మూలబలము విశేషముగా నుంచి సమర్థులును విశ్వాసపాత్రులు నగుదండనాథులను కొందఱను నగరరక్షకత్వమున నియమించెను. అట్టిదండనాథులలోఁ దిమ్మరుసుతమ్ముఁడు గోవిందరాజు ప్రముఖుఁడుగా నుండి నగరమున రాజద్రోహులను దలయెత్తకుండఁ జేసి విశేషసామర్థ్యముతో

నగరమును సంరక్షింపు చుండెను. వీరనరసింహరాయనిపిన్న తమ్ములగునచ్యుతరాయలను శ్రీరంగరాయలను గొంతసైన్యము నొసంగి కొంకణదేశమునకును, కర్ణాటదేశములోని తలకాడు, ఉమ్మత్తూరు మొదలగుప్రదేశములకును గప్పములను రాఁబట్టుటకై పంపెను. వారలు కొంకణదేశపునాయకులను జయించి వారలవలనఁ గప్పములను గొని తలకాడునకుఁ బోఁగా నచటిపాలెగాండ్రు కప్పములను జెల్లింపక తిరస్కరించుటయె గాక వారల యుద్ధమున నోడించి తఱిమిరి. అప్పుడు తిమ్మరుసు వీరనరసింహరాయనిసన్నిధానమున కేగి యిట్లనియె.

రాజేంద్రా! ఇదివఱకు మీతండ్రికిఁగప్పము గట్టుచున్నకొందఱుసామంతులును పాలెగాండ్రును మీరు పిన్నవారని యుద్ధతులై గప్పములు గట్టక స్వతంత్రులై మీయధికారమును దొలఁగఁజేయవలయు నని ప్రతిఘటించు చున్నారు. ఉమ్మత్తూరు శివసముద్రము పాలెగాండ్రపైకిఁ బంపినసైన్యము వారలతోఁ బోరాడి జయింపలేక మరలి వచ్చినది. ఇట్టిసందిగ్ధసమయమున మన ముపేక్షించితిమేని సామ్రాజ్యమునకుఁ జేటు వాటిల్లును. మీకుటుంబమునెడ నాకుఁ గలభక్తివిశ్వాసములు మీర లెఱుంగనివి కావు. మీతండ్రికి నాయెడఁ గలయనురాగమును విశ్వాసమును మీర లెఱుంగనివి. కావు. మీరును నన్ను విశ్వాసపాత్రునిగాఁ దలంచినయెడల నే నొక్కయాలోచనమును జెప్పెదను. నేను చెప్పినట్లు మీరు చేసెదరేని దాన మీకు విజయమును శ్రేయస్సును గలుగుటమాత్రమే గాక

సామ్రాజ్యము యొక్క ప్రతిష్ఠ లోకమున వ్యాపింపఁ గలదు. చిన్నపాము నైనఁ బెద్దకఱ్ఱతోఁ గొట్టవలయు నన్నసామెత రీతిగాఁ గప్పములు చెల్లింపక ప్రతిఘటించిన చిన్నపాళెగాండ్రను సయితము గొప్పసైన్యములతోఁ బోయి రూపు మాపవలయును. మనకుఁ గప్పములు చెల్లింపక ప్రతిఘటించు చున్నవారుకొందఱు సామ్రాజ్యములోపల నున్నవా రని యీమహానగరమునఁ దెలియక పూర్వమె వారల నడంచుఁబ్రయత్నములను జేసి విజయమును గాంచుట శ్రేయస్కరము. వజ్రసింహాసనరక్షణకొఱకును, రాజ్యపరిపాలనానిర్వహణముకొఱకును నేను రాజధానియందు నిలిచియుండెదను. మైసూరుదేశమునందలిపాళెగాండ్రను జయించి కప్పములుగొనుటకు నీతమ్ముఁడు కృష్ణరాయఁడు సమర్థుఁడు. అతఁడు విశ్వాసపాత్రుఁడు. నీకు విధేయుఁడైనతమ్ముఁడు గాని యన్యుఁడు గాఁడు. మీరు తీర్థయాత్ర పేరు చెప్పి బహుళసైన్యముతోఁ బోయి సామ్రాజ్యమునంతయును దిరిగి కప్పములను గొని రావలయును. కప్పములను జెల్లింపక తిరస్కరించెడివా రుందు రేని వారలను బదభ్రష్ఠులను గావించి వారిస్థానములఁ గ్రొత్తవారిని నియమించి కప్పములను గ్రహింప వలయును. అట్లు గాక యుద్ధము జరుపవలసివచ్చెనేని సంశయింపక శత్రువుల రూపుమాపుటకుఁ గడంగ వలయును. ఒకప్పుడు నీతోడనున్నసైన్యము చాలదని తోఁచెనేని నాకు వర్తమానము చేసినయెడల వెంటనే

సైన్యమును సమకూర్చి పంపెదను. అవశ్యము మీరాలీమహా కార్యమును నిర్వహించి దిగ్విజయమును జేయ వలయును.''

ఇట్లు ప్రబోధించిన మంత్రివర్యుని ప్రబోధమునకు వికాసమును జెంది వీరనరసింహరాయఁడు తిమ్మరుసుతో నిట్లనియెను

''అమాత్యవర్యా! మాతండ్రి పరలోకగతుఁ డగు నప్పుడు మమ్ములను మాసామ్రాజ్యమును నీ కప్పగించి మా సంరక్షణభారము నీమది యని చెప్పెను. అర్థార్థవిదుండవు; అఘటనాఘటనచాతుర్యధురీణుండవు; సకలకార్యసమర్థుండవు; మహారాజ్యతంత్రజ్ఞుఁడవు; నీవు మాకు విశ్వాసపాత్రుఁడవు గాక యన్యుఁడవే? నీ వేదిపనిచిన దానిఁ జేయుటకు నే నెప్పుడును వెనుకీయువాఁడను గాను. నీచేశిక్షితుఁడైన మాతమ్ముఁడు కృష్ణరాయఁడును మాకు విశ్వాసపాత్రుఁడే. అందుచేత నీ వెంతమాత్రమును సందేహింపవలదు. ఇదే నేను దిగ్విజయయాత్ర వెడలి కప్పములు చెల్లింపక ప్రతిఘటించినపాలెగాండ్రను శిక్షించి కప్పములు గైకొని తీర్థయాత్రలు సేవించి శీఘ్రకాలములోనే వచ్చెదను. ఈరాజధానిని, వజ్రసింహాసనమును నీవ కాపాడు చుండుము.''

అని చెప్పి యొకనాఁడు శుభముహూర్తమున బహుళ సైన్యసమేతుఁడై తీర్థయాత్రను సాటించి దిగ్విజయయాత్రకై బయలు వెడలెను.

తిమ్మరుసుమంత్రియుఁ గృష్ణరాయనిఁ బిలువ నంపించి ''వీరాగ్రణీ! కర్ణాటదేశమునందలిరాజులును, పాలెగాండ్రును

మీకుఁ గప్పములను చెల్లించుట మానుకొనుటయె గాక మీ యధికారమును ధిక్కరించుచున్నారు. కొంతసైన్యముతో మీతమ్ములను బనుప వార లాపాలెగాండ్రతోఁ బోరాడియు వారిని సాధింపఁజాలక మరలి వచ్చిరి. వారలను జయించి కార్యము సాధించి కప్పములు గొనిరా నీవ సమర్థుండ వగుటం జేసి మీయన్న నిన్నుఁ బనుచు మని నా కాజ్ఞాపించెను. అతఁడు దక్షిణదేశవిజయయాత్రకుఁ బోయి యున్నవాఁడు. అతఁడు తిరిగి వచ్చునప్పటికి నీ వీమహాకార్యమును నిర్వహించుకొని రావలయును. ఇందువలన నీకును నాకును జాలప్రతిష్ఠ గలుగును. నీయెడ నేకముం దెట్టియనుమానమును మీయన్న కుండలేదు. సత్వరముగ నచ్యుతరాయనిఁ దోడుగాఁ గైకొని దక్షిణకర్ణాటముపై దండయాత్ర వెడలు" మని నియమించి కొంతసైన్యము నాతనిపరము గావించెను.

## కృష్ణరాయనివిజయము.

ఇట్లు నియమింపఁబడిన కృష్ణరాయఁడును బహుళసైన్యసమేతుఁడై మంత్రిసత్తముని యాజ్ఞను శిరసావహించి వెంటనే కర్ణాటముపై దాడివెడలి యుమ్మత్తూరును ముట్టడించి మూఁడు మాసములు ఘోరయుద్ధము చేసి శత్రువులను దూలించి దుర్గమును స్వాధీనముఁ జేసికొనియెను. అపుడు శివసముద్రము కోటలో రాజ్యము చేయుచున్న త్యాగరాజు స్వర్గస్థుఁడు కాఁగా నతనికుమారుఁడు గంగరాజు శివసముద్రముకోటలోనుండి కృష్ణరాయని నెదుర్కొనియెను. కర్ణాటదేశములోఁ గావేరి

తీరమునం దున్న బలాఢ్యము లైనదుర్గములలో శివసముద్రము మొట్టమొదటిదిగా నెన్నవలసిన దై యున్నది. అటుపిమ్మట కృష్ణరాయఁడు గంగరాజునకు శత్రు వైనచిక్కరాయఁ డను పాలెగాని వశపఱచుకొని మఱికొందఱుపాలెగాండ్రనుగూడఁ జేరఁదీసి ప్రేతపర్వతము, గొరికొండలనడుమ దండు దిగి కావేరి కనమమార్గములో శత్రువుల నడ్డగించి శివసముద్రమును సంవత్సరమువఱకు ముట్టడించెను. అప్పు డాగంగరా జాయవమానమును భరింపఁజాలక కావేరిమడుగులోఁ బడి ప్రాణత్యాగముఁ జేసెను. కృష్ణరాయఁడు శివసముద్రమును స్వాధీనపఱచుకొనియెను. అటుపిమ్మట నాతఁడు మఱికొన్ని పాలియంపట్టులను జయించి కర్ణాటదేశమునకంతకు శ్రీరంగపట్టణము నధికారస్థానముగా నియమించి శంఖచక్రములు గలధ్వజము (కృష్ణరాయనిధ్వజము) నెత్తించి కర్ణాటదేశములోనిపాలెగాండ్రందఱను కప్పముక్రిందను గోటిద్రవ్యము నిచ్చునటు లేర్పాటు చేసి రాజధానికి మరలి వచ్చెను. కృష్ణరాయనికీర్తి యావిజయముతో దేశమంతట వ్యాపించుటయె గాక శత్రురాజులకాతనిపేరు చెప్పిన భయము కలుగుచుండెను. తిమ్మరుసు మంత్రి తనశిష్యుఁ డైనకృష్ణరాయఁ డట్టివిజయమును గాంచినందులకపరిమితానందమును బొంది యతని బహువిధముల శ్లాఘించెను.

### వీరనరసింహరాయనితీర్థయాత్రలు.

అట వీరనరసింహరాయఁడును ప్రతాపవంతుఁడై శత్రు

జనభయంకరుఁడై దక్షిణదిగ్విజయయాత్రకై బయలువెడలి తిరస్కరించినపాలెగాండ్రను దొలఁగించి, వారిస్థానముల క్రొత్తవారిని నియమించుచు, తన్నెదుర్కొని పోరాడినవారిని రూపుమాపుచు దక్షిణసముద్రమువఱకుఁ బోయెను. పాండ్య, చోళ చేరదేశములలోనిరాజు లెల్లను గప్పములను సమర్పించి స్నేహము చేసికొనిరి. ఈదండయాత్రలో వీరనరసింహరాయని నెదిరించి మార్కొని పోరాడినవారిలో నొక్కఁడును దప్పించుకొని పోయి యుండ లేదు. అతఁడు సామ్రాజ్యమంతటను సంచారము చేసి తనప్రభుత్వమును స్థిరపఱచుకొని భుజబలవీరనరసింహరాయఁడని ప్రసిద్ధి గాంచెను. అతఁడు, కంచి పక్షితీర్థము, కుంభఘోణము, చిదంబరము, జంబుకేశ్వరము, శ్రీరంగము, మధుర, రామసేతువు, గోకర్ణము, కాళహస్తి, అహోబలము, శ్రీశైలము, త్రిపురాంతకము, వేంకటాచలము, సంగమేశ్వరము, మొదలగు బహుపుణ్యక్షేత్రములను సేవించి దేవబ్రాహ్మణభక్తి కలిగి బ్రాహ్మణుల కనేకభూదాన గోదానసువర్ణదానముల నొసంగి ప్రఖ్యాతిఁ గాంచెను. ఇట్లొకటిరెండుసంవత్సరములలో శత్రువుల నాదఱను జయించి కప్పముల నేర్పాటు చేసికొని రాజధానిఁ బ్రవేశించెను.

## వీరనరసింహదేవరాయని పరిపాలనము.

వీరనరసింహరాయఁడు తనతండ్రియైననరసింగరాయఁడు సాహసింపఁజాలనికార్యమునకుఁ దానొడిగట్టి యిమ్మడి నరసింగరాయనిఁ ద్రోసిపుచ్చి తానే రత్నసింహాసన మాక్రమించు

కొని తిమ్మరుసు తన్నుఁ బట్టాభిషిక్తునిఁ జేయ నవక్రపరాక్రముఁడై పరిపంథిరాజుల నుక్కడంచి ధరావలయమును బరిపాలించి **మహా**రాజాధిరాజు, రాజపరమేశ్వరుఁడు, కోపకృతప్రతిపార్థివదండపాణుఁడు, శేషభుజక్షితిరక్షణశౌండుఁడు; భాషిగెతప్పువరాయరగండఁడు, మూరురాయరగండఁడు పరరాజభయంకరుఁడు, హిందూరాయసురత్రాణుఁడు, దుష్టశార్దూలమర్దనుఁడు, గ[illegible]ఘుగండభేరుండుఁడు మొదలగు ప్రసిద్ధబిరుదములను బొంది యిరువదేండ్లు పరిపాలనము చేసెను. అదివఱకు సంపాదించిన దేశములను జక్కఁబఱచుకొని సామ్రాజ్యమును స్థిరపఱచుకొనుటకు మాత్రమె ప్రయత్నించెను గాని గజపతులను, అశ్వపతులను జయించుటకుఁ దలఁపెట్టియుండ లేదు. ఆ కార్యమును బూనక పూర్వమే క్రీ. శ. ౧౫౨౯-వ సంవత్సరములో జాడ్యగ్రస్తుఁడై కాలధర్మము నొందుట సంభవించెను అతఁడు మరణముఁ జెందునప్పటికిఁ నాతనికిఁ దిరుమలదేవరాయడను నెన్మిదేండ్ల వయస్సు గలకుమారుఁ డొకఁ డుండెను.

## వీరనరసింహరాయని దుష్టబుద్ధి.

వీరనరసింహరాయఁడు కుటిలస్వభావుఁ డనియుఁ గ్రూరచిత్తము గలవాఁ డనియు మొదటనే చెప్పి యున్నాఁడను. ఇతఁడు చాలకాలమునుండి తిమ్మరుసునెడ ననుమానమును, కృష్ణరాయనియెడ నీర్ష్యయుఁ గలవాఁడై యుండెను. తనకును, తనసంతతివారికిని లేకుండఁ జేసి కృష్ణరాయఁడు సామ్రాజ్య మపహరించు నన్న భయము కలదు. అతనియెడఁ బక్షపాతి

గావున. తిమ్మరుసు నాతనికిఁ దోడ్పడునని పెద్దయనుమానముతో నుండెను. కృష్ణరాయని నాతనితమ్మునిను జంపింప నూహించెను గాని తిమ్మరుసునెడఁ గలభయముచేత సాహసింపఁజాలఁ డయ్యెను. ఈమూఁడేండ్లును తిమ్మరుసునెడఁ గలభయముచేతఁ బైకి ప్రేమానురాగము లుట్టిపడుచున్నట్లుగా బ్రవర్తించుచుఁ దనకుటిలస్వభావమును బయలుపుచ్చకయున్నను అవసానదశయందుఁ దనదుష్టబుద్ధి వెల్లడింపక తప్పినది కాదు. తనయనంతరము తిమ్మరుసు కృష్ణరాయనిఁ బట్టాభిషిక్తునిఁ గావించునని దృఢముగా నమ్మియున్నవాఁడగుటచేతఁ గాటికి గాళ్లు చాచుకొని మంచముపైఁ బన్నుండి లేవలేనిస్థితిలో నుండి తిమ్మరుసును రహస్యముగాఁ బిలువనంపించి యిట్లనియెను. "అమాత్యవర్యా! నీవు నాతండ్రియాజ్ఞను బరిపాలించి నన్నుఁ బట్టాభిషిక్తునిఁ గావించి నాచేత సామ్రాజ్యమేలింపఁ జేసితివి. నీయనుగ్రహమున నే నిట్టిసార్వభౌమపదవికి వచ్చి జన్మసార్థక్యమును గాంచితిని. నాతండ్రియాజ్ఞ యెట్లు పరిపాలించితివో అట్లే నాయాజ్ఞనుగూడ నీవు పరిపాలింపవలసినకాల మాసన్నమైనది. నా మరణానంతరము నా కుమారుఁడైనతిరుమల దేవరాయనికిఁ బట్టముఁగట్టి నీవు కార్యకర్తవై సామ్రాజ్యమును బరిపాలింపవలసిన దని నాయాజ్ఞ. నీవు నా కుమారునకుఁ బట్టముగట్టక యాతనిఁ జంపించి కృష్ణరాయనికి బట్టము గట్టెద వని నా కిప్పు డొకపెద్దయనుమానము పుట్టినది. కావున నిఁకముందు కృష్ణరాయనివలన రాజ్యమున కేవిధ

మైనయుపద్రవము పొడమకుండ నుండుటకు నీవు కృష్ణరాయనికన్నుల పెఱికించి తెప్పించి నాకు చూపించిరేని గాని నాప్రాణములు పోవు" అని పలికి యట్లు చేయ నామంత్రివర్యున కాజ్ఞాపించెను. ఆపలుకులు చెవులకు ములుకులై నాట నదరిపడి తిమ్మరుసు యొకింతసేపు మౌనము వహించి ధైర్యము తెచ్చుకొని సాహసముతో నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

"రాజేంద్రా! ఇ దెంతపని? దీనికై నీవు పరితపింప నక్కఱ లేదు. ఇది మనస్సులోఁ బెట్టుకొని బాధపడకుము. నేను పోయి యవశ్యము నీకార్యముఁ దీర్చి వచ్చెద" నని చెప్పి సెలవు గైకొని తన మందిరమునకు వెడలి పోయెను.

తిమ్మరుసు పరివేదనము.

కృష్ణరాయనికి విద్యాబుద్ధులు గఱపి పెంచి పెద్దవానిని జేసినది నేను. నేను బెంచిన మొక్కను దుంచివేయ వీరనరసింహదేవరాయఁడు నా కాజ్ఞాపించినాఁడు. ఆహా! ఇతఁ డెంత కుటిలాత్ముఁడు? ఎంత క్రూరచిత్తుఁడు? పితృసమానునిగ భావించుచుఁ గృష్ణరాయఁడు నన్ను నమ్ముకొని యున్నవాఁడు. కులభేద మొక్కటి విడిచినపక్షమున నేవిషయమునందును నా కుమారుఁడైనగోవిందునికంటె భిన్నముగ నాతని జూచుకొనుచుండుట లేదు. సమస్తవిధములచేతను సామ్రాజ్యమును బరిపాలింపఁ దగినవాఁడు కృష్ణరాయఁడు గాని వీర నరసింహుని పుత్త్రుఁడైనతిరుమలరాయఁడు గాఁడు. కృష్ణరాయఁ డిరువదేండ్లు దాటినవాఁడు. తిరుమలరాయఁ డెనిమిదేండ్లవాఁడు.

అశ్వపతులను గజపతులను నిగ్రహింపవలసిన ఘనకార్యములు ముందున్నవి. సామ్రాజ్యము నింకను పెంపు నొందింపవలసి యుండెను. కృష్ణరాయఁడే వీనినెల్ల నిర్వహింప సమర్థుఁడు కాని యెనిమిదేండ్ల బాలునివలన నేమి కాఁగలదు? వీని మోసముచేసియైనఁ గృష్ణరాయనిఁ గాపాడి యీసామ్రాజ్యమున కభిషిక్తుని గావింప వలయును. కృష్ణరాయని విడిచి నేను బ్రదుకఁ జాలను. అని వెంటనే కృష్ణరాయనికి సమాచార మంప రహస్యముగా రప్పించి యతనిం గాంచి కన్నుల నీరు నించుచు నిట్లనియెను.

కృష్ణరాయా! వింటివా మాయన్నగారివాక్యములు? తనకుమారునకుఁ బట్టము గట్టి నీకన్నులు పెఱికించి తెచ్చి చూపవలయు నని నా కాజ్ఞాపించినాఁడు. ఇప్పుడు నేనేమిచేయ వలసియుండునో చక్కఁగా యోచించి చెప్పుము.

అని పిడుగువంటి యావార్త వినిపించెను. అప్పుడు తిమ్మరుసునోటనుండి వెలువడినందున నిక్కముగాఁ నాతఁడు తనకన్నులను పెఱికించుటకై పిలువనంపి రప్పించి యుండు నని భావించి సంభ్రమముఁ జెంది గద్గదభాషి యై తిమ్మరుసు కాళ్ళపైఁ బడి ‘అప్పాజీ! నానవతితల్లితిప్పాంబ విషము పెట్టించి చంపించవలె నని ప్రయత్నించునపుడెల్లను విఘాతము లాచరించి నన్ను సంరక్షించితివి. విద్యాబుద్ధులు గఱపి పెక్కురాజ నీతులుపదేశించితివి. ఇప్పటికిని గంటికిఱెప్పవలెఁ గాచుచున్నా డవు. కాని మాయన్నకు గాని సామ్రాజ్యమునకుఁ గాని నేను

చేసిన ద్రోహ మెద్దియును లేదు. తనకుమారున కపకృతి చేయుదు నని కదా మాయన్న నాకన్నులను బెఱికింప నాజ్ఞాపించినది! సామ్రాజ్యము గాని సామ్రాజ్యమున నే యధికారముఁ గాని నా కక్కఱ లేదు. నేను వైరాగ్యమును బూని జోగి నై విహరింతును. అన్యాయ్యముగా నాకన్నుల నేల పెఱికించెదరు? నన్ను రక్షించి విడువుము. దేశాంతరము పోయి బ్రదుకుగాంచెదను. నన్ను విడువ నీకు వలను పడ దేని కన్నులను బెఱికించుటకుమాఱు శిరచ్ఛేదమును గావింపుము. నీకెంతయుఁ బుణ్యము గలుగు" నని కన్నీరు గార్చుచు బతిమాలుకొనియెను. అతనియారాటమును గాంచి జాలినొంది తిమ్మరుసుమంత్రి వానివీపు తట్టుచుఁ గుమారా! నీకు వచ్చిన భయము లేదు. నిన్ను నేను కాపాడి యీసామ్రాజ్యమున కభిషిక్తుని గావింప సంకల్పించి యున్నవాఁడను. వీరనరసింహరాయఁడు మరణించువఱకు నెవ్వరికిఁ గానుపింప కుండ నా మందిరముననే దాఁగొని యుండు మని యాతనికభయహస్తమిచ్చి వెంటనే యొకయాఁడు మేఁక కన్నులను దెప్పించి పట్టుకొనిపోయి ప్రాణముల విడువ నున్న వీరనరసింహదేవరాయనికిఁ జూపించెను. అతఁ డాకన్నులను జూచి సంతోషించి కుమారుని తిమ్మరుసున కప్పగించి యాక్షణమె ప్రాణములను విడిచెను. అంత నర్హవిధానమున సంస్కారవిధులు నివర్తింపఁజేసి కృష్ణరాయనిఁ జక్రవర్తిగాఁ బ్రకటించెను.

# పంచమప్రకరణము.

సీ. సర్వజ్ఞుఁ డగుమంత్రి సవదరించినరాజు
కార్యఖడ్గమ్ములక్రమ మెఱుంగు
కార్యఖడ్గంబులక్రమ మెఱింగినరాజు
బహువిధముల మూలబలముఁ గూర్చు
బహువిధముల మూలబలము గూర్చినరాజు
శత్రుల నవలీల సంహరించు
శత్రుల నవలీల సంహరించినరాజు
ధరణి యేకాతపత్రముగ నేలు
కావున మహాప్రధానాగ్రగణ్యబుద్ధి
యధిపుసామ్రాజ్యమునకు సర్వాంగరక్ష
రాయమలవరగండ! వీరప్రచండ!
గుండభూపాలు నరసింహమండలేంద్ర!"

అని మున్ను సాళ్వనారసింహభూపాలుని యాస్థానకవీంద్రుఁడు చెప్పినచందమున మహాప్రధానాగ్రగణ్యునిబుద్ధియే యధిపుని సామ్రాజ్యమునకు సర్వాంగరక్ష యనుమాట యథార్థము. సర్వజ్ఞుం డని చెప్పందగినతిమ్మరుసుమంత్రిబుద్ధియె యీయభినవకర్ణాటసామ్రాజ్యమునకుసర్వాంగరక్షగానుండె ననుట యతిశయోక్తి గాదు. తిమ్మరుసువంటిమంత్రి సత్తము డుండుటచేతనే కృష్ణదేవరాయనివంటిచక్రవర్తి యుండుట

సంభవించెను. అరటిపం డొలిచి చేతి కందించినరీతిగా నేవిధమైనకష్టమును పోరాటమును లేకుండ నుపభోగింపు మని మహాసామ్రాజ్యవైభవమునంతయుఁ గృష్ణరాయనిహస్తమునం దుంచి యాతనికిఁ జేసినవాగ్దత్తమును నెఱవేర్చుకొనియెను. అదివఱకె తిమ్మరుసునకుఁ గలస్వామిభక్తియుఁ బ్రజాసంరక్షణాసక్తియు లోకములో వ్యాప్తమై యుండుటచేఁ బ్రజ లెల్లరును తిమ్మరుసే తమ కేడుగడ యని నమ్మి విశ్వాసముతోఁ గార్యములలోఁ నతిశ్రద్ధాళు రై తోడ్పడు చుండిరి. తక్కుంగలభృత్యపరివారసామంతమంత్రివర్గము తిమ్మరుసుని పితృసమునిగా భావింపుచు భయభక్తులతో వినయవిధేయులై వర్తింపుచుండిరి. ఇట్టిమహావైభవపదవియం దున్నతిమ్మరుసు నెదుర్కొని యెవ్వఁడు బ్రదుకఁగాంచును? కావున నెవ్వరును గృష్ణరాయని రాజ్యాభిషేకము నడ్డుకొనువారు లేకపోయిరి.

## రాజ్యపట్టాభిషేకము.

తిమ్మరుసుమంత్రి శా. శ. ౧౪౩౦ కి సరియైన శుక్లనామ సంవత్సర మాఘ శుద్ధచతుర్దశినాఁడు (1509-వ సంవత్సరము ఫెబ్రవరి 4-వ తేది) సామ్రాజ్యాభిషిక్తునిఁ గావించుటకు నిశ్చయించి సామ్రాజ్యమునందంతటఁ బ్రకటింపఁజేసెను. మహారాజులకు సామంతనృపవర్గమున కాహ్వానముల నంపించెను. అతఁడు మహోద్భుతముగా విజయనగరము నలంకరింపఁజేసెను.

ఇతరస్థలములనుండి సైన్యములను వెక్కింటిని రాజధానికి
రప్పించెను. విజయనగర మెట్లలంకరింపఁజేసెనో యేవిధ మొ
క్కింతో కుమారధూర్జటి యనుకవివరుండు తనకృష్ణరాయవిజ
యంబను గ్రంథమున నీక్రిందిపద్యములలో నభివర్ణించియున్నాఁడు

"సీ. ప్రణుతింప నలరెను తోరణస్తంభ పరసీమ
లనురీతి నూత్నతోరణము లెసఁగ
రథుల ఖండించి సత్కృపఁ దత్ప్రభుల నిల్పు
నట్లు ద్వారములందు నవటు లలర
నిరీక్షింపనటులఁ దిక్కుల జయస్తంభాళి
ననుమాడ్కిఁ జిత్రత్వపూర్వ లలర
వెలయు నిత్యతనికేతులు దిక్కటుల నన్న
సరణి ముత్తెపుగుగ్గుజగ్గు లమర
నభినవాలంకృతిస్ఫూర్తి నతిశయించె
నప్పురీరత్న మప్పుడు మహోద్యమముగఁ
బ్రకటమహిమల శ్రీకృష్ణరాయనృపతి
శ్రీకరం బైనపట్టాభిషేక వేళ."

మహామండలేశ్వరు లైనమహారాజు లనేకులు కృష్ణరాయనికిఁ గానుక లంపించిరి. అనేకసామంతనృపతులు పట్టాభిషేకము సందర్శింప విజయనగరమున కేతెంచిరి. మఱియు శ్రీరంగపట్టణమునుండి కుమారవీరశ్యామలరాయఁడు, కందనోలినుండి ఆర్వీటి శ్రీరంగరాజు, నంద్యాలనుండి నంద్యాల నారపరాజు, ఆకువీటినుండి ఆకువీటితిమ్మరాజు, గండికోటనుండి పెమ్మసాని రామలింగనృపతి, కొచ్చెర్లకోటనుండి రావెల

పెదతిమ్మభూపాలుఁడు, వెలుగోడునుండి వెలుగోటికుమార తిమ్మభూపాలమౌళియు నింక ననేకు లాపట్టాభిషేకమహోత్సవమును సందర్శింప నేతెంచిరి. ఇట్లుండ సింహాసనాధిరోహణ సమయము తటస్థము కాఁగాఁ గృష్ణరాయనికిఁ బన్నీట జలక మార్చి, కిరీటాంగదాదులు సమర్పించి సర్వాభరణభూషితుం గావించి యిరుబయలుదేఱుసమయం బిదె వచ్చె నని తెలియఁ బఱచ, నందు కారాకొమరుండు సిద్ధముగా నున్నాఁడ నని తెలిపెను. పిమ్మట తిమ్మరుసుమంత్రి యొకవిచిత్ర మైనకథ నడిపించె నఁట! తిమ్మరుసుమంత్రి కృష్ణదేవరాయనితో నొకరహస్యము చెప్పవలసియున్న దని యాతని నొకగదిలోనికిఁ గొనిపోయి తలుపుచాటునకు రమ్మని చేరఁదీసి యిదె రహస్య మని యొక చెంపకాయఁ దనసత్తువుంతోఁ గొట్టె నఁట! ఆచెంప పెట్టునకు కన్నులనీరు గ్రమ్మి నెత్తురు తల కెక్కి తల దిమ్మెత్తఁ గృష్ణరాయఁడు చలికిలంబడియె నఁట! తనకంట నీరు నించుచు తిమ్మరుసాతనిముంగటఁ గూరుచుండి యుండె నఁట! కొంత వడికి నారాకొమరుఁడు తెప్పిరిల్లి కన్నులు విచ్చి తిమ్మరుసును వీక్షించె నఁట! అంత తిమ్మరుసు రాయనిం గౌఁగిలించికొని ముద్దాడి యిట్లనియె నఁట!

"అన్నా! నీదేహము నొచ్చె నని నన్ను దూషింపకుము. ఈపనిఁ జేయుటకుఁ జేతు లాడక యిన్నిదినంబు లూరకున్నాఁడను. ఇఁక నూరక యున్న స్వామిద్రోహము చేసినవాఁడ నగుదు నన్న భయముచేత నిపు డీకృత్యము నెఱపితిని

నన్ను మన్నింపుము" అని మంత్రిశేఖరుఁడు పలుక నతఁ డచ్చెరువంది తన కేవిధ మైనయుపకారమును గలుగకుండఁ బ్రతిదినమును వేయిగన్నులతో వీక్షింపుచు సంరక్షించుచున్న తిమ్మరుసు కారణము లేనిదే నేఁ డిట్టిపని చేసి యుండఁ డనియు, ఏది చేసినను తనయుపకారమునకే చేయు నన్నవిశ్వాసము గలవాఁడు గావున తిమ్మరుసుం జూచి ప్రసన్నముఖుఁ డై చిఱునవ్వు నవ్వుచు నతఁ డిట్లనియె.

"అప్పా! కుమారునిఁ దండ్రి యూరక దండించునా? ప్రేమాలోపముచే దండించు నని యెవ్వ రైన నందురా? కుమారుఁడు బాగుపడుమార్గము తండ్రికిం దెలిసినట్లు తనయునకుం దెలియునా? దీనినే మహాప్రసాదముగా స్వీకరించుచున్నాఁడను."

అని వినయవిధేయుఁ డై భక్తిపురస్సరముగాఁ జేతులు జోడించుకొని నిలువంబడినకృష్ణరాయనిఁ బునఃపునరాలింగనంబుఁ జేసికొని శిరంబు మూర్కొని యానందబాష్పములు దొరుగ నతండు మరల ని ట్లనియెను.

నాయనా! నీ విట్టివాఁడ వని యెఱింగి యున్నవాఁడ నగుట నే నీసాహసకార్యమున కొడిగట్టితిని. దీని నీ వెట్లుగా భావింతువో యని భయపడు చున్నవాఁడను. నీ విపుడు నా పట్ల ప్రసన్నముఖుఁడ వై పలుకుచున్నవాఁడవు గావున నా సంశయమును భయమును నివారణము లైనవి. ఇఁక నేఁ జేసిన

నకుఁ గారణమును దెలిపెద వినుము. నాయనా! నీ వింతవఱకు పువ్వులలోఁ బుట్టి పువ్వులలోఁ బెరిఁగినవాఁడవు. ఆగర్భశ్రీమంతుఁడవగుటం జేసి సుఖములనే గాని యెన్నఁడును గష్టములు నెఱుంగవు. ఇప్పుడు నీవు బహుజనపరిపాలకుఁడవు గాఁ బోవుచున్నావు. ఇంతటినుండి మేము నీ యాజ్ఞానువర్తులము కావలసినవారము గాని నీకు బుద్ధులు గఱపవలసినవారము గాము. దండనాయకులవలనఁ బ్రజలకుఁ గలుగుబాధ ప్రభువు స్వానుభవమువలనఁ గ్రహింపఁ జేని యట్టిప్రభువు ప్రజలను క్రూరదండనల పాలుచేసి జనకంటకుం డనిపించుకొనును. అట్టి దండనాయకులవలనఁ గలిగెడినొప్పి ప్రభువున కనుభవములో నుండుట ప్రజలపాలిటిభాగ్య మని చెప్పఁదగును. అట్టి భాగ్యము నీప్రజలకును, అందుమూలముగా నీకీర్తి విస్తరించు భాగ్యము నీకును, గల్గించుట కిపు డీకార్యముం జేసినాఁడను. నీవు విశ్వాసపాత్రుఁడ వని నమ్మి అన్నివిద్యలలో నిమర్మము నీ కిదివఱకే తెలిపియున్నాఁడను. ఇంతవఱకు నీవు మాకృష్ణరాయఁడవే. ఇప్పుడు నీకు నీపని దెలుపకున్న నీకేమియుఁ దెలియఁ జేయుటకు సాధ్యపడ దని యీవిద్యనుగూడ నేర్పించి నిన్ను రాజ్యముఁ జేయఁ బంపుచున్నాఁడను. ఇఁక నీవు పోయి యెనుబదికోట్లవరహాలతో నిండియున్న బొక్కసమును గైకొని సింహాసనారోహణము గావించి యాచంద్రార్కస్థాయిగాఁ గీర్తిని వహింపఁజేయునట్టి ప్రజాపరిపాలనముఁ జేయుము." అని తిమ్మ

రుసు దీవించెను. అంత కృష్ణరాయఁడు తిమ్మరుసుబుద్ధివిశేషమునకు మెచ్చుకొని ప్రత్యుపకారముగాఁ బాదాభివందనమాచరించెను. పిమ్మట తిమ్మరుసు రాయనిం దోడ్కొని వెలుపలికి వచ్చి గజారోహణముఁ జేయించి మంత్రియొకగజముపైఁ దానధిష్ఠించి శంఖకాహళభేరీప్రచండవాద్యరవంబులు భూనభోంతరము నిండ మహావైభవముతో నూరేగించి రాజమందిరమునఁ బ్రవేశ పెట్టి యొకశుభముహూర్తమున రత్నసింహాసనాధిష్ఠితుం గావించెను.*

---

* పై నుదహరించినకథ కీర్తిశేషులైన బ్రహ్మశ్రీ నుదుజూఁడి శ్రీరామమూర్తిపంతులవారి 'తిమ్మరుసుమంత్రిచరిత్రము' నుండి గ్రహింపఁబడినది.

## ష ష్ఠ మ ప్ర క ర ణ ము

### తిమ్మరుసు కారుణ్యము.

అట్లు తిమ్మరుసు కృష్ణదేవరాయని సామ్రాజ్యాభిషిక్తుని గావించిన వెనుక నొకనాఁడు రహస్యముగా నతనికడకుఁ బోయి మహాప్రభూ! పూర్వాచారము ననుసరించి పట్టాభిషేకమునకు ముందు వీరనరసింహదేవరాయని పుత్త్రుఁడైన తిరుమలరాయని, ఓబాంబికాపుత్త్రుఁడైన అచ్యుతరాయని బంధనప్రాప్తులను గావించితిమి. వారల నట్లుంచుట మనకు క్షేమకరముగాదు. వీరనరసింహదేవరాయఁడు మీకు ద్రోహము చేయఁదలంచినను మీరుమాత్రము మాతనికుమారునకు నపకారము చేయరాదు. అదియునుగాక యతఁడు ప్రాణములు విడుచునప్పుడు తనకుమారుని నాకొప్పగించెను. ఆబాలుని సంరక్షించుట మీకు విధియై యున్నది. అచ్యుతరాయఁడు నిరపరాధి. అతనివలన నపకారమింతవఱకు జరిగినది లేదు. అయినను వారలను రాజధానీనగరమున నుంచుట అనేకానర్థములకు మూలమై యుండును. కావున వారలను రాజధానికి దూరమున భద్రముగా సంరక్షించుట కర్తవ్యము. వారి నుంచుటకుం దగినప్రదేశము చంద్రగిరిదుర్గమై యున్నది. అక్కడ వారలరక్షణకొఱకు సైన్యము నుంచి జీవనార్థము కొంతదేశము నిచ్చి స్వేచ్ఛగా మననిచ్చుట మీయౌదార్య

బుద్ధికి వన్నె బెట్టిన ట్లుండును. అట్లనుగ్రహింపు' మని వేడు కొనియెను. ఔదార్యగుణశీలుఁడై నయామహాప్రభువు మంత్రి శేఖరునిప్రార్థనమును మన్నించి యాతఁడు చెప్పినట్ల వారలను జెఱ విడిపించి కరుణార్ద్రహృదయుఁడై చంద్రగిరిదుర్గమునకుఁ బంపించి కొంతరక్షకసైన్యము నుంచి వారలజీవనార్థము కొంత దేశము పై రాఁ గలరాఁబడి నొసంగి జనస్తుతికిఁ బాత్రుఁ డయ్యెను.

## తిమ్మరుసు కార్యనిపుణత్వము.

ఎన్నఁడు స్వప్నమునం దైన నెదురుచూడనిమహా సమస్య యొకటి భయంకర మైనస్వరూపమును దాల్చి తిమ్మ రుసు నెదుర్కొనియెను. చిన్ననాఁటనుండియుఁ బెంచినవాఁడు తిమ్మరుసు మంత్రియైనను నాతనికిఁ దెలియకుండఁ గృష్ణదేవ రాయఁడు బాల్యమున నొకవేశ్యాంగనాపుత్రికతోడ నెయ్య మును గల్పించుకొనియెను. అంత దినక్రమమున నానెయ్యము గాఢానురాగము క్రిందను బరిణమించి వర్ధిల్లుచుండెను. ఆమెపై దనకుఁ గలమోహావిశ్వాసములనుబట్టి తనకు సామ్రాజ్యాధి పత్యము లభించినయెడల నామెను బట్టపురాణిగఁ జేతు నని పలు మఱు వాగ్దత్తము చేయుచు వచ్చెను. అవేశ్యాంగనాపుత్రిక నామము చిన్నమ్మ. ఈచిన్నమ్మను దనకును గల ప్రేమపాశమును ద్రెంచుకొనఁజాలక కృష్ణదేవరాయఁడు తా నొకమహాసామ్రా జ్యమున కభిషిక్తుఁ డయ్యును చిన్నమ్మయింటికిఁబోనిసీఁ డై రాత్రు లందు రహస్యముగా నామెగృహమునకుఁ బోవు చుండెను.

అతిగోప్యమై యున్న యీసువార్తను యొకనాఁటిరేయి తిమ్మరుసుకంటఁ బడియెను. అప్పుడు తిమ్మరుసుమంత్రి యచ్చెరువు నందుచు దాను మిక్కిలి నొచ్చుకొని యాతని వెంబడించి పోయి యాతఁడు చిన్నమ్మగృహము ప్రవేశించిన వెనుకఁ దానును బ్రవేశించి నానావిధములఁ జివాట్లు పెట్టి నీతు లెన్నో యుపదేశించి దానం గలిగినమహోపద్రవమును నచ్చఁజెప్పి మరల రాజభవనమునకుఁ గొని వచ్చెను. కృష్ణరాయఁడు సిగ్గుపడియు భయపడియు నూరకుండక యొకింత తెగింపునకు సాహసించి 'అప్పా! ఏమని చెప్పుదు. ఆమెయెడ నాకుఁ బ్రేమ మగ్గలమై యున్నది. ఆమెను విడిచి నేను బ్రదుకఁజాలను. ఆమెను వివాహము చేసికొందు నని వాగ్దత్తము చేసి యున్నాఁడను. రాజ్యవియోగము నైనను భరింపగలను గాని యామెతోడి వియోగమును భరింపఁజాలు. నా కెట్టి సామ్రాజ్యమును సమకూర్చి పెట్టితివో అట్లే నా ప్రాణనాయకి యైన యానర్వాంగిసుందరిని నాకు సమకూర్చిపెట్టుము. మాయనురాగము విధివిహితమైనది. దీని నెడఁబాపుట కెవ్వరును సమర్థులు కారు. ఇవిగో నామానప్రాణధనంబులు నీకు సమర్పించుచున్నాఁడ" నని దైన్యభావము దేఁటపడఁ బలుకుచు బహుభంగుల వేఁడుకొనియెను. అప్పుడు తిమ్మరుసు దీర్ఘముగా నాలోచించి యిఁకఁ దాను ప్రతిబంధకములఁ గల్పించి వారల నెడఁబాపుట తనకును సామ్రాజ్యమునకుఁ గూడ ముప్పు వాటిల్లఁజేయు నని గ్రహించి లోకనిందకుఁ బాత్రము గాకుండ నుండువిధమునఁ

గార్యసానుకూల్యము గావింతు నని యాప్రభునకు వాగ్దత్తము చేసెను. అంతఁ గొన్ని దినములకు శ్రీరంగపట్టణాధీశ్వరుం డగు వీరశ్యామలరాయనిపుత్త్రిక యగుతిరుమలమ్మ నిప్పించి కృష్ణరాయనికి వివాహము గావించెను. ఆవివాహమహోత్సవ మంతయు ముగిసిన వెనుక నొకమహాభవనమును నిర్మింపించి యందు తిరుమలదేవిని చిన్నాదేవిని బ్రవేశపెట్టించెను. నాఁట నుండియు రాయఁడును, ప్రభువులును, ప్రజలును చిన్నమ్మను గూడఁ బట్టపురాణిగ భావించి చిన్నాదేవి యని సమ్మానించు చుండిరి. తిరుమలదేవికిని చిన్నాదేవికిని భేదము నెంచకయే యుభ

---

* చిన్నాదేవి వేశ్యాంగనాపుత్త్రిక యని కృష్ణరాయని సమకాలీనులగు 'పేయస్, నన్నిజు' అను పోర్చుగీసు చరిత్రకారులు వివరముగా వ్రాసియుండుటచేత నిది యథార్థ మని యొప్పకొనక తప్పదు. శ్రీకృష్ణదేవరాయని యాస్థానకవులుగా నుండి స్వారోచిషమనుసంభవమును, పారిజాతాపహరణమును వాని కంకితము గావించిన అల్లసాని పెద్దనామాత్యకవియు, నందితిమ్మనామాత్యకవియుఁ గూడ:—

"క. ఆ భువనంతరంబ భ
ద్రాచలయముఁ దాల్చె గృష్ణరాయఁడు చిన్నా
దేవియు శుభమతి తిరుమల
దేవియునుం దనరఁ గూర్మిదేవేరులుగాఁ"

(మనుచరిత్రము)

"క. శ్రీ వేంకటగిరి వల్లభ
సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ
జీవితనాయక కవితా
ప్రావీణ్యఫణీశ కృష్ణరాయమహీశా.

(పారిజాతాపహరణము)

యరాజుల నొక్కరీతి సామ్రాజ్యమునఁ బూజించు చుండిరి. కృష్ణరాయఁడు తనరాజులలో నెల్ల నీమెయెడనె యెక్కువ మక్కువ కలిగి యుండె నని చరిత్రకారులు వ్రాసిరి. ఈమె జ్ఞాపకార్థము కృష్ణరాయఁడు విజయనగరములో నాగలాపుర మనియెడు నొకగొప్పపేటను మిగులరమ్యముగా నుండునటులు గట్టించి చుట్టును ప్రాకారమును నిర్మింపించె నఁట. పరిభువర్గములో జేరినవారలలోఁ బెక్కండ్రు దివ్యభవనములను గట్టి కాపుర ముండునటుల గావించెను. ఇందు మైలునరపొడవును నలువదిమూళ్ళవెడల్పును గలయొకవీథి సొగసుగా నిర్మింపఁబడినది. ఈవీథిని చరిత్రకారులనేకు లభివర్ణించి యుండిరి. కృష్ణరాయఁడు తఱుచుగా నిందే నివసించు చుండును. ఈనాగలాపురమునకు వచ్చెడిసరకుల పై వేయఁబడినసుంకముల వలన నలువదిరెండువేలవరహాలు వసూలు చేయఁబడుచుండె నఁట! ఈయదృష్ట మంతయును చిన్నాదేవమ్మగారి దనుటకు సందియము లేదు. కృష్ణదేవరాయనిమనోభీష్టమునకు విరుద్ధముగా వర్తించి తిమ్మరసు వీరలయనుసంధానమునకు విఘాతము చేసి యుండెనేని చరిత్రము మాఱి యుండును. తిమ్మరుసు దీర్ఘదర్శియై సామ్రాజ్యసంరక్షణమే ప్రాధాన్యముగా నెంచుకొని వర్తించు చున్నవాఁ డౌటచే నీయనుకూలదాంప

---

అనుపద్యములలో తిరుమలదేవిని, చిన్నాదేవిని గూడఁ బట్టపురాణులనుగ నభివర్ణించి యుండుటయే యిందున గొప్పవిచిత్రము. ఏమికారణముననో ఆముక్తమాల్యదయందు చిన్నాదేవి పేరు విడిచిపెట్టఁబడినది.

త్యమును సంఘటింపఁజేసి తనకార్యనిపుణత్వము లోకమునకు వెల్లడించెను.

## తిమ్మరుసు చారపద్ధతి.

అసామాన్యప్రజ్ఞాప్రగల్భుఁడు గావున ననుక్షణమును కంటికిఱెప్పవోలె తిమ్మరుసుమంత్రీంద్రుఁడు కృష్ణదేవరాయని సంరక్షించు చుండెను. అతఁ డెంతరహస్యముగా నేమి గావించినను మఱుక్షణముననే మంత్రివర్యునికిఁ దెలియు చుండును. తిమ్మరుసవలంబించినచారపద్ధతి యాతనికిఁ దప్ప రాయనికిఁ గాని సామ్రాజ్యమున మఱియెవ్వరికిఁ గాని దెలియకుండెను. ఇట్టి ప్రతిభావంతుఁ డగుటచేతనే తిమ్మరుసును గన్నెత్తి తేఱి పాఱఁ జూచుటకు నెల్లవారు భయపడు చుందురు. ఇతనిచారవర్గమునందు స్త్రీలును, పురుషులును, కొజ్జాలును గలరు. ఇతనిచే నేర్పఱుపఁబడినచారులసంఖ్య యింత యని లెక్కింప నలవికాదు. ఒకనాఁడు కృష్ణదేవరాయఁడు తన పైనుండు భక్తివిశ్వాసములచేఁ బ్రజలు విధేయులై యున్నవారో కేవలము తిమ్మరుసువలనిభయముచేత విధేయులై యున్నవారో స్వయముగాఁ బరీక్షింపఁగోరి పట్టపగ లెవ్వరికి జెప్పకుండ నొక్కఁడు నంతఃపురము బయలుదేఱి నగరములో దూరమున నున్న యొక దేవళమును బ్రవేశించెను. అచటిస్థానికు లీతని రాయనింగా నెఱింగి శుద్ధజలంబు లొసంగిన నతఁడు నామతీర్థం బొనరించి తద్దేవతానివేదనపదార్థము లుపయోగించి కృతాచమనుఁడై సుఖముగాఁ గూరుచుండెను. ఇంతలో నియమిత

స్థానమున నాయకుడు లేకుండుటఁ గాంచి తిమ్మరుసు తత్తరిం పుచు వెనుక నుండఁ దన చారు లేతెంచి యాతఁ డొంటరిగాఁ జేవళమునకుఁ బోయినవార్త దెలిపిరి. అతఁ డెంతయు వగచుచు గతుక సైన్యముతోఁ బోయి కృష్ణరాయనిం గలిసికొనియెను. అపుఁ డచ్చెరు వందియుఁ గొంచెముకోప మభినయించి ఏమి పుట్టిమునిఁగిన దని యిచ్చటికే తెంచితి వని తిమ్మరుసును బ్రశ్నించెను. అంత భయవినయంబు లెసఁగ మంత్రీంద్రుఁ డిట్లనియెను.

“ మహాప్రభూ! దేవరవా రిట వచ్చు టెఱుంగక వెనుక నుండి నొకచారుఁడు రహస్యముగా నేలిక వచ్చినజాడఁ దెల్పినందునఁ బౌరు లెవ్వరికి నీసమాచారముఁ దెలియకుండఁ జేసి వేఁటకొఱకు మనప్రభువు బయలుదేఱి వెడలుచున్నాఁడు గావున మీ రందఱును సన్నద్ధులై రా వలసిన దని కొందఱు సైనికులకు వర్తమాన మంపి యిటకు వచ్చినాఁడను. మీ యిష్టానుసారముగా నేకార్యముఁ దలపెట్టినను నవలీల నిర్వహింప మీయాజ్ఞానువర్తులమై మెలఁగు నావంటిమంత్రులుండ సమస్తవైభవముతో నొప్పెడిమందిరమును విడిచి యొంటరిగా నిచటికి రాఁ దగునా! నీరాక యితరు లెవ్వరైన విన్నచో నెంతవైపరీత్యము సంభవించునో దేవరవారికిఁ బోడగట్టెనేని యింతసాహసకార్యమునకు నొడిగట్టి యుండరు. మీ వంటిరాజాధిరాజులు సామాన్యులవిధముగా నిట్లు రాఁ జెల్లునా? అయ్యో! ఎంతపని చేసితిరి!” అని తిమ్మరుసుమంత్రి న్యాయ

ష్టూరవాక్యములతో మందలింపఁగా నాగార్జునుఁడు మంద
హాసము చేయుచు నిట్లు ప్రత్యుత్తర మొసంగెను.

ఓ మంత్రిపుంగవా! ఆనాటనాటఁ సామర్థ్యము గల
మీవంటియమాత్యశేఖరు లుండఁగా నిర్విచారముతో మేము
యథేచ్ఛాసంచారముఁ జేసినఁ బ్రమాద మేమి యుండును?
పరాక్రమసామర్థ్యశక్తిసంపన్ను లగుటఁ జేసి మీరు సాధించిన
పక్షమునఁ దృణము మహామేరు వగును. మీరు కానిచో
మహామేరువే తృణ మగును. మీవంటిమహాత్ములు మంత్రు
లుగా మాకు లభించుట మాపూర్వజన్మభాగ్యము గాని మఱి
యొండు కాదు.

ఇట్లు కృష్ణదేవరాయఁడు పలుక నాగార్జునునిమాటలచమ
త్కారమునకు మనస్సులో నుప్పొంగుచు తిమ్మరుసు హర్షిం
చి యిట్లనియెను.

దేవా! మేము నెఱుఁగుదుము. ప్రభువు నాజ్ఞాపింపు
ననుసరించి భయభక్తులతోఁ బ్రవర్తింపవలసినవారము. తృణ
గ్రాహి యైనసేవకున కెచ్చటను విలువ తనకేమే యగును;
కాని యది కేవలము తృణ మని దానిని గ్రహింపరాదు. నీ
విశిచిపరిమాత్రమున నయ్యది జారిపోవును. కావున ప్రభు
వులు పరిగ్రహించినఁ బ్రజలే సమ్మానార్హు లగుదురు. దేవర
వారిప్రతాపముమూలముననే గాని యన్యథా సమర్థులై యొప్ప
గలుగుదురు? ఏలిక యాజ్ఞాప్రకారము కార్యములు నడచును
దేవా! మీయాజ్ఞ యెట్లో అట్లే సమస్తకార్యములు నిర్వహిం

తుము. దేవరవా రింక నగరమునకు విచ్చేయ వలయు. అని ప్రియనయభయంబు లేర్పడఁ బలికిన తిమ్మరుసుపలుకులకు నానందించి రాయండు సదయాత్ముఁ డై యిట్లనియె.

## కృష్ణరాయనిప్రార్థనము.

మహారాజాధిరాజు నై యుండి నే నిట్లొంటరిగాఁ జనుదెంచుట తగనిపని యని నామనంబున కిప్పుడు దృఢముగాఁ దట్టినది. నారాకను దెలిసికొని రక్షకసైన్యముతో వచ్చి నన్ను సంరక్షించి పితృవాత్సల్యమును జూపినందులకు నీకు నే నెంతయుఁ గృతజ్ఞుఁడను. నీహితోపదేశమును శిరసావహించినాఁడను. మహాత్మా! నేను దుష్టనిగ్రహమును శిష్టజనపరిపాలనమును జేసి జగంబున నాచంద్రార్కస్థాయిగాఁ గీర్తి గాంచున ట్లనుగ్రహించి నీవును శాశ్వతమైనయశస్సును బడయుము. నాతండ్రి నరసింహదేవరాయఁడు గాని, నాసోదరుఁడు వీరనరసింహదేవరాయఁడు గాని, యీసామ్రాజ్యమును సంపాదించిన సాళ్వనరసింహరాయఁడు గాని సాధింప లేక విడిచిపెట్టినకార్యములను నేను నిర్వహించుమార్గమును నాకుఁ జూపి నీవుతోడ్పడి విజయమును సమకూర్పవలయును. రాచూరు, ముదిగల్లు దుర్గములు విజాపురసుల్తానుచే నాక్రమింపఁబడినవి. ప్రాగ్దిశాభాగమున నుదయగిరివఱకు గల దేశమును గజపతు లాక్రమించు కొనిరి. ఆదేశములనుండి శత్రురాజులను తఱిమివేసి యాభాగములను మదీయసామ్రాజ్యమునఁ జేర్చుకొని దక్షిణహిందూస్థానమున నేకచ్ఛత్రాధిపత్యమును వహించి పరిపాలింప వల

యు నని నాకు పెద్దకోరికఁ గలదు. ఇంతియ గాక యింతసా మ్రాజ్యభారమును వహించి నేను కేవలము నాకు సామంతు లుగ నున్నవారికడ నుండు సైన్యముల నమ్మి యుండుటకంటె స్వంతబలమును గూర్చుకొని యుండుట నాకు శ్రేయస్కర మనుమాట నీ వెఱుంగనిది కాదు. అట్టిబలమును నాకు సమ కూర్చి పెట్టవలయును.

అని ప్రార్థించిన నతండు చిఱునవ్వు నవ్వుచు 'ప్రభూ త్తంసమా! ఇంతమాత్రమునకై నీవు పెద్దగా యోచింప వలయునా? నీమనోభీష్టముప్రకారము సమస్తకార్యములను జక్కఁబెట్టెదను. ఇంక జాగు సేయక వైళంబ లెమ్ము. మన మిచ్చట నుండుట తగదు. బయలువెడలుద' మని పలికి యతని నొక యేనుఁగు పై నెక్కించి రక్షకసైన్యము వెంటనంటి రాఁ గా రాజభవనమునకుఁ దోడ్కొని వచ్చెను.

## తిమ్మరుసుహితబోధ.

అట్లు రాయనిఁ దోడ్కొనివచ్చి 'మహారాజేంద్రా! అంగరక్షకసైన్యము లేకుండ నొంటరిగ స్వమందిరమును విడిచి యిఁకముందెచ్చటికి బోనని నాకు వాగ్దత్తము చేయు' మని ప్రార్థింప నామంత్రిపుంగవుని ప్రార్థనమును మన్నించి యతఁ డట్లు వాగ్దత్తము చేసెను. అప్పుడు తిమ్మరుసు సంతోష సాగరమునఁ దేలియాడుచుఁ దనయేలికతోడ నిట్లు మనవి చేసెను.

దేవా! మీ చిత్తానుసారము దిగ్విజయయాత్ర కనుకూలము లైన ప్రయత్నములను జేయుటకు నాకు రెండుసంవత్సరముల కాలము గడు వీయవలయును. అశ్వపతులును, గజపతులును, బలవంతులు. వారలతో నొక్కమారుగా వైరముం బెట్టుకొనుట యనర్థహేతువు. నీవు నీసోదరపుత్త్రుని దూరముగాం బాఱందోలి పట్టాభిషిక్తుండ వై పరిపాలనము చేయుచుంటివి. నీకు నీసామ్రాజ్యమునం బ్రబల శత్రువులు గలరని యెప్పుడు నేమరక యుండుము. నిన్నుం బదభ్రష్టుని జేయ నవకాశముకొఱకు నిరీక్షించు చుందురు. ఇట్టి సందర్భమున వెనుక ముందు నాలోచింపక బలవంతులతోడ యుద్ధముల కుపక్రమింతుమేని దానం బ్రమాదము గలదు. ఇట్టివారి కై వేరపాటు కూడదు. రాజ్యాంగమును బలపఱచుకొన వలయును. సైన్యములను సమావేశపఱచుకొని యాగుసంస్కారములను గావించి సంసిద్ధముగా నుంచుకొన వలయును. అర్థంబులను దెచ్చి భండారము నింపవలయును. పరిఘాదుర్గంబులు అన్న శస్త్రజలసమృద్ధంబు లగునట్లుగా సిద్ధపఱచుకొన వలయును దుర్గప్రాకారములను వప్రంబులను, కొమ్మలను, ప్రతోళంబులను, అగడ్తలను, అట్టళ్ళను, యంత్రింబులను, అనువుపఱచుకొని, ధాన్యంబులాదిగా వస్తువర్గముల సమకూర్చుకొని, విశ్వాసపాత్రులైన సర్దారలను పాలెములందు, గొలువు నిలిపి, వెట్టి వారి కర్తవ్య మగునట్లు గావించుట పరిశుద్ధ కర్తవ్యము. వీని నన్నిటిని చక్కపఱచుకొని యసంఖ్యాకంబు లగు

తోడ దండయాత్రలకు వెడలించో నవలీలవిజయమును బడయ వచ్చును. కావున దేవరవారు రెండుసంవత్సరములకాలము వేచి యున్నపక్షమున నేను చెప్పినచొప్పున సామ్రాజ్యమును దిటవు పఱచి దండయాత్రలకు సైన్యము సన్నద్ధము గావింతును. ఎదిరిబలమునకును తనబలమునకును గల తారతమ్యమును దెలిసికొనకుండ యుద్ధమునకుఁ గడంగుట చేటునకు మూలము. అసాధ్యమైనది ప్రజ్ఞచే సాధ్యమగును. నీవు సాహసంబున విక్రమార్కుని మించినవాఁడ వౌదువు. నీవు సంగ్రామధనంజయుండవని నే నెఱుఁగుదును. నీవు శత్రువుల నవలీల జయింతువు. అందుకు సందియము లేదు గాని నేఁ జేయఁబూనిన రాజ్యాంగసైన్యసంస్కరణములు ముగియునంతవఱకు నోరించుక కాలము వేచి యుండుట శ్రేయోదాయకము."

అని బోధించి తిమ్మట (తిమ్మరుసుమంత్రి) సైన్యసంస్కరణమునకుఁ గడంగెను.

ప్రథమసంస్కరణము.

తనయెడఁ గృష్ణదేవరాయునికి నమ్మకము కలుగఁ జేయు మార్గమునఁ బోక, కార్యసాఫల్యమునే ప్రధానముగాఁ జూచుకొని, తనపై మహాప్రభువునకు భక్తివిశ్వాసములు ముప్పిరిగొను విధముగాఁ బరిశ్రమింపుచుఁ గార్యకౌశల్యగౌరవమును జూపుచు తిమ్మరుసుమంత్రి జాగరూకుఁడై మెలఁగుచుండెను. అయిన రాయునికి దనపై నమ్మకము పుట్టింపఁ గొందఱు సామంతప్రభువు లపవాదములను వేయుచుండిరి. కృష్ణదేవరా

యుఁడు తనరాజ్యభారమునంతయును తిమ్మరుసుమంత్రి పై నిడి విద్యావినోదములం దగుల్కొని ప్రమత్తుఁడై యున్నవాఁడని కొందఱుసామంతప్రభువు లపవాదములు పుట్టింప శత్రురాజులు వానిని విశ్వసించి వారివలన రాయనిరాజ్యములోనిరహస్యముల గ్రహింపుచు రాయని జయించి వారికి స్వాతంత్ర్య మొసంగెద మని వాగ్దత్తమును జేసి సమరసన్నాహములను జేయుచుండిరి. ఈ వర్తమానము రాయనికి ముందుగాఁ దెలియవచ్చెను. అప్పుడు వెంటనే కృష్ణదేవరాయఁడు సమయము కానిసమయ మైనను తిమ్మరుసును తన సముఖమునకు రమ్మని వర్తమానము చేసెను. తిమ్మరుసు జపము చేసికొను చుండఁగా రాజభటులు వచ్చి రాయనియాజ్ఞను దెలిపిరి. అతఁడు బుద్ధికౌశలము గలవాఁడు గావున రాయనితలంపు గ్రహించి జపమును మాని దిగ్గన లేచి యిదె వచ్చెద నని రాజభటులకుఁ దెలిపి యొకదొడ్డిలోనికిఁ బోయెను. రాజభటులును వానిని వెంబడించి పోయిరి. అతఁ డాకతోఁటకూరగమడిలోఁ గూరుచుండి పెద్దపెద్దమొక్కలను బెకలించి దూరముగాఁ బడవైచుచు, చిన్నమొక్కలజుట్టును మళ్ళు గట్టి సమీపమున నున్న బావిలోనుండి యుదకమును చేది దానిం దెచ్చి యాచిన్నమొక్కలను దపుచు నుండె నఁట! దీని నంతయును జూచినరాజభటు లితఁడు రాజాజ్ఞోల్లంఘన చేయఁదలంచి కాలయాపనకై యీపని పెట్టుకొన్న ట్లున్నది; వెంటనే పోక యున్న మనలను గూడ రాజు శిక్షించు నన్నభయముచేత మరలి పోయి

మావృత్తాంతము నంతయుఁ దెలిసిన కృష్ణదేవరాయఁడు తిమ్మరుసుఁడనే విద్యాబుద్ధులు నేర్చినబుద్ధిమంతుఁడు గావున నతఁడు తన యాజ్ఞ నుల్లంఘించువాఁడు కాఁ డని తాను బాగుగా నెఱింగినవాఁడు గావున నతఁడు చేయుచున్న పని తననిమిత్తమే యని గ్రహించి యందలి రహస్యమును దెలిసికొని తనకనుమానము గలిగించిన పెద్దసామంతులను దొలఁగించి వారిస్థానముల విశ్వాసపాత్రులైన చిన్నసామంతులను నియమించి యాజ్ఞాపత్రముల నొసంగి వెంటనే మీ యధికారములను జెల్లింపుఁ డని యాజ్ఞ చేసి యంతఃపురమందిరమునకుఁ బోయెనఁట! తానును వారిం గైకొని తమకు వలయు సేనాసహాయముతోఁ బోయి యొకరివర్తమాన మొకరికిఁ దెలియకుండఁ బెద్దసామంతులను దొలఁగించి వారిసంస్థానముల నాక్రమించుకొనిరఁట! ఈ వృత్తాంతములను దెలిసికొని పరరాష్ట్రప్రభువులు నిరుత్సాహులై యుద్ధప్రయత్నమును మానుకొనిరఁట! కృష్ణదేవరాయనిసామర్థ్యమును బ్రజలు బహుభంగులఁ గొనియాడుచుండిరి. తిమ్మరుసుబుద్ధినైపుణ్యమును రాయ లభినందించెనఁట. ఈకథ యెట్లైనను అనుమానాస్పద మైనవర్తనము గలసామంతులను దొలఁగించి యాస్థానముల విశ్వాసపాత్రులైన సామంతులను నిలిపి ముందు రాజ్యోపద్రవమునుండి సామ్రాజ్యమును తన నేర్పరితనముచేత తిమ్మరుసు సంరక్షించినది సత్యమగుటకు సందియము లేదు. ఇట్టిపని జరిగిన వెనుక

నెల్లవారును రాయనిపట్లను మంత్రిపట్లను భయభక్తులతో వర్తించుచుండిరి.

## ఇతరసంస్కరణములు.

కృష్ణదేవరాయఁడు సింహాసనారూఢుఁడగుటకు బూర్వము దేశములోఁ గొంతభాగము రాయనివశమునను, మఱికొంత భాగము సామంతప్రభువులవశమున నుండెడిది. ఈమహారాజ్యమంతయును నాయకరములుగా విభాగింపఁబడి యొక్కొక్క నాయకర మొక్కొక్క రాజాజ్ఞానువర్తి యగునాయకునిచేఁ బరిపాలింపఁబడు చుండెను. ఈనాయకులు రెండువిధములైన తెగలుగ విభాగింపఁబడి యుండిరి. ఒకతెగనాయకులు తాము జీతములు గైకొనుచుఁ దమనాయకరములో సంపాదించిన యూరసమంతయును నగరికిఁ బంపెడియాచారము గలవారుగ నుండిరి. వీరినే కేవలనాయకు లని చెప్పఁదగును. మఱియొక తెగనాయకులు గలరు. వీరు పుత్రపౌత్రానుక్రమముగాఁ బరిపాలనము చేయుసామంతరాజులు. వీరినే అమరనాయకు లందురు. వీరు రాజునకై కొంతసేనను సిద్ధపఱచి యుంచు పద్ధతికే లోఁబడి తమనాయకరము లనుభవించు చుండెడివారు. నియమించినవిధమున వీరలకడ నుండుసైన్యములు సంఖ్యలోఁ గొఱవడి యుండుటయె గాక గుణముచేతను గొఱవడియుండుటఁ గనుపెట్టి తిమ్మరుసుమంత్రి యాసైన్యములను సమకూర్చుకార్యము వారలనుండి తొలఁగించి సైన్యమునంతయును దనవశము చేసికొని బలపఱచి యెప్పుడు యుద్ధము తటస్థమైనను

యుద్ధము చేయుటకు సిద్ధముగా నుండునట్లు గావించెను. కృష్ణదేవరాయఁడు పరరాష్ట్రాధిపతులతో నెప్పుడు యుద్ధము చేయవలసివచ్చినను నెంతమాత్రమును సైన్యములకొఱఁత లేకుండఁ బదిలక్షల సైన్యమును సిద్ధముచేసెను. ఈసైన్యములు వెచ్చమునకుఁగా నమరనాయకులనుండి కప్పములను గొనును సైన్యములమీఁది యధికారమును తిమ్మరుసుమంత్రి రాయనిపై నుంచెను. అతనియధికారమును వీరునా రనక యెల్లవారును శిరసావహింపవలసినదే. ముప్పదియాఱువేలగుఱ్ఱపుదళమును రాయఁడు స్వయముగాఁ బోషించునట్లు చేసెను. ఎనిమిదివందలయేనుఁగులనుగూడ రాయఁడు పోషించుచుండెను. ఈరెండుసంవత్సరములలోను గావలసినంతధనమును బొక్కసములోనికిఁ జేర్చెను ప్రతిసంవత్సరమును విజయదశమినాఁడు రాయఁడు తనసేనలను బరీక్షించి సైనికులకు బహుమానములు మొదలగునవి చేయునట్లుగ నేర్పాటు గావించెను. ఇట్టియేర్పాటులయొక్క ప్రయోజనమును జక్కఁగా గ్రహించి శ్రీకృష్ణదేవరాయఁడు తనజన్మము సార్థక్యము నొందింప భూతలము పై నవతరించినదేవగురునిగా తిమ్మరుసును సంభావింపుచుఁ నాతనికిఁ గృతజ్ఞుఁడై తనవలన నాతనికి నానావిధములఁ దనకు లోకమున గౌరవము కలుగునట్లుగాఁ జాలకాలము ప్రవర్తించెను.

## విద్యాగోష్ఠి.

ఈమంత్రిశిఖామణి సంస్కృతాంధ్రములందు నసామాన్యపాండిత్యము గలవాఁడు. కర్ణాటాంధ్రపారసీభాషలలో

వ్యవహారము జరుపనేర్చినవాఁ డయినఁ గాఁడు. పలుభాషలు ముచ్చటింప నేర్చిన పెద్దఁడు. ఇతఁడు సంస్కృతమునం దపార మైన ప్రజ్ఞ గలవాఁ డగుటకు నగస్త్యేశ్వరవిరచిత మైనసంస్కృత బాలభారతమునకు నితఁడు చేసినవ్యాఖ్యానమే గొప్పనిదర్శనముగాఁ జూపవచ్చును. ఇతఁడు సంస్కృతాంధ్రసాహిత్యము గలవాఁ డగుటచేతనే ప్రసిద్ధకవీంద్రు లనేక లీకృష్ణదేవరాయని యాస్థానమునకుం జేరుకొనిరి. వారిలోఁ బ్రధానులు అల్లసాని పెద్దనామాత్యుఁడును, నందితిమ్మనామాత్యుఁడు నై యుండిరి. మొదటివాఁడు నందవరీకనియోగిబ్రాహ్మణుఁడు; రెండవవాఁ డార్వేలనియోగిబ్రాహ్మణుఁడు. వీరు మహాకవులుగాఁ బరిగణింపఁబడు చున్నను కృష్ణరాయనికాలమున మండలాధికారులుగఁ గూడ నుండిరి. వీరు నిరంతరమును రాయని వెంబడించి యున్నవారు గావున వీరిని మంత్రివర్గములోఁ జేర్పవచ్చును. వీరికి రాయనికడ సర్వస్వాతంత్ర్యమును గలదు. వీరి కిట్టిసమ్మానము గలుగుట సాళువతిమ్మమంత్రీంద్రునిభాషాపక్షపాతమును, కవిత్వమునందలిప్రేమయును దక్క వేఱొండు గారణము గానరాదు. బొడ్డుచర్లతిమ్మనామాత్యుఁ డనుకవీంద్రుఁ డొకఁడు కలఁడు. అతఁడు రాయనితోఁ జతురంగ మాడుటకై నియోగింపఁబడియెను. ఇతఁడు నందవరీకనియోగిబ్రాహ్మణుఁడు. మొదట కొప్పోలుగ్రామమునకుఁ గరణముగా నుండి కవీశ్వరదిగ్దంతి యను ప్రతిష్ఠ గలవాఁ డై చదరంగపుటెత్తులు వేయుటయం దసమానప్రజ్ఞాఢ్యుఁడుగ నుండె నఁట. ఈబొడ్డు

చర్ల తిమ్మనకవీంద్రుఁడు తిమ్మరుసుమంత్రిప్రపునఁ గృష్ణ దేవరాయనిప్రేమమున కాస్పదుఁ డయ్యెను. శ్రీకృష్ణదేవరా యనిపక్షమున నెంద ఱాలోచించి యెత్తు వేయుచున్నను నీతఁ డొక్కఁడే యెదురెత్తు వేసి యాట గెల్చుచు వేయార్లపందెము గొనుచుండెడివాఁ డని యీక్రింది పద్యములవలనఁ దేటపడఁ గలదు.

> "క. శతసంఖ్య లొక్కటైనను
> సతతము శ్రీకృష్ణరాయజగతీపతితోఁ
> జతురంగ మాడి గెల్చును
> ధృతిమంతుఁడు బొడ్డుచర్లతిమ్మనబళిరే."

> ఉ. ధీరుఁడు బొడ్డుచర్ల చినతిమ్మనమంత్రి కుమారుఁ డంచితా
> కారుఁడు సత్కళావిదుఁడు కౌశికగోత్రుఁడు పద్మనేత్ర సే
> వారతబుద్ధి నందవరవంశ్యుఁడు సత్కవిలోకనాథుఁ డా
> చారసమగ్రవర్తనుఁడు చారవచస్థితి నొప్పువాఁ డొగిన్."

ఇతనిశక్తిచాతుర్యములకు సంతోషించి కృష్ణదేవరా యఁడు కొప్పోలుగ్రామమునకు కృష్ణరాయపుర మని పేరిడి సర్వాగ్రహారముగా నీతనికి ధారవోసెను. శ్రీకృష్ణదేవరాయఁడు క్రీ. శ. ౧౫౦౯-వ సంవత్సరము మొదలుకొని ౧౫౧౭-వ సంవత్సరమువఱకు విద్యావినోదగోష్ఠియందే కాలము గడ పెను. తిమ్మరుసుమంత్రియు రాజ్యాంగసంస్కరణమునందు మాత్రము తనబుద్ధినంతయుఁ జొనిపి యూరకుండక దాను గూడ విద్యావినోదకార్యములయందు భాగస్వామియై కాలము పుచ్చుచుండెను. తిమ్మరుసుశిక్షణముచేతనే రాజ్యాంగవిషయ

మున నెట్లో అట్లే విద్యావిషయమునఁగూడ కృష్ణదేవరాయఁడు ప్రఖ్యాతిఁ గాంచ గలిగెను. ఈ రెండుసంవత్సరముల కాలములోనే అల్లసాని పెద్దనామాత్యుని కాంధ్రకవితాపితామహుఁడన్న బిరుదము లభించినది. ఇతనికిని నందితిమ్మనామాత్యునకు అగ్రహారములను ఇక్కంటిని ధారపోసెను. శ్రీకృష్ణదేవరాయఁడు మహాసామ్రాజ్యభోగముల ననుభవించుట మాత్రమే గాక సరసకవితావిలాసలాలసుఁడై తిమ్మనాదికవీంద్రులపలుకుఁదేనియలఁ జూఱలఁగొని తానును సంస్కృతాంధ్రములందు సరసకవిత్వము చెప్పఁగల్గినకవిరాజశిఖామణియై కవీంద్రలోకమునఁ గడుఁ బ్రఖ్యాతిఁ గాంచెను. ‘‘మతిరేవ వలయుం వలయోవ మతిః’’ అనునట్లు తిమ్మరుసుమూలమున కృష్ణరాయనికీర్తియు, అతనిమూలమున తిమ్మరుసుకీర్తియు విద్యాధికప్రపంచమునకు విదితమాయెను.

ఎట్టిప్రఖ్యాతిని గాంచినకవి యేతెంచినను రాయలకంటె ముందుగాఁ దిమ్మరుసుచే నాతిథ్యమును బొంది సమస్తవిధముల సమ్మానింపఁబడు చుండిరి. కనుకనే తిమ్మరుసునకు కవీంద్రపక్షపాతి యని పేరు వచ్చెను. ఒకప్పుడేకారణముచేతనో రాయనియాస్థానకవులు భట్టుమూర్తిని నవమానించినఁ గుపితుఁడై తిమ్మరుసును రాయని గూడ తనపట్ల నలక్ష్యము గలవారై యున్నారని తలపోసి మహోగ్రుఁడై యీక్రింది యుత్పలమాలికను జెప్పెనఁట.

ఉ. లొట్టయి నేటిమాట పెనులోభులతో మొగమోట మేలతాఁ
గుట్టక యున్న నృప్తికి ॥ గుమ్మర పుర్వారి యందురే కదా
పట్టపురాజుపట్టి సరిపల్లెసరాసం యీయ కున్న నేఁ
దిట్టక మాన నామతి ॥ తీవ్రమహోగ్రభయంకరంబుగాఁ
దిట్టితినా మహోగ్రహమతి - మకరగ్రహజర్జరీభటా
పట్టపుదట్టఘాలఘణిభర్తృబహూక్త్రపర్జటుస్ఫుటా
ఘట్టనదట్టణాలకఘట్టనిరర్గళరాజభృత్యకీ
చట్టచటార్భటీనయనజర్జరకీలలు రాలఁగా వలెన్
గట్టురకంబువం బొగడఁ జూచితినా రజతాద్ర్యధిత్యకా
పట్టణమధ్యరంగ గతభవ్యవధూవదనానుషంగసం
హట్టశిరస్థగాంగఝరహల్లకజాలసుధాతరంగముల్
మట్టుకొన న్వలెన్ భువనచోద్యముగా భయదంబుగా మఱిన్
జెట్టితినా సభాభవనధీంకృతభీమనృసింహరాడ్ధ్వజా
త్తాట్టమహాట్టహాసచతురాస్యసముద్భవకోటికోటికో
కోట్టణఘోషజాలహృతకుంఠితకంఠగభీరనాదసం
ఘట్టవిజృంభమాణగతి గా వలె దీవనపద్య మిచ్చి చే
పట్టితినా మణీకనకభాజనభూషణభాసురాంబరా
రట్టతురంగగంధగజరాజదమూల్యఘనాతపత్రభూ
పట్టణభర్మహర్మ్యభటపఙ్క్తిచిరాయువనామయంబునై
గట్టిగఁ దోషతో నెలయఁగా వలె నెక్కువరీతిఁ జూపుడీ
యట్టిటు మందమేలముల నందఱనుంబలెఁ జుల్కఁ జూచి యే
పట్టున నైనఁ గేరడము పల్కకుఁడీ పయిపెచ్చు నందులన్
గొట్టుదు దుష్కవిద్విరదకోటులఁ బంచముఖోద్భటాకృతిన్
బెట్టుదు దండముల్ సుకవిబృందముకే నతిభక్తి సారెకున్
గట్టితి ముల్లె లేఁబదియుఁ గాఁగలనూటఁబదాఱు లెయ్యేడన్
రట్టడిభట్టుమూర్తికవి రాయనిమార్గ మెఱుంగఁ జెప్పితిన్

అని యాగ్రహించి చెప్పినంతవఱకు రాయఁ డీబ్రాహ్మణ కవివరుల దురాలోచన మెట్టిదో నే నెఱుంగను. నన్నేల తిట్టెదవని యనర్ఘ్యబహుమానము లొసరించి గాఢాలింగనంబు గావించె నఁట. అందులకు సంతసించుచు భట్టుమూర్తి యీక్రిందిపద్యముచే రాయని స్తుతించెనఁట.

ఉ. అబ్జముఖీమనోబ్జ నరసాధిపనందన కృష్ణ నీయశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీపరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీవితీర్ణిమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్రమిద్ధరన్

అప్పుడు భట్టుమూర్తి తిమ్మరుసుం జూచి నీప్రోత్సాహంబున కవు లీవిషమాలోచనను గావించిరి. నేను నీకు కైవారం బొసఁగ కుండుట కారణంబుగా వీరిం బురస్కరించుకొని నన్నవమానింపఁ జూచితి; కానీ,

శా. గుత్తిం బుల్లెలుకట్టి చంద్రగిరిలోఁ గూ డెత్తి పెన్గొండలోఁ
హత్తిన్ సత్రమునందు వేఁడి బందుర్గాధీశుతాంబూలపుం
దిత్తుం బ్రోసి పదస్థులైనఘనులన్ దీవించ —

అనునంతవఱకుఁ జెప్పనప్పటికిఁ దిమ్మరుసు దుష్కీర్తికి వెఱచి కృష్ణరాయఁడు పట్టాభిషేకసమయంబున నొసంగినయమూల్యం బగుగారుత్మతరత్నహారంబు కవికంఠంబు నలంకరించినఁ బ్రహృష్టుఁడై..................దీవించెదన్

మత్తారాతియయాతినాగమసుతున్ మంత్రీశ్వరుం దిమ్మరున్

అనిపూరించి,

"కం. అయ్యా యనిపించికొంటివి

నెయ్యంబునఁ గృష్ణరాయనృపపుంగవుచే

నయ్యా నీసరి యేరీ

తియ్యనివిలుకాఁడవయ్య ! తిమ్మరుసయ్యా ! "

అని శ్లాఘించె నఁట ! ఆంధ్రకవులంగూర్చినకథ లిట్టి వనేకములు గలవు. ఆకథ లన్నియు నాయాకవులచరిత్రమునఁ గాని కృష్ణరాయనిచరిత్రమునఁ గాని యుదాహరింపఁ దగినవై యున్నవిగావున నిట వివరింప లేదు.

# సప్తమప్రకరణము.

---

## దక్షిణదిగ్విజయము.

శ్రీవీరనరసింహదేవరాయల పరిపాలనకాలముననే శ్రీకృష్ణదేవరాయఁడు కర్ణాటదేశమునంతయు జయించి శ్రీరంగపట్టణమున చిక్కదేవరాయని ప్రతినిధిపాలకునిగా నియమించి జయధ్వజ మెత్తించి విజయోత్సాహముతో రాజధానిఁ బ్రవేశించె నని మున్నె తెలిపి యున్నాఁడను. ఇతఁడు పట్టాభిషిక్తుఁడైన వెనుక తిమ్మరుసుమంత్రి ద్రావిడదేశమును జయించి కప్పములు సరిగా నిర్ణయించి రాఁబట్టి తెచ్చుటకై విజయప్పనాయకుని, కృష్ణప్పనాయకుని వేంకటప్పనాయకుని మువ్వురను నియమించెను. విజయప్పనాయకుఁడు గొప్పసైన్యముతో బయలువెడలి వేలూరుప్రాంతదేశమును వశపఱచుకొని వేలూరు ముఖ్యస్థానముగ నేర్పఱచుకొని రాయనికై కప్పములు గైకొనుచుండెను. అట్లు చిత్తూరు, తొండమండలము, తంజావూరు, తిరుచనాపల్లి, మధుర, తిరునగరు, కొడగు, వాశనాశము మొదలగు దేశములరాజులెల్లరును రాయనికి వశ్యులై కప్పములను జెల్లించిరి. ఈదక్షిణదేశమునంతయును మూఁడు ఖండములనుగా విభజించి మూవురుప్రతినిధిపాలకులక్రింద నుంచెను. జింజీలో నివసించెడికృష్ణప్పనాయకుఁడు నెల్లూరు మొదలు కొల్లడమునదివఱకును గలదేశమునకు, విజయరాఘవనాయకుఁడు కావేరినది ప్రవహించు ఫలవంతమైనదేశము

నకు; వేంకటప్పనాయకుఁడు కొడగు, మళయాళ దేశములకు నధికారులుగా, నియమింపఁబడిరి. ఇట్లు పూర్వకర్ణాటద్రవిడ దేశమునంతయును వశము చేసికొని మూఁడుకోట్లద్రవ్యమును భాండారమునకుఁ జేర్పించెను. దక్షిణదేశమున రాయనిఁ దిరస్కరించి కప్పములు చెల్లింపక యుద్ధములు చేయువారు లేకుండఁ జేసి తిమ్మరుసు తనప్రజ్ఞావిశేషమును లోకమునకు వెల్లడించెను.

### తిమ్మరుసు పూర్వదిగ్విజయయాత్రకుఁ బ్రోత్సహించుట.

ఒకనాఁడు రహస్యముగా రాయనికడకుఁ బోయి అమ్మరుసుమంత్రి యిట్లు ప్రబోధించెను.

దేవా! నీయభీష్టమును దీర్చుకొనుకాల మాసన్నమైనది. నీవు రెండుసంవత్సరములక్రిందట శాత్రవులను జయించి శత్రుసమూహముల నాక్రమింప వలయు నన్న పెద్దకోరిక గలదని నాతో నుడివినప్పుడు సైన్యముల నాయత్తపఱచుటకు రెండుసంవత్సరములకాలము గడువడిగి యున్నాను. నేఁటితో గడువుకాలము ముగిసిపోయినది. ఇప్పుడు యుద్ధముచేయుటకు పదిలక్షలసైన్యమును సిద్ధము గావించితిని. అవసరమైనయెడల మఱియొకపదిలక్షలసైన్యమును సమకూర్చుటకుం దగునేర్పాటులను గావించితిని. కవచధారణము గలిగిన ముప్పదివేల [illegible] బలమును చేకూర్చితిని. ప్రశస్తమైనగజబలమును గలదు. కావలసినంతద్రవ్యమును భాండారమునం జేర్పించితిని. దుర్గము లన్నియు సమస్తవస్తుసామగ్రులతోడ నింపి సమృద్ధ

మూలుగునట్లు గావించితిని. సేనాపతు లెల్లరును భక్తివిశ్వాసపరు లైనశూరశిఖామణు లై యున్నారు. మన కేవిధమునను గొ అంత గానరాదు. శత్రువు లెంతటిబలాఢ్యు లైనను వారిని నేఁ డవలీల జయింపఁ గలవు. పరరాష్ట్రాధిపతులు నిన్నుఁ గన్నెత్తి చూడనోడుదురు. శత్రురాజులు నాయెడల నీకు నీసు గల్పించి తగవులు పెట్టి సామ్రాజ్యమును జెఱుపఁ బ్రయత్నించిరి గాని వారిదుష్ప్రయత్నము లన్నియు వ్యర్థము లై పోయినవి. నేను నీయెడ భక్తివిశ్వాసపరుఁడ నై వ్యవహరించి నదియు లేనిదియు నీ వే యెఱుంగుదువు. ఎవ్వరిని సంపూర్ణముగా జయింపఁజాలక పోతి మని నీపూర్వు లైనసాళ్వనరసింహనాయకాదులు భావించి గతాసువు లై రో అట్టి యశ్వపతులను గజపతులను నీవు జయించి యీయుభయకర్ణాటహైందవసామ్రాజ్యమునకు వన్నెయు వాసియుఁ గల్పించి లోకంబున శాశ్వతకీర్తిని సముపార్జింపుము.

అని తిమ్మరుసు ప్రోత్సహించి పలుకఁ బలుకునంతఁ బ్రీతచేతస్కుఁ డై రాయఁడు అప్పా! ఎదిరిబలము నాబలము నెఱుంగక నేఁ డట్లు శత్రువులను జయింప సమకట్టి నీతోఁ బ్రశంసించితిని. నాఁడు నీవు నాసాహసమును వారించి పరిగణింపక నాచిత్తము వచ్చినట్లు వ్యవహరింప విడిచినయెడల నిప్పటికి నాపాట్లెట్లుండునో గదా! ఈ రెండుసంవత్సరములలో నీవు చేసినకార్యములు శ్లాఘాపాత్రములు లైనవిగా నున్నవి. నీకు నే నెంతయుఁ గృతజ్ఞుఁడ నై యున్నవాఁడను. అసూయా

పిశాచగ్రస్తులై స్వార్థపరాయణులై యూరక నీయెడ ద్రో
హారోపణ చేయువారిమాటలను నమ్మి నిన్నపనిందలపాలు
చేసి నీతోఁ దగవులాడి కార్యభంగమును గలుగఁ జేసికొను
నంతటియవివేకిని గా నని నీవెఱుఁగవా? ఈ సామ్రాజ్యము నా
కిచ్చినది నీవ కాదా? నాకిట్టి కీర్తిని గల్పించుచున్నది నీవ
కాదా వేయునేల? పితృవాత్సల్యముతో నాప్రాణములను
బల్మిమిఁ గాపాడినదియు నిప్పటికిని గాపాడుచున్నదియు నీవ
గాదా? అట్టి నీకు దుష్టులమాటలు నమ్మి కృతఘ్నుఁడనై
యెగ్గొనరింతునా! ఎంతమాట! అట్లు స్వప్నమందైనఁ
దలంపకుము. మహాత్మా! నీయంతటివాఁడు నాకు ప్రాపై
సమ స్వరాజ్యపర్వాహకర్తవై యుండ నేను దిగ్విజయముఁ
గావించి లోకమునఁ బ్రశంసాపాత్రుండ నగుట యెంతయబ్బు
రమా! నేటినీవాక్కులానంద దాయకములై ప్రోత్సాహక
రములై యొప్పుచున్నవి. అయిన నాకొక్కసందేహము
కలుగుచున్నది. ముందు తురుష్కులను జయించి పూర్వదిగ్వి
జయయాత్రకు బయలువెడలుట యుత్తమపద్ధతియా లేక పూ
ర్వదిగ్విజయయాత్రను ముగించి తురుష్కులపై దాడి
వెడలుట యుత్తమపద్ధతియో తెలిసికొనఁజాలక నామనస్సు
తల్లడపాటు నొందుచున్నది" అని హెచ్చరించెను. అందు
లకు మంత్రిపుంగవుం డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

దేవా! నేఁడు విజాపురసుల్తానుకంటె గజపతి బలవం
తుఁడుగ నున్నాఁడు. గజపతిదేశము గొప్పది. అందలి సంపద
సామాన్యమైనది కాదు. మఱియు నతఁడు మతాంతరుఁడు

గాఁడు. అతనిసైన్యమునందు అనేకులు తెలుఁగువారై యున్నారు. అందువలన దేశములోని ప్రజలు తురుష్క-ప్రభువుకంటె హైందవప్రభువునే యెక్కువగాఁ బ్రేమింతురు. కనుక గజపతిరాజునకే మన కెక్కువచెఱుపు కలుగ వచ్చును. వానిని మన తెలుఁగు దేశమునుండి తఱిమివేయుట ప్రథమకర్తవ్యము. మఱియు బహామనీరాజ్యమైదుభాగములుగా భిన్నమై యైకమత్యము లేని సుల్తానులచేఁ బాలింపఁబడుచున్నది. వారలను విడిగా జయించుట బహుసులభసాధ్యము. ఒకవేళ మనము ముందుగా విజాపురసుల్తానుపై దండయాత్ర వెడలుదమను కొందము. ఏవురు సుల్తానులేకమై మనపైఁ గదలఁగవచ్చును. అప్పుడు వారలను జయించుట కష్టసాధ్యము గా వచ్చును. ఆసమయమును గనిపెట్టి శ్రీవీరప్రతాపరుద్రగజపతి మనరాజధానిపై దండెత్తి వచ్చెనేని మనసామ్రాజ్యమునకు ముప్పు వాటిల్లుట నిశ్చయము. మనము ముందుగా ప్రతాపరుద్రగజపతిని జయింతుమేని మనవారు తురుష్కులను జయించుట సులభసాధ్యమగును. మనము పూర్వదిగ్విజయయాత్రకు బయలువెడలినప్పుడు విజాపురసుల్తానుతో నిదివఱకె యొడంబడిక చేసికొని యున్నారము గనుక మనమీఁద యూరక దండయాత్రకుఁ బ్రయత్నింపఁడు. ఒకవేళ దుర్బుద్ధిపుట్టి తనసైన్యముతో మనరాజధానిపైఁ బడి యాక్రమింపఁ జూచునేని వానినవలీల జయించునట్టిసైన్యమును విశ్వాసపాత్రుఁడైనయొక సేనానికిక్రింద నుంచి రక్షణము గావింప వచ్చును.

ఈమహానగరసంరక్షణభారము నెవ్వనిపైఁ బెట్టుదునా యని యోచించు చున్నాను. దీనిభారమును వహించువాఁడు విశ్వాసపాత్రుఁడైనవాఁడుగా నుండుటమాత్రముగాక సమర్థుఁడుగాఁ గూడ నుండవలయును. ఏసేనానిచిత్త మెట్టిదో పరీక్షించి తెలిసికొనుట కష్టసాధ్యము. ఎవ్వనిని గానుపింప కున్న నేనే యీమహాకార్యమును నిర్వహింపఁ బూనుకొనఁ దలంచి యున్నాఁడను.

అని తిమ్మరుసు ప్రత్యుత్తరమీయ రాయఁ డిట్లనియెను. అప్పా! నీవు చెప్పినమార్గము బాగుగా నున్నది. అవశ్యము పూర్వదిగ్విజయయాత్రలో నీతోడ్పాటు గావలసి యుండును. నగరరక్షణార్థము నిన్ను విడిచి పెట్టి నేనొక్కఁడ నీ మహాకార్యమును సాధింపఁ జాలను. ఇదియంతయు నెమ్మది విచారించుటయు శ్రేయస్కరముగాఁ గనుపట్టును. అయినను దీని నిర్వహించుసమర్థులు మనసామ్రాజ్యమున ననేకులు గలరు. సమర్థులలో సమర్థుఁడును దండనాథాగ్రేసరుఁడును [illegible] గోవిందామాత్యుఁడు గన్పట్టు చుండఁగా నొరులకై వెదుక నేల? అతఁడు విశ్వాసపాత్రుఁడైనయోగ్యుఁడు. అతఁ డెట్టి ద్రోహచింతయును లేని బ్రాహ్మణుఁడు. అతఁడు తనపొందిలో ప్రాణము లున్నంతదనుక పరరాజులను విద్యానగరభూమి యందుఁ బాదము పెట్టనీయఁడు. కావున విద్యానగరమునకు రక్షకపాలునిగా గోవిందరాజ ప్రధానదండనాథాగ్రేసరుని నియమించుట శ్రేయస్కర మని నాయభిప్రాయము. అతఁడు నీ

తమ్ముఁడగుటం జేసి నే నేమనుకొందునో యన్న సంకోచము చేతఁ బ్రసింసింపక యున్నాఁడవు గాని నీవుమాత్రము మెఱుంగవా? అట్టిసంశయముఁ బెట్టుకొనకుము. తురుష్కులనుండి యేవిధమైనయుపద్రవమును నగరమునకుఁ గలుగకుండ సంరక్షించుభారమును మీతమ్ముఁడు గోవిందామాత్యుని పైఁ బెట్టుము. అతఁడు సామర్థ్యమున నీకుఁ దీసిపోవు వాఁడు కాఁడు. మఱియును నీవు సకలసైన్యాధ్యక్షుఁడవై పూర్వ దిగ్విజయయాత్రను నడుపుము. నేను నిన్ను వెంబడించి వచ్చెదను.

అని పలుకఁగా నతనిబుద్ధికౌశల్యమును మెచ్చుకొని తనయెడఁ జూపువిశ్వాసమునకు సంతసించి చిఱునవ్వు నవ్వుచు మరల యిట్లనియెను. మహాప్రభూ! మేము బ్రాహ్మణులము. క్షత్రియులు నిర్వహింపవలసినమహాకారములు మావలన నగునా? ఏల యిట్లు పలుకుచున్నావు. సర్వసైన్యాధిపత్యము నీవంటిసాహసవిక్రమార్కులు వహింప వలసినవారు కాని నావంటివృద్ధబ్రాహ్మణుఁడు గాఁడు. అనిపలికెను. అందులకు శ్రీకృష్ణదేవరాయఁ డిట్లు బదులు వక్కాణించెను. అప్పా! ఇవెందుకు వచ్చినమాటలు? మీరు బ్రాహ్మణులగుదురు గాక! మున్ను కౌరవులకుఁ బాండవులకు విద్యాగురువైన ద్రోణాచార్యుఁడు కౌరవులపక్షమున నుండి సర్వసైన్యాధిపత్యమును వహించి పాండవాద్యనేకక్షత్రియవీరు లెందఱితోఁ బోరాడి యుండ లేదు? కృపాచార్యుఁడు నశ్వత్థామ మొదలగుసేనా

పతు లెవ్వరు? బ్రాహ్మణులు కారా! పరశురాముఁ డెవ్వఁడు? బ్రాహ్మణుఁడు కాఁడా! పూర్వకాలమున నెందఱో బ్రాహ్మణు లస్త్రవిద్యాభ్యాసముఁ జేసి లోకమున వన్నె కెక్కి యుండ లేదా? మీ నియోగిబ్రాహ్మణులు లౌకికతంత్రమునందు మాత్రమే గాక యుద్ధతంత్రములందును నాఁటితేఁటినవా రను టకు పూర్వకథలె మనకు సాక్ష్యము లీయఁగలవు. ఇంతయేల! అప్పా! మీతమ్ముఁడు దండనాథులలో శ్రేష్ఠుఁడు. ఎన్నియుద్ధ ములలో విజయుఁడై యుండ లేదు? మీరు బ్రాహ్మణులై నను క్షత్రియులను మించిన శౌర్యము గలవారు. అన్నిటికం టెను ముఖ్యముగా మీరు బ్రాహ్మణు లగుటం జేసి మాకు విశ్వాసపాత్రులైరి. మీ రెప్పుడును సామ్రాజ్యముయొక్క క్షేమము నభిలషించు చుందురు. అదియ మాకుఁ గావలసిన ప్రధానవిషయము. కావున ప్రార్థనమును మన్నించి నేను చెప్పినట్లు చేయుము. మీతమ్ముని రాజధానీనగరాధ్యక్షునిగా నియమింపుము. నిన్ను సర్వసేనాధిపత్యంబునకుఁ బట్టంబు గట్టె దను. ఇందులకు మాఱుచెప్పకుము. అని ప్రార్థించెను.

అంత సమ్మంత్రిపుంగవుఁడు రాయనిప్రార్థనమును మన్నించి తాను సర్వసేనాధిపత్యమును వహించుటకు నంగీ కారము నిచ్చి యాతనిచే దండయాత్ర కనుజ్ఞాతుఁ డయ్యెను.

### నగరాధ్యక్షునినిర్ణయించుట.

అట్లు రాయనిచే సనుజ్ఞాతుఁడై తిమ్మరుసుమంత్రి లక్షసైన్యమును నగరసంరక్షణార్థము గోవిందామాత్యదండనా

ఘనివశేషము గావించి యాతనికి నగరాధ్యక్షపదవి నొసంగి యిట్లనియెను. తమ్ముఁడా! మేము పూర్వదిగ్విజయయాత్రకు వెడలఁబోవుచున్నారము. నీవు సేనాధిపతులలో శ్రేష్ఠుఁడ వనియు, సమర్థుఁడ వనియు రాయఁడు నిన్ను శ్లాఘించి నగరాధ్యక్షత్వమును వహించుటకు నీవ యర్హుండ వని నొక్కి వక్కాణించినందున నతనిచే ననుజ్ఞాతుఁడ నై నీపైన నీగొప్ప భారమును నిలిపినాఁడను. నీవు నగరసంరక్షణభారముమాత్రమే గాక తురుష్కులు మనసరిహద్దులను దాటి రాకుండఁ జూచు భారము గూడ నీపైనఁ బెట్టుచున్నారము. మన మెంతటినో యలక్ష్యము చేసి కృష్ణదేవరాయనిఁ బట్టాభిషిక్తునిఁ గావించితిమి. అతఁడును అతనిసామ్రాజ్యమును వర్ధిల్లుమార్గమును జూచుట మనకు విధ్యుక్తధర్మమై యున్నది. అతఁడు మనల నమ్మి సామ్రాజ్యము మనచేతఁ బెట్టి యున్నవాఁడు. కనుక నానిశత్రువులవలన నేవిధమైనయపకృతియుఁ గలుగకుండుటకై యెందఱో సమర్థులైన సేనాను లున్నను నమ్మికలేక నిన్నే యీపదవియందుంచుటకుఁ గారణమైనది. తమ్ముఁడా! ఏమఱి యుండెదవేని నీకును నాకును ప్రాణోపద్రవము గలుగుటయె గాక సామ్రాజ్యమునకును వినాశము గలుగ వచ్చును. కావున నగరమును వేయికన్నులతో వీక్షింపుచు భద్రముగాఁ గాపాడుచుఁ గీర్తిగనుము. అని యాతని కనేకవిధము లైన రాజనీతివిధానంబులనుపదేశించి రాయని దండయాత్ర నగరంబునఁ బ్రకటించుమని యాజ్ఞాపించి పంపించెను.

## సేనాధిపత్యపట్టబంధనము.

అట్లనుజ్ఞాతుఁడై నగరపాలకుఁడు దండయాత్రను నగరంబునఁ జాటింపించి రణభేరి మ్రోగింప నుత్తరు విచ్చెను. సేనాపతు లెల్లరును దమతమసైన్యములతో సంసిద్ధులై యుండిరి. ఒకనాఁటిశుభముహూర్తమున వజ్రసింహాసనారూఢుఁడై శ్రీకృష్ణదేవరాయఁడు పురోహితులు, మంత్రులు, సామంతులు, సేనానిపతులు, రాజబంధువులు, అధికారివర్గము, తక్కుంగల పరివారజనంబులు తన్నుఁ గొలువఁ గొలువుండి కనకకలశంబులఁ బావనజలంబులఁ దెప్పించి మంగళోపకరణశోభితంబు గావించి బ్రాహ్మణజనంబులు పుణ్యాహనాదంబులును, పరమాశీర్వాదంబులును, వందిజనస్తుతిపాఠంబులును, మాగధగీతంబులును జెలంగఁ దిమ్మరుసుమంత్రివరేణ్యునకు సేనాధిపత్యాభిషేకపట్టబంధం బొనర్చెను. అత్తరి నాయకవర్గంబు నిజశంఖంబులఁ బూరించిన నఖిలసైన్యంబులందును భేరీమృదంగపణవాదితూర్యనినాదంబులు నిగిడి నింగి ముట్టెను. ఇట్లు తన్నుఁ బెద్దగా నెన్ని సర్వసేనాధిపత్య మొసంగినందులకుఁ సంతుష్టహృదయుఁడై తిమ్మరుసు రాయుని కాయురారోగ్యైశ్వర్యాభివృద్ధియు, సామ్రాజ్యాభివృద్ధియుఁ గలుగునటుల దీవించి సేనాపతుల వీక్షించి యిట్లు హెచ్చరించెను.

దండనాథాగ్రణులారా! విజాపురసుల్తాను ఆదిల్‌షాహా రాచూరు, ముదిగల్లుదుర్గముల నాక్రమించుకొని రాజధానీనగరసమీపస్థుఁడై ప్రక్కలో బల్లెమై యూరుచుండియున్న

వాఁడు. గోల్కొండసుల్తాను కూలీకుతుబ్షాహ రాజుకొండ, దేవరకొండ, పానుగల్లు మొదలగు దుర్గముల నాక్రమించుకొని మనకు సామంతు లై యున్న పద్మనాయకుల వెడలఁగొట్టి యున్నవాఁడు. తూర్పుప్రక్కను ప్రతాపరుద్రగజపతి విజృంభించి యుదయగిరిప్రాంతమువఱకుఁ గల తెలుఁగుదేశము నాక్రమించుకొని యున్నవాఁడు. ప్రస్తుతము మన మిప్పుడు ప్రతాపరుద్రగజపతి పైదండయాత్ర వెడలి కృష్ణానదిదిగువభాగమున నాతని ప్రభుత్వము లే కుండఁ జేసి తఱిమి వేయ వలయును. కృష్ణానదీ సేతుమధ్యస్థ మైన దేశమునంతకు నేకచ్ఛత్రాధిపతినిగఁ జేసి యేలింపఁ బ్రతిజ్ఞ చేసితిని. ఇందువలన దక్షిణహిందూస్థానమున మనపూర్వులచే స్థాపింపఁబడిన హైందవసామ్రాజ్యము దృఢ మై శాశ్వతముగా హైందవధర్మము చెక్కుచెదర కుండ స్థాపిత మై దేశమున నాటుకొని యుండునటులు చేయును. ఇది నాయొక్కనివలన నగుకార్యము కాదు. మీసాహాయ్యమునఁ గాని మే మీమహోద్యమమును నిర్వహింపఁ జాలము. మీవంటిమహాయోధులు హైందవసామ్రాజ్య మలంకరించి యుండ హైందవధర్మము వర్ధిలు ననుటకు సందియ మేమియును లేదు. మీసాహాయ్యంబునఁ బూర్వదిగ్విజయయాత్ర జయప్రదముగా నిర్వహింపఁబడు నన్న విశ్వాసముతో మన యేలిక యున్నవాఁడు. మన యేలిక యభీష్టమును దీర్చుట మన కెల్లరకు గర్తవ్య మని పలుమాఱు నొక్కి వక్కాణింప నగత్యము లేదు. భగవంతుఁడు మన యుద్యమమును నకుఁ దోడ్పడి విజయమును బ్రసాదించును గాక.'

ఇట్లు హెచ్చరించి సైన్యముఁ నేఁడు భాగములుగా విభజించి యొక్కొక్క భాగమునకుఁ ముప్పదివేలకాల్బలమునుఁ నాలుగువేలగుఱ్ఱపుదళమును, ఇన్నూరేనుఁగులు నుండునట్లు నియమించెను. ఈయేఁడు భాగములకును కందనోలు పురాధీశ్వరుం డైనఆర్వీటిశ్రీరంగరాజు, నంద్యాలపురాధీశ్వరుండైన ఆర్వీటినారపరాజు, ఆనవీడుదుర్గాధ్యక్షుఁ డైనఇమ్మరాజు, రాయసము తిమ్మరుసుమంత్రికుమారు డైనకొండమరాజు (కొండమరుసు), గండికోటదుర్గాధ్యక్షుఁ డైనపెమ్మసాని రామలింగన్ననాయఁడు, వెలుగోటి దుర్గాధ్యక్షుఁ డైనరేచెర్ల కుమారతిమ్మానాయఁడు, రూపనారాయణబిరుదాంచితుఁడగు గంగాధరరెడ్డి (గంగారెడ్డియు) ననునేడ్వురకు నాధిపత్య మొసంగి ముఖ్యసేనానాయకులనుగఁ జేసెను. వీరలలో శ్రీరంగరాజు, నారపరాజు, ఇమ్మరాజును, నరపతివంశీయు లైనరాజులు; రాయసము కొండమరుసు ఉదయగిరికన్నడినియోగిశాఖాబ్రాహ్మణుఁడు పెమ్మసానిరామలింగన్న కమ్మనాయకుఁడు; వెలుగోటికుమారతిమ్మానాయఁడు పద్మనాయకుఁడు; గంగాధరరెడ్డి పంటకులాన్వయుఁ డైనరెడ్డినాయకుఁడు. వీరికి లోఁబడినసేనానులింకను బ్రాహ్మణులలోను బ్రాహ్మణేతరులలోను పెక్కండ్రు గలరు. ఇట్లు తిమ్మరుసు చేసిన యేర్పాటులకు శ్రీకృష్ణదేవరాయఁడు హర్షించి నాటికి దర్బారు ముగించి నిజాంతఃపురమునకు వెడలిపోయెను.

## అష్టమప్రకరణము.

మఱునాఁడు తిమ్మరుసు ప్రయాణభేరి మ్రోగించెను. సేనాధిపతు లందఱును తమతమసైన్యములతోఁ బ్రయాణోన్ముఖులై యుండిరి. ఎచ్చటఁ జూచినను భేరీమృదంగపణవాది తూర్యనినాదంబులు చెలఁగుచు నింగి నిగిడెను. సైన్యాధిపతుల శంఖారావంబులును, ఏనుగులఘంటానాదంబులును బెల్లొసంగెను. వీరసైనికులఘంటలమ్రోఁత బెట్టిదం బయ్యెను. వందిమాగధుల కైవారంబులు మిన్నుముట్టెను. రాజపురోహితులైన బ్రాహ్మణులు స్వస్తివాచకములు పఠించుచుండిరి. ఆ మహానగరంబున నెక్కడ విన్నను నుత్సాహవాక్యము లేగాని యన్యంబులు వినరావు. తల్లులు తమపుత్త్రులను, అక్కసెల్లెండ్రుతమ సోదరులను, భార్యలు తమభర్తలను తక్కుంగల స్త్రీలు తమబంధుసైనికులను రణోన్ముఖులను గావించి ప్రోత్సహించి వీరప్రవచనంబు లాడుచుండిరి.

### దండయాత్ర వెడలుట.

అట్లత్యుత్సాహముతో సైనికు లెల్లరు సమరోన్ముఖులై యుండ సకలసైన్యాధ్యక్షుఁ డగుతిమ్మరుసుమంత్రిశ్రేష్ఠునిచే ననుజ్ఞాతులై ముఖ్యసేనాధిపతులు తమతమసైన్యములతోడను, పరివారజనంబులతోడను, వస్తుసామగ్రితోడను ప్రాగ్ది

శాముఖంబున నొకరిని వెంబడించి యొకరు నడువ నారంభించిరి. అవసర మెప్పుడు తెప్పించుటకై మూడులక్షల సైన్యమును నగరమునను గోవిందామాత్యునియాధిపత్యముక్రిందను మూలబలముగా నుంచెను. అట్లుంచి, విస్ఫురితభూషణభూషితంబైన గంధసింధురంబు నెక్కి వెలిగొడుగులు మెఱయ నలంకారంబులఁ దఱచైన వజ్రంబుల నుద్దామంబు లగుదీధితిస్తోమంబులును జామరంబులును గలయం బొలయ బహురత్నప్రభాభాసితంబైన గరుడధ్వజంబుఁ గ్రాలుచుండఁ గృష్ణదేవరాయధరణీవల్లభుండు తనరాణులతోఁ జనుదేర సకలచమూపతిత్వపదభాసితుఁడైన తిమ్మదండనాథాగ్రణి సమస్త సైన్యములను నడిపించుకొనుచు దండయాత్ర బయలువెడలెను. అల్లసాని పెద్దనామాత్యుఁడు, నంది తిమ్మనామాత్యుఁడు మొదలగుకవివర్యులును, రంగనాథదీక్షితులు, శివాదీక్షితులు, మొదలగురాజపురోహితులును, వైష్ణవస్వాము లగుతాతాచార్యాదిగురుజనంబులును, మఱియు ననేకబ్రాహ్మణవిద్వద్బృందమును, వారి ననుగమించిరి. ఒకమహానగరము శుభోత్సవమునకై తరలిపోవుచుండునట్లుండెను.

## ఉదయగిరి ముట్టడి.

ఇట్లు క్రీస్తుశకము ౧౫౧౩-వ సంవత్సరములోఁ బూర్వదిగ్విజయమునకై దండయాత్ర వెడలి రాయనిసైన్యంబు

వచ్చుచుండఁ జారులవలన నంతవృత్తాంతమును ప్రతాపరుద్ర గజపతి పిన్నతండ్రి తిరుమలకాంతరాయఁడు విని గజపతి కా వార్తను బంపి తా నుదయగిరిదుర్గమును బలపఱచుకొని పది వేలకాల్బలమును, నాలుగువందలగుఱ్ఱములును గల సైన్యమును దుర్గములోనికిఁ జేర్చుకొని దుర్గమును సంరక్షించు చుండెను. తినుబండార మున్నంతవఱకు నీస్వల్పసైన్య మెంతికాల మైనను, ఎంతసైన్యము ముట్టడించినను నిలిచి పోరాడఁ గలసామర్థ్యము గలిగి యుండెను. ఒకచిన్నత్రోవఁ దక్క దుర్గమునకుఁ బోవ వే ఱొకదారి లేక యుండెను. ఇట్టి యభేద్య మైనదుర్గమును శ్రీకృష్ణదేవరాయఁడు ముట్టడించెను. దుర్గములోనివారి కాహార పదార్థము లంద కుండఁ జేసిన దుర్గమును వశపఱతు రని తిమ్మరుసును రాయలును నిశ్చయించి కోటను ముట్టడించి విడిసి యుండిరి. ఇంతలో గజపతి లక్షసైన్యమును దుర్గసంరక్షణార్థము పంపించెను గాని, అప్పటికే శత్రుసైన్యముచే ముట్టడింపఁబడియుండుటచేత నాసైన్యము వచ్చినప్రయోజనము లేక పోయెను. తిమ్మరుసుదండనాథాగ్రణి గజపతిసైన్యము వచ్చుచున్నవార్త విని ఉదయగిరిముట్టడి కై రాయసము కొండమరుసయ్యను వానిసైన్యములను నిలిపి కృష్ణరాయని నాదళవాయికిఁ దోడ్పాటుగా నుండి దుర్గమును వశపఱచుకొన వలసిన దని చెప్పి తక్కినతనసైన్యము నంతయుఁ దరలించుకొని శత్రుసైన్యమున కెదురుగాఁ బోయి మార్కొని ఘోరసంగ్రామ మొనరించు చుండెను. రాయసము కొండమరుసయ్య రాయుని

తోఁ గలిసి యత్యుత్సాహముతోఁ గోటను బదునెనిమిదిమాస
ములు ముట్టడించి విడిసి యున్నను స్వాధీనము గానందునఁ బోరు
చుండెను. బహువిధముల నష్టపడి తుదకుఁ గొండలను బగులఁ
గొట్టించి విశాలములైన బాటల నేర్పఱచుకొని దుర్గమును సమీ
పించి యాఁకలిబాధచేఁ దపించుచు గుహలలోనుండి సింహముల
వలె వెలువడి పోరాడుశత్రుభటుల నెదుర్కొని వారల సంహ
రించి శ్రీకృష్ణదేవరాయఁడు దుర్గమును వశపఱచుకొని
తద్దుర్గాధ్యక్షుఁడైన తిరుమలకాంతరాయనిఁ జెఱఁగొనియెను.
రాయని విజయమునకుఁ దిమ్మరుసు సంతోషించి ఉదయగిరి
రాజ్యమునకుఁ గొండమరుసయ్యదండనాథుని నేకధురంధర
ధౌరేయునిగా (గవర్నరు) నియమించెను. అతఁడు దేశమును
స్వాధీనపఱచుకొని న్యాయపరిపాలనమును నెలకొల్పి చక్కని
కట్టుబాటులను గావించి విజయనగరమున నున్న మూలబలము
లోని కొంతసైన్యమును తిమ్మరుసుమంత్రిని గొని రప్పించి
యుదయగిరిరాజ్యరక్షణమునకై నిలిపి తానును, రాయలును
తిమ్మరుసును గలిసికొనఁ బోయిరి. ఉదయగిరి మొదలుకొని నర
పతిసైన్యములకును గజపతిసైన్యములకును రెండుసంవత్సర
ములకాలము ముమ్మరమైనయుద్ధము జరుగుచుండెను. జయ
ము లభించినకొలఁది తిమ్మరుసుసైన్యములు ముందునకు జరుగు
చుండ గజపతిసైన్యములు వెనుకకుఁ గ్రమముగాఁ బోవు
చుండెను.

ఉదయగిరిదుర్గము, అద్దంకిదుర్గము, వినుకొండదుర్గము, బెల్లముకొండదుర్గము, నాగార్జునకొండదుర్గము, తంగేడు దుర్గము, కేతవరదుర్గము, కొండవీటిదుర్గము మొదలుగునవి గజపతిరాజ్యము లోనివి. ఇవి యన్నియును, కృష్ణానదికి దక్షిణభాగమున నున్నవి. వీని కన్నిటికిని ముఖ్యస్థానము కొండవీడు. ఈకొండవీటిదుర్గమునందు ప్రతాపరుద్రగజపతి కుమారుడు వీరభద్రగజపతి నివసించుచుండెను. ఉదయగిరిదుర్గమును కృష్ణదేవరాయుడు ముట్టడించె నని విని వీరభద్రగజపతి కుమారహంవీరమహాపాత్రునికుమారుడు వీరభద్రపాత్రుడు, రాచూరి మల్లఖానుడు, ఉద్దండఖానుడు, పూసపాటి రాచిరాజు, శ్రీనాథరాజు, లక్ష్మీపతిరాజు, పన్యాములకసవాపాత్రుడు, పశ్చిమబాలచంద్రమహాపాత్రుడు మొదలుగాఁ గలనాయకు లనేకులను జేర్చుకొని కర్ణాటసైన్యముల నెదుర్కొని కొంతకాలము పోరాడియు బహిరంగ ప్రదేశమున నిలువంజాలక పలాయనుండై కొండవీటిదుర్గములోఁ దాఁగొనియెను. తిమ్మరుసు గజపతిసైన్యములను దఱుముకొనుచుఁ బోయి వరుసగా అద్దంకిసీమ, వినుకొండసీమ, బెల్లముకొండసీమ, నాగార్జునకొండసీమ, తంగేడుసీమ, కేతవరముసీమ, కొండవీటిసీమ వశపఱచుకొనియెను. పూసపాటి రాచిరాజు, తక్క తక్కిననాయకు లెల్లరును కొండవీడుదుర్గములోఁ బ్రవేశించిరి. రాచిరాజుమాత్రము కృష్ణ దాటి పోయెను. రాచిరాజు ప్రతాపరుద్రగజపతి యల్లుడు. ఇప్పటి విజయనగర

రాచిరాజు ప్రతాపరుద్రగజపతియల్లుఁడు. ఇప్పటి విజయనగర సంస్థానాధీశ్వరు లీరాచిరాజువంశములోనివా రని చెప్పఁదగును. *

## కొండవీడునుముట్టడించుట.

తిమ్మరుసుమంత్రి క్రీ. శ. ౧౫౧౫-వసంవత్సరముమార్చి నెలలో కొండవీటిదుర్గమును ముట్టడించెను. ప్రతాపరుద్రగజపతి కొండవీటిముట్టడిని విడిపించుట కై వేయిమున్నూఱు గజబలముతోడను, ఇరువదివేల గుఱ్ఱపుదళముతోడను, అయిదు లక్షలకాల్బలముతోడను వచ్చుచున్నాఁ డని తిమ్మరుసు విని

---

* ప్రాసపాటి తిమ్మరాజకృతి మైన 'కృష్ణవిజయ' మను గ్రంథమున నీక్రిందిపద్యములోఁ దెలుపఁబడినది.

సీ॥ వసుభారతాఖ్యాన నవ్యకావ్యమునకు
నాయకుం డయ్యె నేనరవరుండు
కటకేశ్వరునిచేతఁ గని కేతవర మాత్మ
పురముగా నేలె నేభూవిభుండు
నిఃపే భాయహామన్నె నృపగండ పెండేర
మెపుడు దాకాల నేనృపతిమౌళి
యఖిలసద్గుణవతి యక్కమాంబాదేవి
ప్రాణేశుఁ డయ్యె నేపార్థివుండు
ప్రథితగజపతి రాజవీరప్రతాప
రుద్రతనయాధినాయకారూఢ తమ్మి
రాజజనకతఁ గాంచె నేరాజతిలక
మతఁ డలరు తమ్మవిభురాచయప్రభుండు.

౮

తాను గొండవీడును ముట్టడించి స్వాధీనము జేసికొందు నని
యు, ప్రతాపరుద్రగజపతిని కృష్ణరాయం డెదుర్కొని తఱిమి
వేయవలసిన దనియు రాయనికిఁ జెప్పెను. అతఁడు దండుల కంగీ
కరించి తక్కిన సేనానులను గూర్చుకొని కృష్ణానదీప్రాంతమున
గజపతి సైన్యములతోఁ దలంపడి ఘోర మైనయుద్ధము గావిం
చెను. కృష్ణరాయఁడు కృష్ణ దాటి మేడూరుకడను ప్రతాప
రుద్రగజపతిని మార్కొని యుద్ధము చేసి యోడించి తఱి
మెను. ఇక్కడ తిమ్మరుసుమంత్రి రెండుమాసములకుఁ బైగా
ముట్టడించియుండి శత్రుదుర్గమును క్రీ. శ. ౧౫౧౫-దవ సం
వత్సరము జూను నెల ౨౩-తేదిని స్వాధీనపఱచుకొని వీరభద్రగజ
పతి మొదలుగా ప్రాంతసామంతుల నందఱను జెఱఁగొనియెను.
ప్రతాపరుద్రుని హతశేషసైన్య మంతయును జెల్లాచెదరై
పోయెను. తిమ్మరుసుప్రతిజ్ఞ నెఱవేఱెను. కృష్ణకు దక్షిణభాగ
మున గజపతిప్రభుత్వము తుదముట్టెను. కృష్ణరాయఁడు కొండ
పల్లిదుర్గమును మూఁడు నెలలు ముట్టడించి స్వాధీనపఱచుకొని
ప్రతాపరుద్రగజపతిభార్యలలో నొక్కతెను, పలువురు సేనాను
లను జెఱఁగొనియెను. శ్రీకృష్ణదేవరాయఁడు పూర్వదిగ్విజయ
యాత్రలోఁ జెఱగొన్న గజపతిసంబంధికుల నెల్లరను విజయనగ
రమునకుఁ బంపివేసెను. కొండవీటిరాజ్యమును బరిపాలించుట
కై రాయఁడు తిమ్మరుసునే పాలకునిగా నియమించెను. కాని
కృష్ణరాయని వెంబడించి పోవుటకై తిమ్మరుసుమంత్రి తన
మేనల్లుఁ డైననాదిండ్ల అప్పామాత్యునికి కొండవీటిరాజ్యమున
కాధిపత్య మొసంగెను.

## శ్రీకృష్ణదేవరాయని సాహసము.

ఇట్టి విజయమునకు గర్వించి కృష్ణదేవరాయఁడు ప్రతాపరుద్రగజపతికి నివాసపట్టణమై రాజధానీనగరమై యున్న కటకమును బట్టుకొనవలయు నని సంకల్పించెను. తిమ్మరుసు దానిని గ్రహించి రాయని కిట్లు హితవు గఱపెను. ఓ మహారాజేంద్రా! మనము రాజధానిని విడిచి యిప్పటికే బహుదూరము వచ్చి యున్నారము. ఇంతటితోఁ దృప్తి నొందక మనము ముందుకు సాగితిమేని మనబలము క్షీణించుటయును, శత్రుబలము పెరుఁగుటయు సంభవించును. గజపతి బలాఢ్యుఁడైన శత్రువు గాని సామాన్యశత్రువు గాఁడు, అతని జయించుట కష్టసాధ్యము. ఇంతటితో మనము తృప్తి నొంది వెనుకకు మరలుట యుత్తమమార్గ మని తోఁచుచున్నది. అని తిమ్మరుసు రాయని దండయాత్రనుండి మరలింపఁ జూచెను గాని మహాపరాక్రమవంతుఁడైన యా మహాప్రభువు "అప్పా! అడ్డు పెట్టకుము. శత్రువు నవలీల జయింతును. సైన్యము చాలకయున్న విజయనగరమునుండి తెప్పింపుము. దండయాత్ర కటకపురినిఁ బట్టుకొని ప్రతాపరుద్రుని వశపఱచుకొనక యుండ నిలుపుట నాకెంతమాత్రము నిష్టము లేక యున్నది. కావున నీవు సత్వరముగా విజయనగరము సైన్యములకై సమాచార మంపి ముందుకు ప్రయాణము సాగింపు మని పలికెను. అంత తిమ్మరుసు భయమును సంశయమును బొందినవాఁడయ్యును రాయనికిఁ దెలియనీయక యతఁ డెట్లును మానువాఁడు గాఁ

డని గ్రహించి యిష్టము లేకపోయినను సమ్మతింప వలసినవాఁడయ్యెను. అట్లనే కాని మ్మతి పైనిచెప్పిన ప్రకారము కొండవీటిరాజ్యమునకుఁ దన మేనల్లుఁడైన నాదిండ్ల అప్పామాత్యుని ప్రభువునుగాఁ జేసి తాను కృష్ణరాయనితోడ రాజమహేంద్రిపురదుర్గమును ముట్టడింపఁ బోయెను. దారిపొడవునను గజపతిసైన్యములతోడ యుద్ధమును జేయుచునే యుండెను. ఓడించిన కొలఁది గజపతిసైన్యములు నిరుత్సాహము జెందుచు వెనుకకుఁ బోవు చుండుటయు, రాయనిసైన్యము లుత్సాహవంతము లై సాగుచుకొని పోవు చుండుటయు సంభవింపు చుండెను. కొన్ని నెలలకు విజయనగరమునుండి సైన్యములువచ్చి రాయనిసైన్యములఁ గలిసికొనియెను.

## రాజమహేంద్రపురమును గైకొనుట.

ఇట్లు బహులకొలఁదిసైన్యములను నడిపించుకొనుచుఁ గృష్ణదేవరాయఁడును, సైన్యాధ్యక్షుఁడగు తిమ్మరుసుమంత్రియును కృష్ణాగోదావరీమధ్యస్థమైన దేశము నంతయును స్వాధీనపఱచుకొని గోదావరినదిని సమీపించిరి. మొదట గోదావరిని దాటి శత్రువులను బాఱఁద్రోలి రాజమహేంద్రపురము నాక్రమించుకొన్న సేనాని ఆకువీటి యిమ్మరాజు; పింగళి సూరనామాత్యకవిపుంగవునిచే రాఘవపాండవీయ మనుద్వ్యర్థికావ్యకృతిపతి యైన వేంకటాద్రియొక్క తాత యీయిమ్మరాజే. ఈతఁడు రాజమహేంద్రవరమును జయించిన ట్లీక్రిందిపద్యములోఁ దెలిపి యున్నాఁడు.

౧౧౪. రాజమహేంద్రనగాధిపు
కైజైత్రవిచిత్రములఁ బరిభ్రాజితుఁ డై
యోజిఘనసం దాయిమ్మను
హీజాని ప్రసిద్ధిఁ గాంచె నెంతయు మహిమన్

అట్లు రాజమహేంద్రపురమును గైకొని యందు కొన్నినెల లుండి యాసమీపమున గౌతమీతీరమున నున్న రహితాపురము మొదలుగు మన్నెసంస్థానములను లోఁబఱచుకొని పిమ్మట మఱికొంతదూరము పోయి బాహుబలేంద్రుని వంశస్థులకు కొంతకాలము ముఖ్యపట్టణమై యుండినపొట్నూరును జయించి యందొకజయస్తంభమును నెలకొల్పి మాడుగులు మొదలగు మన్యసంస్థానముల నాక్రమించుకొని మత్స్యవంశస్థుల దగువడ్డాది (ఒడ్డాది) మపి యొనర్చి సింహాచలస్వామిని సందర్శించి యచట దండు విడిసి యుండఁగా గజపతిసైన్యములు గంటికి గానరాక పలాయనము లయ్యెను. అంతటితో రాయలు సంతుష్టి నొందక తిమ్మరుసుమంత్రి వల దని వారించుచున్నను వినక సైన్యములఁ గటకపురికి నడిపింపు మని తిమ్మరుసున కాజ్ఞ చేసెను. అతఁడు సైన్యముల నరణ్యమార్గములగుండఁ గటకపురివఱకుఁ గొనిపోయెను.

## పాత్రసామంతులయుద్ధము.

కృష్ణరాయఁడు తమపట్టణముమీఁద దండెత్తి వచ్చుచున్నాఁ డని విని ౧ బలభద్రపాత్రుఁడు, ౨ దుర్గాపాత్రుఁడు ౩ భీమాపాత్రుఁడు, ౪ ముకుందపాత్రుఁడు ౫ భీకరపాత్రుఁడు

చేరుపాత్రుఁడు, ౭ రణరంగపాత్రుఁడు, ౮ ఖడ్గపాత్రుఁడు ౯ అఖండలపాత్రుఁడు ౧౦ సురాగిపాత్రుఁడు ౧౧ వజ్రముష్టిపాత్రుఁడు ౧౨ తురగరేవంతపాత్రుఁడు ౧౩ గజాంకుశపాత్రుఁడు ౧౪ అసహాయసుపాత్రుఁడు ౧౫ మృగేంద్రపాత్రుఁడు ౧౬ మఱియొక పాత్రుఁడు (పేరు తెలియదు) ఈపదునాఱుగురు పాత్రసామంతులును తమకుఁ గలుగఁజేసిన నవమానమును భరింపఁజాలక రోషావేశపరవశులై ప్రతాపరుద్రగజపతి సన్నిధి కేగి రాయలుగారిని విన్నవించి యవశ్యము గాయనిం గెలిచి పట్టి యిచ్చెద మని పంతములు పలికి యుద్ధమున కనుజ్ఞ యిమ్మని ప్రార్థింపఁగా నాతఁడు మిక్కిలి సంతోషించి యట్లు గావించెను. ఆమహావీరాగ్రగణ్యులైన పాత్రసామంతులు లక్షలకొలఁది సైన్యములం జేర్చుకొని కర్ణాటసైన్యముల నెదుర్కొని ఘోరాహవమును మొదలు పెట్టిరి. అనేకముగాఁ గర్ణాటసైన్యములకు నష్టము కలుగు చుండెను. దేశ మరణ్యమయమై యుండుటయుఁ సైనికులు మార్గాయాసమునకతన రోగగ్రస్తులై యుండుటయు, శత్రుసైనికులు స్థానబలిమిచే స్థిరచిత్తులై నిలిచి పోరాడు చుండుటయును, గన్నులార వీక్షించి కృష్ణరాయఁడు తన కపజయము కలుగు నని యూహించి, తిమ్మరుసు గఱపినహితోపదేశమును బెడచెవిని బెట్టి, యిట్టివిపత్తు తెచ్చిపెట్టికొంటిని గదా యని పశ్చాత్తప్తుఁడగుచు, మంత్రిని బిలువనంపించి, తా నడచిన

మార్గము తప్పనియొప్పుకొని, కర్తవ్య మాలోచింపు మని, బహుభంగులు వేడికొనియెను. అప్పుడు తిమ్మరు సిట్లనియెను.

"దేవా! మనము మనరాజధానిని విడిచి బహుదూరము ప్రయాణముచేసి శత్రుదేశమధ్యమునఁ జిక్కువడి యున్నవారము. దేశ మరణ్యమయమై యుండుటచేత సులువుగా మన సైన్యములను మరలించుకొని పలువిడి పోవుటకు సాధ్యము గాదు. కీడెంచి మే లెంచు మన్నట్లు మన కదృష్టము తప్పెనేని మనసైన్యమంతయు నీకళింగదేశపుటడవులలో హరించి పోవు ననుటకు సందేహము లేదు. అపజయము కల్గినా యింక మనదురవస్థ చెప్పనక్కఱలేదు. మనకు స్థానబలిమి లేదు. వారలకు స్థానబలిమి కలదు. ఇంక ననంఖ్యాకము లగుసైన్యములను గొనివచ్చి గజపతి మనపైఁ బడఁ గలఁడు. జయాపజయములు భగవదాధీనములు. కాని నిప్పటిపోరాటముయొక్కస్థితినిబట్టి చూడ మనకు జయము కలుగు నని తోఁచదు. ఇట్టిసందిగ్ధసమయమున యుద్ధమును మాని వెనుకకు మరలుట ప్రమాదమునకు హేతు వగును. ఏదైన మాయోపాయముచేత నీవిపత్తునుండి తప్పించుకొని కార్యమును సాధింపఁ జూడవలయును గాని విచారించుటవలనఁ బ్రయోజనము లేశమాత్రమును లేదు.

పాత్రసామంతుల మోసపుచ్చుట.

మన కిట్టివిపత్తు కలుగవచ్చు నని నే నూహించినవాఁడ నగుటచేతనే బెజవాడలో నాఁడు యుద్ధము చాలించి వెనుకకు మరలుదమని చెప్పితిని. అయిననేమి? దీనికై చింతింపకుము

ఉపాయముచేత యుద్ధమును మాన్పించి తనకూఁతు నీ కిచ్చి వివాహము చేసి గజపతి నీతోఁడ సంధి చేసికొనునట్లు గావించి ని న్నీ పరిభవమునుండి గాపాడుదును. నమ్ముడు నాశక్తి యని పలికి యాతనిఁ బంపివేసి యిట్లు చింతించెను.

మనుష్యుఁ డైనవాఁడు తనకార్యమును నెఱవేర్చుకొనుటకు సామదానభేదదండములను చతుర్విధోపాయములఁ బ్రయోగింపవలసియుండును. ఇచ్చట సామము పనికిరాదు. దండము సాధ్య మగునది కాదు. దానము భేదము ననురెంటి వలనను కార్యమును సాధింప వచ్చును. పాత్రసామంతులకును వారిప్రభువునకును భేదము పుట్టించినఁ గాని స్వపక్షమునకు జయము సమకూడునట్లు గనుపట్టదు. వంచనచేసి తప్పించుకొనుట కూడ దని శత్రువునకుఁ దలయొగ్గి నాశనము నొందఁ గోరునంతటి యవివేకి లోకములోఁ నెవ్వఁ డుండును? ఇంతప్రఖ్యాతిఁ గాంచిన నాప్రభువునకు నవమానము గలుగు చుండ నుపేక్షించి యూరకుండుట భృత్యధర్మము గాదు. ఇట్టిసందర్భమునఁ జేసినవంచన రాజనీతికి విరుద్ధము గాదు. అని వితర్కించి కొని తిమ్మరుసుమంత్రి పదియాఱ్వురు పాత్రసామంతులపేరను దురాశను గల్పించుజాబులను వ్రాసి విశేషముగా ద్రవ్యమును దెప్పించి పదియాఱుపెట్టెలలో నిండించి యొక్కొక్కజాబు నొక్కొక్కపెట్టెలోనుంచి యాపెట్టెలను బరిచారకులశిరస్సులపై నుంచి శత్రుసైన్యములోనికిఁ బోయి పాత్రసామంతుల కప్పగించి ప్రత్యుత్తరములు తెం డని యాజ్ఞాపించి పంపెను.

వారలు గజపతిసేనలమధ్యనుండి పెట్టెలను గొనిపోవు చుండ గజపతి వారలను బట్టి తెప్పించి యాపెట్టెలను గైకొని యం దుండు లేఖలను దీసి చదువుకొనఁగాఁ దనపాత్రసామంతులు దనకై కుట్రచేసి రాజద్రోహమున కొడిగట్టినట్లు స్పష్టపడి యెను. ఆజాబులలో నిట్లు వ్రాయఁబడియుండెను.

"శ్రీకృష్ణదేవరాయలవారు మీాపద్ధతుల కంగీకరించెను; ఆపద్ధతులప్రకారము గజపతిని బట్టి యిచ్చెద రేని మీారు నిర్ణయించినప్రకారము గ్రామములును, రత్నాభరణములును, ధనమును మీాయధీనము చేసెదము."

ఇట్లుండుటను ప్రతాపరుద్రగజపతి చదువుకొని భీతచిత్తుఁడై తాను తప్పించుకొనిపోవుమార్గము నాలోచించుకొని పాత్రసామంతులకుఁ దెలియకుండ నితరులకు గోచరము గాకుండ దూరమున నున్నమఠియొక్కస్థలమునకుఁ బోయి యచ్చట రహస్యముగా నుండెను. తనప్రభువు యుద్ధభూమి యందుఁ గానరాకుండుటంజేసియు, నతనిక్షేమము దెలియకుండుటంజేసియు వారలు యుద్ధమును ముగించి విచారించుచుండిరి. ఇంతలో వారలకు నొత్తుడు కలుగనీయక తిమ్మరుసుమంత్రి రాయనియాజ్ఞ. గైకొని గజపతికడకుఁ బోవఁ నతఁడు దర్శనవిధానముల బహుమానపురస్సరముగాఁ బూజించి సంధినిగూర్చి ప్రసంగించెను. అందుల కను వగుకేతని తిమ్మరుసు ప్రసంగించి ప్రతాపరుద్రగజపతి రాయనితో సంధిచేసికొని తనకూఁతు నిచ్చి వివాహము గావించుటకు నొడఁబడెను. తరువాత

ప్రతాపరుద్రగజపతి తనకూఁతురు తుకాంబ నిచ్చి వివాహము గావించెను. ఈమెనే యన్నపూర్ణాదేవియని నామము: క్తమాల్యదయందు కృష్ణరాయఁడు మఱియొక నామమునఁ బేర్కొనియెను. శ్రీకృష్ణదేవరాయఁడు సంతోషించి రాజమహేంద్రపురమువఱకును గల దేశమును మరల గజపతి కొసంగి క్రీ. శ. ౧౫౧౬-వ సంవత్సరములోనే పూర్వదిగ్విజయయాత్రను ముగించి స్వస్థానమునకుఁ జేరుకొనియెను. తిమ్మరుసు చేసిన మోసమువలన పాత్రసామంతులకుఁ బ్రాణభంగము కలుగ లేదు. కృష్ణరాయనివిజయప్రతిష్ఠకు భంగము కలుగ లేదు. ప్రతాపరుద్రగజపతికి పదభ్రష్టత్వమును కలుగ లేదు. భవిష్యత్కాలమున నుభయరాజ్యములకుఁ బోరాటము కలుగకుండ బాంధవ్యమును గల్పించెను. ఇంతయును తిమ్మరుసు కృష్ణరాయనితోఁ గూడ నుండుటచే సంభవించినది. అట్లు కానియెడల చరిత్రము మఱియొకరూపమును దాల్చి యుండును.

# నవమప్రకరణము.

## తిమ్మరుసు తురుష్కులను జయించుట.

అట్లు తిమ్మరుసుమంత్రి కృష్ణరాయనితోఁ గలిసి సైన్యమును మరలించుకొని సురక్షితముగా నేతెంచి విజయనగరము ప్రవేశించిన వెనుక గోలకొండసుల్తాను మహమ్మద్ కూలీకుతుబ్ షాహా లక్షసైన్యముతోఁ గొండవీటిపై దండెత్తి వచ్చుచున్నాఁడని తెలియవచ్చెను. అంతట కృష్ణరాయనికిఁ జెప్పి కొంచెములక్షసైన్యములతో, తురుష్కులను జయించి కొండవీటిదుర్గమును సంరక్షించుటకై బయలుదేఱెను. ఇట్లు బయలువెడలి కొండవీటి సమీపించునప్పటికి కుతుబ్ షాహా కృష్ణానదిని దాటి బెల్లముకొండను వశపఱచుకొని కొండవీటిదుర్గము సమీపమునకు వచ్చెను. అప్పు డుభయసైన్యములకు భయంకరమైనయుద్ధము జరిగెను. ఈయుద్ధమునందు ఆర్వీటినారపరాజు తిమ్మరుసునకు కుడిభుజముగానుండి కొండవీటికడ దురుష్కులతో ఘోరయుద్ధము గావించి కుతుబ్షాను దల్లడిల్లఁగొట్టి తఱిమెను. ఇచ్చట సుల్తాను కూలీకుతుబ్షాహా తిమ్మరుసునుగాని రాయనిఁ గాని జయించినాఁడని ఫెరిస్తా వ్రాసినసంగతి సత్యము కాదు. * ఈయుద్ధమునందే తిమ్మరుసు తన్నెదిరిం

---

* ఈయుద్ధములోఁ గుతుబ్షాతో స్వయముగాఁ బోరాడి యాతని నోడించినవాఁడు ఆర్వీటి నారపరాజని కళాపూర్ణోదయములోనియీక్రింద పద్యమువలన స్పష్టపడఁ గలదు.

చిన కుతుబ్షా సేనాని యగుమదాన్ ముల్ ఖానుని భార్యాసమేత ముగాఁ జెఱఁగొని వానిధనకనకవస్తువాహనాదులఁ జూఱఁగొని విజయనగరమునకుఁ బంపివేసెను. ఈ సేనాధిపతి యైనతురుష్కుఁ డామరణాంతము వఱకును జెఱయందే యుంచఁబడెను. ఇట్లు తిమ్మరుసు తురుష్కులను దేశమునుండి పాఱఁద్రోలి కొండవీటి రాజ్యపరిపాలనమును జక్కపఱచుటకు సమకట్టెను.

## తిమ్మరుసు మేనల్లుండ్రు.

తిమ్మరుసు కొండవీడును గజపతులనుండి స్వాధీనపఱచు కొన్నపిమ్మట నాదిండ్ల అప్పామాత్యుని కొండవీటిరాజ్యము నకుఁ బరిపాలకునిగా నియమించెనని యిదివఱకు చెప్పియున్నాఁ డను. తిమ్మరుసు తనతోఁబుట్టు వగుకృష్ణాంబికను నాదిండ్ల తిమ్మామాత్యున కిచ్చె నని ప్రథమప్రకరణమునఁ దెలిపి యున్నాఁడను. ఆదంపతులకు మూవురుపుత్త్రులు గలరు. వారి లో అప్పనమంత్రి రెండవవాఁడు. గోపనమంత్రి మూఁడవ వాఁడు. పెద్దవాఁడైన కోనయమంత్రినిగుఱించి మన కేమి యును దెలియదు. కృష్ణరాయఁడు పూర్వదిగ్విజయయాత్రకు వెడలు నప్పుడు గుత్తిదుర్గాధ్యక్షుఁడుగా నున్నతనతమ్ముని గోవిందరాజదండనాథుని విజయనగరాధ్యక్షునిగ నియమించి

"చ. వదలక యుత్కలేంద్రుని సహాయబలీదు నడంచు దుర్గయుం
గుడుపనమల్కఁ దల్లడిలఁగొట్టె మహాద్భుతసంగరంబులో
నెదిరిచి కొండవీటికడ నెవ్వరు సాటి విచిత్రశౌర్యసం
పదపస నారసింహవిభుపట్టికి నారనృపాలమౌళికిన్."

తిమ్మరుసు తనమూఁడవమేనల్లుని గోపనమంత్రిని గుత్తిదుర్గాధ్యక్షునిగా నిర్ణయించి తనప్రతిష్ఠానమునందు నిలిపెను. * ఇంతవఱకును అప్పనయు గోపనయు దండనాథులుగ నుండిరి. ఇప్పుడు తిమ్మరుసు వీరలను గొప్పరాజ్యములకుఁ బాలకులనుగ నియమించెను. కొండవీటిరాజ్యమునకు గోపనమంత్రిని, వినుకొండ, గుత్తి రాజ్యములకు అప్పనమంత్రినిఁ బరిపాలకులుగా (గవర్నరులను) నియమించెను. కృష్ణరాయనిసామ్రాజ్యమున మంత్రులకును గొప్పసేనానులకు నెట్టిమర్యాదలు జరుగుచుండెనో అట్టిమర్యాదల నన్నిఁటిని వీరు పొందుచుండిరి. వీరలు సంస్కృతాంధ్రభాషలయందు మంచిపాండిత్యము గలవారు. అప్పనమంత్రి మాదయగారిమల్లనకవిచే రాజశేఖరచరిత్రము నంకితమునొందెను. వీరిదానశాసనములు కొండవీడు, వినుకొండసీమలలోఁ బెక్కులు గానవచ్చుచున్నవి. వేదవేదాంగవిదులైన బ్రాహ్మణోత్తముల కనేకుల కగ్రహారములను భూముల నొసంగిరి. దేవస్థానములను జక్కపఱచి దానధర్మములను గావించి సంరక్షించిరి. చెఱువులను దవ్వించిరి. మహోపకార్యము లెన్నో యాచరించి విఖ్యాతిఁ గాంచిరి. అప్పనమంత్రియు గోపనమంత్రియును రామలక్ష్మణులవలె

---

*ఉ. ప్రాపితరాజ్యవైభవనిరాకృతపాకవిరోధి యైనయా
గోపనమంత్రి ధర్మధనగోపనసమ్మతిగుత్తి దుర్గల
క్ష్మాపరిపాలనక్రమసమిద్ధభుజాబలశాలిరూపరే
ఖాపరమత్స్యలాంఛనుఁడయాహవకార్య ధురంధరుండిలన్

(రాజశేఖరచరిత్రము)

నన్యోన్యప్రియులై యలరిరని మాదయగారిమల్లనకవీంద్రుఁడు నొక్క వక్కాణించి యున్నాఁడు. * తిమ్మరుసు దేశమునం దెచ్చుటను శత్రువులను లేకుండఁ జేసి దేశమున శాంతి నెలకొల్పి మేల్లుండ్రను బ్రతినిని పాలకులనుగా నారాజ్యములందు నిలిపి విజయోత్సాహముతో రాజధానికి వచ్చి రాయనిచే ననేకవిధముల సమ్మానింపఁబడియెను.

### రాచూరిదండయాత్ర.

తిమ్మరుసుమంత్రి రాజధాని ప్రవేశించినవెనుకఁ గొన్ని సంవత్సరములు యుద్ధములు మాని రాజ్యాంగవ్యవహారసంస్కరణంబునమాత్రము బుద్ధిని జొనిపి ప్రజాసౌఖ్యమునకై పాటు పడియెను. అయినను క్రీ. శ. ౧౫౨౧-వ సంవత్సరములోఁ గృష్ణరాయఁడు విజాపురసుల్తానుపై దండెత్తిపోయి తురుష్కలను జయించి రాచూరుముదిగల్లుదుర్గములను బట్టుకొని స్వాధీనపఱచుకొనియెను. ఆదిల్ షాహా రాజధాని యగువిజాపురమును విడిచి పాఱిపోయెను. ఈదండయాత్రలోఁ దిమ్మరుసుమాత్రము పాలుగొని యుండ లేదు. తిమ్మరుసుతమ్ముఁడు గోవిందరాజుమాత్రము ముప్పదివేలకాల్బలముతో రాయని వెంటఁ జనియెను. ఏడులక్షలసైన్యమును నడిపించుకొనిపోయి

---

* కం. ఆయనుగుండమ్ముఁడు పిన
నాయతమతిఁ గొల్వ నప్పనార్యుఁడు నతఁడున్
బాయక యన్యోన్యప్రియు
లై యలరిరి రామలక్ష్మణాకృతు లగుచుల్
(రాజశేఖరచరిత్రము)

కృష్ణరాయఁడు తురుష్కులతో ఘోరయుద్ధము చేసి సంపూర్ణ విజయము గాంచినవెనుక విజాపురసుల్తాను సంధిచేసికొని నాఁటి నుండి చాలకాలము విజయనగరప్రభువులతో మైత్రి గలిగి యుండెను. యుద్ధకాలమునందు స్వయముగా తిమ్మరుసుపాలు గొనకపోయినను తిమ్మరుసు చూపినమార్గము ననుసరించిపోయి రాయఁడు విజయమును గాంచెను. అట్లు విజయమును గాంచి కృష్ణరాయఁడు మరలి విజయనగరమునకు వచ్చినవెనుక తిమ్మరుసు రాయని వీక్షించి 'దేవా! సాళ్వనరసింహభూపాలుఁడు గాని మీతండ్రి నరసింహదేవరాయఁడుగాని, మీయన్న వీరనరసింహదేవరాయఁడు గాని సాధింపలేక విడిచినవానిని నీవు సాధించి వశపఱుచుకొంటి' వని బహువిధముల శ్లాఘించెను.

'అప్పా! ఇది యంతయు భవత్కృపావిశేషమువలన నైనదికాని మఱియొండు కా' దని తన కృతజ్ఞతాబుద్ధిని వెలడించెను.

# దశమప్రకరణము

## తిమ్మరుసుపరిపాలనము.

ఏనాఁడు సాళువనరసింహాధరాతలేంద్రుఁడు విజయనగరమునఁ బట్టాభిషిక్తుఁ డయ్యెనో ఆనాఁడు మొదలుకొని నలువది సంవత్సరములకాలమును తిమ్మరుసు విజయనగరంబునఁ గడపెను. సమకాలికులలో నెవ్వనితో సమానుఁ డగుప్రతిభాశాలిదక్షిణహిందూస్థానమునఁ గానరాఁడు. దక్షిణహిందూస్థానమనుమాత్రమె గాదు. భరతఖండమునఁగూడ గానరాఁడని చెప్పవచ్చును. కర్ణాటసామ్రాజ్య మనియెడునీహైందవసామ్రాజ్యముయొక్క కీర్తి ఖండాంతరములఁగూడ వెలయునట్లు చేసెను. రాజకుటుంబములలో జనించినకలహములు నడంచి, అసమర్థులను వెనుకకు నెట్టి సమర్థులను ముందునకుఁ గొనివచ్చెను. తనకాలమునఁ దనకోరిక ననుసరించి నల్వురను పట్టభద్రులను గావింపవలసి వచ్చినను రాజధానీనగరమున నెట్టివిప్లవమును జనింపకుండఁ జేసి నగరమును గాపాడిన మహానీయునికాలమున నెంతయభివృద్ధి కలిగిన దన్నను వింత యేముండును ? బలాఢ్యు లయినశత్రురాజులను జయించి రాజ్యమును విస్తరింపఁజేసెను. సామ్రాజ్యమధ్యమున జనించిన రాజద్రోహము నంతయు నడంచి వైచెను. సామ్రాజ్యమునకు లోఁబడినసామంతరాజులు కప్పములు సరిగా చెల్లించునట్లు

కట్టుదిట్టములు గావించెను. సైన్యములవిషయమై జరిపిన సంస్కరణ మిదివఱకే తెలిపి యున్నాఁడను. సైన్యములఁ బరీక్షించి సైన్యాధిపతులకు సైనికులకుఁ బహుమానము లిచ్చుటకు విజయదశమి యుక్తమైనదినముగఁ జేసెను. తిమ్మరుసు సమర్థు లని తోఁచినప్పుడు బ్రాహ్మణులకు సయితము సైన్యాధిపత్యము లొసంగుచు వచ్చెను. ఈసామ్రాజ్యమున బ్రాహ్మణులలో తిమ్మరుసునకుఁ దరువాత మహాసేనాధిపతిగా నున్నవాఁడు రాయసము కొండమరు సనుకొండమరాజు. కృష్ణరాయనిపూర్వదిగ్విజయయాత్రలోఁగూడ నుండుటయె గాక ఆదిల్ షాహా పై దండెత్తి పోయినపుడు లక్షసైన్యమున కధికారి యై కృష్ణరాయనివెంటఁ బోయి తురుష్కులతో యుద్ధము చేసెను. తిమ్మరుసుతమ్ముఁ డగుగోవిందరాజుగూడ కొండమరుసువంటివాఁడే. ముప్పదివేలసైన్యమున కధికారి యై కృష్ణరాయనివెంటఁ బోయి తురుష్కులతో యుద్ధము చేసి ఖ్యాతిఁ గాంచినవాఁడే. తిమ్మరుసుకొడుకు గోవిందరాజుకూడ దండనాథుఁడుగ నుండెను. అల్లసాని పెద్దిరాజు (పెద్దనామాత్యుఁడు) నంది తిమ్మనామాత్యుఁడు, కవులుమాత్రమె గాక మండలాధిపతులుగఁగూడ నుండిరి. తిమ్మరుసు మేనల్లుండ్రను గూర్చి వ్రాసియే యున్నాను. తిమ్మరుసు రాజ్యపాలనము వహించినదిమొదలుకొని మహాసేనాధిపత్యములు మండలాధిపత్యములు తెలుఁగువారికే లభించు చుండెను. తిమ్మరుసు కాలమునాటినుండియు సామ్రాజ్యమునఁ బలుకుఁబడి తెలుఁగు

వారికే యెక్కువగ నుండెను. విస్తీర్ణమునఁ బెరిఁగినది సామ్రాజ్యముమాత్రమె గాక రాజధానీనగరముకూడ పెరిఁగినది. నాగలాపురము మొదలగునవి నూతనముగాఁ గట్టఁబడినవి. మంచిబాట లేర్పడినవి. నగరమునకు మంచినీటివసతి యేర్పాటు చేఁబడినది. మహానగరమంతయు జనవృద్ధియు, వస్తుసమృద్ధియు గలిగి వఱలు చుండెను. నగరాకృతిని వీక్షించి నప్పుడును, నగరైశ్వర్యమును దలపోసికొన్నప్పుడును పాశ్చాత్యులకునయితము దిగ్భ్రమను బుట్టించి ప్రపంచమున నిట్టిమహానగరమునెందును జూడ లేదని యచ్చెరు వందున ట్లుంచెను. తిమ్మరుసునకు సమకాలికులైనపోర్చుగీసుచరిత్రకారు లెందఱో యామహానగరవైభవమును గన్నులారఁ గాంచి యిట్టినగరము ప్రపంచమున లేదని యభివర్ణించి యున్నారు. అట్టివర్ణనములసామ్రాజ్యచరిత్రమునఁ బాఠకులు పఠింతు రని యిందువ్రాయ విరమించినాఁడను. మఱియు నీతనిప్రోత్సాహముననే నూతనము లైన దేవాలయములును మందిరములును, పట్టణములును కాలువలును నిర్మింపఁబడి శిల్పకళ లభివృద్ధి గావింపఁబడియెను. సామ్రాజ్యమున భూమి యంతయుఁ గొలత వేయఁబడినది. సుంకములు కొన్ని మాన్పింపఁ బడినవి. పూర్వము వివాహముపై సుంకము వేయుచుండిరి. ఇతఁడు దానిని మాన్పించెను. దొరతనమువారిద్రవ్యముతోఁ బ్రజోపకారకము లైనకార్యములు నెఱవేర్పఁబడినవి. ఇతనికాలమున సంస్కృతాంధ్రకర్ణాటభాష లభివృద్ధి గాంచినవి. ఆంధ్రమునకు గౌరవము

హెచ్చినది. ఇతఁడు దేవాలయములకును విద్వాంసు లయిన బ్రాహ్మణులకు భూదానములను బెక్కులను గావించుటయె గాక కృష్ణరాయునిచేతఁగూడ ననేకదానములను జేయించెను. మఱియు శైవ మని, వైష్ణవ మని భేద మెంచక శివాలయములకును విష్ణ్వాలయములకును సమముగా దానధర్మములను జరుపుచు వచ్చెను. ఈతనిమార్గమునే యవలంబించి కృష్ణరాయఁడుకూడ రెంటియందును సమభావముతో వర్తించెను. శైవులను వైష్ణవులనుగూడ సమదృష్టితోఁ జూచెను. వీరిని మాత్రమె గాదు. జైనులపట్లకూడ సహనము వహించి జైను పండితులఁగూడ నాదరించుచు వచ్చెను. ఇట్లు హిందూజైన మతములుమాత్రము గాక క్రైస్తవమహమ్మదీయమతములు గూడ వ్యాప్తము లగు చున్నను తిమ్మరుసు శతృత్వమును బూనియుండ లేదు. తన సైన్యములోఁ గొందఱు మహమ్మదీయులనుగూడఁ జేర్చుకొని వారియుపయోగార్థము విజయనగరమున మసీదు గట్టించెను. అందువలన తిమ్మరుసుపరిపాలనము సర్వజనసమ్మత మైనదిగా నుండెను. పాశ్చాత్యు లైనపోర్చుగీసువారితో నెప్పుడును విరోధము పెట్టుకొన లేదు. గోవా పరిపాలకులను గౌరవముతోఁ జూచుచు వచ్చెను. ఆబాలవృద్ధులు తిమ్మరుసునకు వినయవిధేయు లై వర్తించిరి. విదేశములతోడివ్యాపారము విస్తరింపఁజేయఁబడినది. సామ్రాజ్యవిభవ మపార మై యుండె నని పాశ్చాత్యుల వర్ణనములనే ప్రత్యక్షసాక్ష్యములనుగాఁ జూపవచ్చును. ఏసమయమం దైనను అవ

సరమైనయెడల యిరువదిలక్షలసైన్యమును సమకూర్చుట కనువు గల్పించెను. వేయునేల! తిమ్మరుసుమంత్రి లేనియెడల కృష్ణదేవరాయఁడును లేఁడని తలంపవలయును. కృష్ణదేవరాయని రక్షించినవాఁడు తిమ్మరుసు; కృష్ణదేవరాయనిఁ బోషించినవాఁడు తిమ్మరుసు; కృష్ణదేవరాయనికి రాజ్య మిప్పించినవాఁడు తిమ్మరుసు; కృష్ణదేవరాయని దిగంతవిశ్రాంతయశస్కుని గావించినవాఁడు తిమ్మరుసు; అట్టితిమ్మరుసు తెలుఁగుదేశమునఁ బుట్టినవాని కెవ్వనికిఁ బూజ్యుఁడు గాక యుండునా?

## అంత్యదశ.

శ్రీకృష్ణదేవరాయనికి వాంఛ లన్నియుఁ దీఱినవెనుక నొకదుర్బుద్ధి పుట్టెను. తాను బ్రదికియుండగాఁ దనకుమారుఁడు పట్టాభిషిక్తుఁడు గా వలయు నని తలంచెను. తనమరణానంతరము తనతమ్ముఁడు గాని, తనయన్నకొడుకు కాని తనకొడుకును దఱిమివేసి సింహాసన మాక్రమించుకొందు రన్నభయము జనించెను. తిమ్మరుసు గాని, తిమ్మరుసుతమ్ముఁడు గాని తనకుమారునకుఁ దోడ్పడకున్నయెడల రాజ్యము తనకుమారునకుఁ దక్కదనుగట్టిసందేహము పుట్టెను. తిమ్మరుసునెడ నవిశ్వాసమంకురించెను. దేశ మంతయుఁ దిమ్మరుసుపలుకుఁబడిలో నుండెను. తిమ్మరుసు బంధువులు మిత్రులు ననేకులు గొప్పపదవులం దుండిరి. వారిప్రాపు లేకున్నఁ దనకొడుకు పట్టాభిషిక్తుఁడగుటసంభవింప దని తలపోసెను. ఇట్టికుటిలబుద్ధితో నాఱేండ్లబాలుని గ్రీ౹ ౧౫౨౪వ సంవత్సరములో సింహాసన మెక్కించి

తాను మంత్రియై కార్యనిర్వాహకర్తగ తిమ్మరుసు నేర్పఱచి పరిపాలనము చేయ నారంభించెను. తిమ్మరుసుకొడుకు గోవిందరాజునకు సేనాధిపత్య మొసంగెను. ఎనిమిదిమాసములు సామ్రాజ్యమునం దంతట మహోత్సవములు సలుపఁబడె నఁట! ఆకస్మికముగా నొక్కనాఁ డేదో జాడ్య మంకురించి యాబాలరాజు మృతినొందుట సంభవించెను. తా నొకటి తలంచిన దైవము వేఱొకటి తలంచెను. తిమ్మరుసుకొడుకు విషము పెట్టిచంపించెనన్నదుర్వార్తయొకటి రాయనిచెవినిఁ బడియెను. అతఁ డాదుర్వార్త నిశ్చయ మని నమ్మి క్రోధావేశపరవశుఁడై తిమ్మరుసు మంత్రిని, దళవాయి యైనయతనిపుత్త్రునిగోవిందరాజును, నగరాధ్యక్షుఁడైనయతనితమ్మునిగోవిందరాజును, వారిబంధువులను, ప్రభువరులను, దండనాథులను నెల్లవారిని రప్పించి కొలువు దీర్చి తిమ్మరుసుమొగము గాంచి యిట్లు పలికెను.

‘‘నిన్ను ప్రాణమిత్త్రునిగా నెప్పుడును జూచుకొనుచున్నాను. నీవు నా కిచ్చినయీరాజ్యమునకంతకును నీవే పాలకుఁడవుగా నుంటివి. అయిన నందులకు విశ్వాసముఁ జూపఁజాలను. ఎందు కన నీకు విధ్యుక్తమైనకార్యమును నెఱవేర్చుటయందు మాకుఁ బ్రతికూలముగాఁ బ్రవర్తించితివి. నీప్రభువగు నాయన్నగారు నా నేత్రములను తీయించివేయవలసిన దని నీకాజ్ఞ చేసినప్పుడు. నారియాజ్ఞకు నీవు లోఁబడవలసినవాఁడవై యుండియు నతనియాజ్ఞను జెల్లింప లేదు. అతనికి విధే

యుండవలెనుగా లేదు. మీరాకుముక్కలి మేఁకకన్నులు పెట్టె కించి తెప్పించిచూపి మోసపుచ్చినాఁడట. అందువలన నీవును నీతినయులును రాజద్రోహులైరి. ఇప్పుడు నాయనయునకు విషముపెట్టి చంపఁ బూనిరని తెలిసినది. అందుకొఱకే మీపుత్రులను జెఱసాలలో ఖైదీలనుగాఁ జేసితినని చినాలుఁ లేచి వారందఱం బట్టుకొని తనకును తనరాజ్యమునకును నేయుపాయమునఁ గలుగ కుండఁ గాపాడుచున్నవారిని త్రొక్కిపట్టుట మాని పాలింపఁ జేసెను.

ఇట్లు తిమ్మరుసు తమ్మునితోను కొడుకుతోను బట్టువడి చెఱసాలం బ్రవేశింపఁబడియెను. కాని తిమ్మరుసునకుఁ గల కట్లో చెఱసాలనుండి తప్పించుకొనిపోయి తనబంధువు సనుదొరదుర్గాధ్యక్షునికడకుఁ జేరి సైన్యముం గూర్చుకొని రాయలతో యుద్ధము చేయుటకు సంసిద్ధుఁడయ్యెను. అయినను రాయలు అసంఖ్యాకంబు లగుసైన్యములను బంపఁగా రాయలసైన్యములకును తిమ్మరుసుకొడుకగు గోవిందరాజునకును గొప్పయుద్ధము జరిగిన వెనుక గోవిందరాజు శత్రువుచేఁ జిక్కెను. అంత నాశత్రువు వానిని బట్టుకొనివచ్చి రాయనికి నొప్పగించెను. కృష్ణదేవరాయలు క్రూరుఁడై కృతఘ్నుఁడై యాముసలివాని కన్నులను పీకించివేసెను. ఆవృద్ధ బ్రాహ్మణుఁడు చెఱసాలలో మూఁడుసంవత్సరము లుండి స్వర్గస్థుఁ డయ్యెను.

ఈకథ వ్రాసినవాఁడు నన్నిజ్ అను పోర్చుగీసుచరిత్రకారుఁడు. ఇతఁడు రాయలకు సమకాలికుఁడు గావున నసత్యమని త్రోసివేయ రాదు. తిమ్మరుసు గాని, కుమారుఁడు గోవింద

రాజు గారి, రాయనికుమారునకు విషప్రయోగము గావింప వలసిన కారణము గాన రాదు. గోవిందరాజు సేనాధిపత్య ము సంగి న్నాదరించి గౌరవించి గొప్పపదవికిఁ గొనివచ్చిన ప్రభువునెడ విశ్వాసము లేక ప్రభుపుత్త్రునకు విషప్రయోగము చేసెనను మాట యెంతవిశ్వాసపాత్రము గునో దెలియ రాదు. తిమ్మరుసునకు విరోధు లగువారు వీరి పై నీదోష మారోపించి యుండవచ్చును. ఇందలి నిజ మేమో లోక మెఱుంగదు. ఇంతకును వారి దురదృష్ట మట్లున్నది.

స మా ప్త ము.

---

శ్రీవిద్యానిలయముద్రాక్షరశాల, రాజమండ్రి.